అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
ఆదివారం 06 -01-2019
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 9 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 8.00



వాస్తవాలను దాచితే.. పరిస్థితులు మరింత సంక్లిష్టం

రాఫెల్ డీల్‌పై జేపీసీకి శత్రుఘ్న సిన్హా సుముఖత

వివరాలు 9లో

తప్పులతడక ఓటర్ల జాబితాకు.. రాష్ట్ర ఎన్నికల సంఘానిదే బాధ్యత



పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి : హైకోర్టు

వివరాలు 9లో



17న కొత్త శాసనసభ షురూ

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్

- 16న రాజ్‌భవన్‌లో ప్రమాణం
- 18న స్పీకర్ ఎన్నిక
- 20 వరకు సభ కొనసాగింపు 3లో..



మోడీ X గడ్కరీ

హిందీ రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలతో సంఘ్ శ్రేణుల్లో నిరుత్సాహం

- మొన్న మోడీ, అమిత్‌షా ద్వయంపై.. తాజాగా దేశంలో నిరుద్యోగ సమస్యపై కేంద్రమంత్రి వ్యాఖ్య
- గడ్కరీ వెనుక ఆర్‌ఎస్‌ఎస్

సార్వత్రిక ఎన్నికలకు ముందే బీజేపీ ప్రధాని అభ్యర్థిని మార్చటం ఖాయమా..! మోడీ మ్యాజిక్ పని చేయటం లేదా..? లేక తమ చెప్పుచేతుల్లో నుంచి మోడీ, అమిత్‌షాలు వెళ్లిపోయారని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తున్నదా.. గడ్కరీని తెరపైకి తెచ్చి మోడీని మరోసారి తమ రిమోట్‌తో ఆర్‌ఎస్‌ఎస్ నడిపించాలనుకుంటున్నదా.. గడ్కరీ దూకుడు వెనుక ఆర్‌ఎస్‌ఎస్ పావులు కదుపుతున్నదా.. ఇప్పుడు ఇదే హాట్ టాపిక్..



వివరాలు 9లో

ప్రశంసలే.. పైసల్లేవ్

బీజేపీ నీచరాజకీయానికి పరాకాష్ట



- మా పథకాలకు అవార్డులొస్తున్నాయి.. : టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఇతర రాష్ట్రాల నుంచి అభినందనలు, అవార్డులొస్తున్నాయి, కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మిషన్ కాకతీయ ,మిషన్ భగీరథకు అనేక ప్రశంసలు వచ్చాయని చెప్పారు. శనివారం టీఆర్ఎస్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. నిటి ఆయోగ్ మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు 24 వేల కోట్ల సాయాన్ని ఇవ్వాలంటూ ప్రతిపాదిస్తే, అర్జున్ మేఘ వాల్ తిరస్కరించారని చెప్పారు. ప్రధాని మోడీ కూడా మన్ కీ బాత్ లో ప్రశంసలు కురిపించారని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీకి పట్టు లేకపోవడంతో సాయం చేయడానికి ఇష్టపడడం లేదన్నారు. ఇది బీజేపీ నీచ రాజకీయానికి పరాకాష్టగా మారుతుందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం సాయం ఆఘమేఘాల మీద అందజేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

ఏపీలో చేపట్టిన పోలవరం ప్రాజెక్టుకు 95శాతం నిధులిస్తున్న కేంద్రం, తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు కనీసం జాతీయ హోదా ఇవ్వడానికి కూడా ఇష్టపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందని విమర్శించారు. బీజేపీ వైఖరి గమనించిన తెలంగాణ ప్రజలు 103 స్థానాల్లో ఆపార్టీకి డిపాజిట్లు లేకుండా చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వైఖరి నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించినట్టుగా ఉందని విమర్శించారు. పార్లమెంటులో ఈ అంశంపై తమ ఎంపీలు నిలదీస్తారని చెప్పారు.



ఈసారి నల్లగొండ నుంచి ఎంపీగా..

కేసీఆర్ యోచన...?

- గుత్తాకు మంత్రి పదవి
- రైతు సమన్వయ సమితి చైర్మెన్‌గా ముత్యంరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఈసారి నల్లగొండ నుంచి పార్లమెంటుకు పోటీ చేయనున్నారా..? అంటే అవుననే అంటున్నాయి అధికార పార్టీ వర్గాలు. ఇప్పటికే కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్‌ల నుంచి ఎంపీగా పోటీ చేసిన ఆయన.. ఈ సారి నల్లగొండ నుంచి బరిలోకి దిగేందుకు యోచిస్తున్నారని తెలిసింది. 2014 ఎన్నికల్లో ఆయన మెదక్ నుంచి ఎంపీగానూ, అదే జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగానూ పోటీ చేసి గెలుపొందిన సంగతి ...9లో

హింసోన్మాదం

కేరళలో లెఫ్ట్ నాయకుల ఇండ్లపై హిందూత్వశక్తుల బాంబు దాడులు





వివరాలు 9లో

చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కోటి కాల్స్



నాలుగేండ్లలో మూడింతలు పెరిగిన వైనం

వివరాలు 2లో

వివాహితపై లైంగిక దాడి

భద్రాద్రి జిల్లాలో దారుణం

నవతెలంగాణ - గుండాల

వివాహితపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి జిల్లా గుండాల మండలం యాపలగడ్డకు చెందిన గిరిజన మహిళ మూడు రోజుల కిందట మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్లో చదువుకుంటున్న తన కుమార్తె దగ్గరకు వచ్చింది. తిరిగి గ్రామానికి వస్తుండగా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామానికి చెందిన కుంభం వీరబాబు లైంగిక దాడి చేశాడు. అయితే, మూడు రోజులుగా నీరసంగా ఉంటున్న ...9లో

మే 3 నుంచి ఎంసెట్

9 వరకు రాతపరీక్షలు

- నిర్వహణ బాధ్యత జేఎన్టీయూహెచ్‌కే
- మే 23, 24 తేదీల్లో ఐసెట్
- ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి
- త్వరలోనే కన్వీనర్ల నియామకం : పాపిరెడ్డి



వివరాలు 9లో

బుల్లెట్ ప్రూఫ్ కార్ల చార్జీలు చెల్లించండి

కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, జానారెడ్డిలకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం నోటీసులు

- రూ.8.99 లక్షలు చెల్లించాలని వెల్లడి



నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాడిన బుల్లెట్ ప్రూఫ్(బీపీ) వాహనాల చార్జీలను చెల్లించాలంటూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కుందూరు జానారెడ్డి, షబ్బీర్ అలీలకు రాష్ట్ర సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ విభాగం (ఐఎస్‌డబ్ల్యూ) నోటీసులు ఇచ్చింది. ఈ ఇద్దరు నాయకులు చెల్లించాల్సిన రూ.8.99 లక్షల ...9లో

ఐఏఎస్ చంద్రకళ ఇంట్లో సోదాలు

తెలంగాణకు చెందిన మహిళా ఉన్నతాధికారి

- అవినీతి అధికారులకు ముచ్చెమటలు పట్టించినందుకే..!
- యోగి సర్కార్ టార్గెట్ ఎవరు..అఖిలేశా..? చంద్రకళా?

లక్నో : తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారులు సోదాలు అటు యూపీ, ఇటు తెలంగాణలోనూ చర్చనీయాంశంగా మారాయి. ఇసుక తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడినట్టు చంద్రకళపై ఆరోపణలు రావటంతో 12 చోట్ల ఏకకాలంలో తనిఖీలు జరపటం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. కాగా, తమను వ్యతిరేకించే పార్టీల నేతలపై బీజేపీ సర్కార్ సీబీఐని ఉసిగొల్పుతున్నట్టు విమర్శలొస్తున్నాయి. తాజాగా యూపీలో సీబీఐ సోదాలు.. మోడీ సర్కార్ వ్యూహంలో భాగంగానే జరుగుతున్నట్టు ఐఏఎస్ వర్గాల్లో వినిపిస్తున్నది.


(ఫైల్)

టార్గెట్ ఎవరు?

చంద్రకళ స్వస్థలం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా. యూపీ కేడర్ నుంచి 2008 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. హమీర్‌పూర్, మధుర, బులంద్‌షెహర్ జిల్లాలకు కలెక్టర్‌గా ...9లో

సార్వత్రిక సమ్మెతో సత్తాచాటుదాం

8న హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన, సభ

- 8,9 తేదీల్లో జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ఆందోళనలు : కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ పిలుపు


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్తంగా చేస్తున్న రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు రాష్ట్రంలోని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. 8వ తేదీన హైదరాబాద్ నగరంలో భారీ ప్రదర్శన, సభ నిర్వహిస్తామని, రెండురోజుల్లో జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు సమ్మె సందర్భంగా చేపట్టాలని నిర్ణయించింది. సమ్మెకు ప్రజలు, మేధావులు, వివిధ రాజకీయ పార్టీలు, సార్వత్రిక సమ్మెకు పూర్తి సహకారం అందించాలని కోరింది. సమ్మెలో కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోగల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు వక్తలు ...9లో


మాట్లాడుతున్న సాయిబాబు

ముగ్గురు యూపీ మంత్రుల కార్యదర్శులు అరెస్టు

- లంచం డిమాండ్ చేసినందుకే
- స్టింగ్ ఆపరేషన్‌లో బయటపడ్డ దృశ్యాలు



లక్నో: లంచం తీసుకుంటున్నారన్న కారణంతో ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు రాష్ట్రమంత్రులకు చెందిన వ్యక్తిగత కార్యదర్శులను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అరెస్ట్ చేసింది. విధానసభ పరిసరాల్లో లంచాలు తీసుకుంటూ వారు మీడియా కంటికి బుధవారం చిక్కిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తునకు అడిషనల్ డీజీ రాజీవ్‌క్రిష్ణన్ ఆధ్వర్యంలో సిట్‌ను ఏర్పాటు చేస్తూ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీచేశారు. ఈ ఘటనపై సిట్ నివేదికను గురువారం ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిశీలించారు. అనంతరం ఆ ముగ్గురు కార్యదర్శులను సీఎం యోగి సస్పెండ్ చేశారు.

మోడీ కంటే తీవ్రవాది బెటర్!

- ప్రధాని కపటనీతి ఆపాలని కె నారాయణ హితవు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

భారత ప్రధాని నరేంద్రమోడీ కంటే తీవ్రవాదే బెటర్ అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అభిప్రాయపడ్డారు. ఆయన కంటే మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం నయమంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు పై ప్రధాని కపటనీతి ఏంటని ఆయన నిలదీశారు. కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయం విషయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ భిన్నంగా ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. మహారాష్ట్రలోని శనిసింగాపూర్ ఆలయం విషయంలో కోర్టు తీర్పును బీజేపీ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. కేరళలో మాత్రం తీర్పును ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా ఉన్నా జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. శనివారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శనిసింగాపూర్‌లో కోర్టు తీర్పును పాటించి మహిళలకు ప్రవేశాన్ని కల్పిస్తే.. కేరళ అయ్యప్ప ఆలయ విషయంలో బీజేపీ, వీహెచ్‌పీ, ఆరెస్సెస్‌లు అల్లర్లు సష్టిస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రంలో ఆ పార్టీ నేతలు ఓ తీరుగా, ఇతర పార్టీల ముఖ్యమంత్రులు ఉన్న చోట భిన్నంగా ప్రవర్తించడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకు అన్ని వామపక్ష, ప్రజాస్వామిక, లౌకిక పార్టీలు ఏకం కావాలని ఆయన కోరారు.

బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్

- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానంటూ ట్వీట్

బెంగళూరు: దక్షిణాది ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ తాను పోటీ చేయబోయే లోక్‌సభ స్థానంపై స్పష్టత నిచ్చారు. కర్నాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజ కవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తానని శనివారం ట్వీట్ చేశారు. తన రాజకీయరంగ ప్రవేశంపై సానుకూలంగా స్పందిస్తూ ప్రోత్సహిస్తున్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోటీపై మరికొన్ని రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు. బెంగళూరు సెంట్రల్ పార్లమెంటు పరిధిలో వచ్చే ఎనిమిది నియోజకవర్గాలతో పాటు ఆయన ఫోటోను ప్రకాశ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. చివరగా సిటిజెన్స్ వాయిస్ ఇన్ పార్లమెంట్ అనే హాష్‌ట్యాగ్‌తో ట్వీట్‌ను ముగించారు. ప్రస్తుతం బెంగళూరు సెంట్రల్ ఎంపీగా బీజేపీకి చెందిన పీసీ మోహన్ ఉన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగాపోటీ చేస్తానని తన రాజకీయరంగ ప్రవేశంపై ప్రకాశ్‌రాజ్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

గల్ఫ్ దేశాల్లో భారత కార్మికుల భద్రత ప్రశ్నార్థకం

- ఐదేండ్లలో 28వేల మందికిపైగా మృతి:
- లోక్‌సభలో కేంద్ర మంత్రి వెల్లడి

ఢిల్లీ: గల్ఫ్ దేశాల్లో భారత కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి రక్షణ కల్పించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. గల్ఫ్‌లో భారత కార్మికుల మరణాలపై లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన సమాచారమే దీనికి బలాన్ని చేకూరుస్తున్నది. 2014 నుంచి 2018 మధ్య గల్ఫ్ దేశాలైన బహ్రైన్, కువైట్, ఒమన్, కతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లలో 28,523 మంది భారత కార్మికులు మృతి చెందారని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. పాటియాలా ఎంపీ ధరమ్‌వీరా గాంధీ అడిగిన ప్రశ్నకు ఆ శాఖ సహాయ మంత్రి వికె సింగ్ సమాధానమిచ్చారు. ఆయా దేశాల్లోని భారత ఎంబసీల వద్ద ఉన్న లెక్కల ప్రకారం.. భారత కార్మికులు అధికంగా మృతి చెందిన గల్ఫ్ దేశాల్లో సౌదీఅరేబియా ఉంది. ఇక్కడ 2014-18 మధ్య 12,828 మంది కార్మికులు మృతి చెందారు. ఆ తర్వాతి స్థానంలో యూఏఈ(7,877 మంది) ఉన్నది.

2050లోపు మహారాష్ట్రీయ ప్రధాని

- సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

ముంబయి: రానున్న 30 ఏండ్లలో మహారాష్ట్రకు చెందినవారు ప్రధాన మంత్రి పదవిని అలంకరించవచ్చునని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. అంతర్జాతీయ మరాఠీ సమ్మేళనం ప్రారంభోత్సవ సెషన్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2050లోపు మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ప్రధాన మంత్రి పదవి అయ్యే అవకాశమున్నదా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'ఎందుకు కాలేదు.. దేశాన్ని వాస్తవంగా పాలించినవారు మహారాష్ట్రీయులే. మనకు అటోక్ చేరే సామర్థ్యం ఉన్నది.

తేజస్ ఎంకే1 తయారీ హెచ్‌ఏఎల్ చేతికి

- సీఈఎంఐఎల్ఏసీ ఆమోదం

న్యూఢిల్లీ: తేలిక పాటి యుద్ధవిమానం తేజస్ తదుపరి వెర్షన్ తయారీ బాధ్యతలు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)కు దక్కాయి. ఆయుధీకరణ తేజస్ యుద్ధవిమానం(తేజస్ ఎంకే1) తయారీని ఫైనల్ ఆపరేషన్ క్లియరెన్స్(ఎఫ్ఓసీ) కింద ప్రారంభించాలని సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తినెస్ అండ్ సర్టిఫికేషన్ (సీఈఎంఐఎల్ఏసీ) ఆమోదం తెలిపింది. భారత వాయు సైన్యం (ఐఏఎఫ్)లో సేవలు అందించడానికి ఉద్దేశించిన తేజస్ ఎన్నో ప్రత్యే కత లను కలిగి ఉంటుంది. యుద్ధ సమయంలో ఉండవల్సిన సామర్థ్యాలు దీనికి ఉంటాయి. గాలిలో ఉండగానే ఇంధనాన్ని తిరిగి నింపుకోవడం, వివిధ బాంబులు, ఆయుధాలతో పాటు ఇతర అడ్వాన్స్ టెక్నాలజీ దీనిలో ఉంటాయి.

చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కోటి కాల్స్

- నాలుగేండ్లలో మూడింతలు పెరిగిన వైనం

న్యూఢిల్లీ : బాల బాలికలకు అత్యవసర చేయూత కోసం తీసుకొచ్చిన హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు ఫోన్ చేస్తున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. 2017-18లో 1098కు 1,15,59,750 మంది ఫోన్ చేసినట్టు కేంద్రం వెల్లడించింది. గడిచిన నాలుగేండ్లలో చైల్డ్‌లైన్‌కు కాల్ చేసే వారి సంఖ్య మూడింతలు పెరగడం గమనార్హం. లోక్‌సభలో సభ్యుడొకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ సహాయ మంత్రి వీరేంద్రకుమార్ వెల్లడించారు. కాల్స్ పెరగడానికి చిన్నారులపై పెరుగుతున్న వేధింపులే ప్రధాన కారణమని తెలుస్తున్నది. 2013-14లో చైల్డ్‌లైన్‌కు 38,22,081 ఫోన్‌కాల్స్ రాగా.. 2017-18కి వచ్చేసరికి ఇవి మూడింతలు పెరిగాయి. 2017-18లో వచ్చిన మొత్తం కాల్స్‌లో 7,09,202 మంది ప్రత్యక్ష జోక్యం(వైద్యసాయం, షెల్టర్, రక్షణ) కోరినట్టు వీరేంద్రకుమార్ తెలిపారు. కాగా.. వీరిలో 2,18,266 కాల్స్‌కు ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని సత్వర చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. ఆపదలో ఉన్న బాల బాలికల నుంచి ఫోన్ కాల్స్‌ను స్వీకరించిన హెల్ప్‌లైన్ కేంద్రాలు.. సత్వర చర్యల కోసం అవసరానికనుగుణంగా పోలీసులు, ఆస్పత్రులు, శిశు సంరక్షణ కేంద్రాలను సమాచారాన్ని చేరవేస్తుంటాయి. దాని ద్వారా చిన్నారుల సమస్యను పరిష్కారం లభించే వీలు కలుగుతుంది.

ఆగ్రా కార్మికులకు కష్టకాలం

పెనం మీద నుంచి పొయ్యిలో పడటమంటే ఇదే. ఈ మాట ఆగ్రాలోని పాదరక్షల తయారీ పరిశ్రమకు అతికినట్టు సరిపోతుంది. మోడీ సర్కార్ ఎంచుకున్న నోట్లరద్దు, జీఎస్టీ నిర్ణయాలు...'ఆగ్రా' కార్మికుల్ని కష్టాల ఊబిలోకి నెట్టివేశాయి. తమ ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 18శాతం పన్నులు విధించటం న్యాయమా? అని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- చేతి నిండా పని, జేబులో డబ్బు లేకుండా చేశాయి
- కార్మికులకు కనీసం రూ.10వేలు కూడా రావటం లేదు
- మంచి ఆహారం, చదువుకు దూరమవుతున్న పిల్లలు

పాదరక్షల తయారీపై నోట్లరద్దు, జీఎస్టీ, గో పరిరక్షణ దెబ్బ



న్యూఢిల్లీ : సాఫ్ట్‌వేర్‌కు బెంగుళూరు ఎలాగైతే రాజధానిగా చెప్పుకుంటామో, బూట్లు, చెప్పుల తయారీ పరిశ్రమకు 'ఆగ్రా' రాజధానిగా చెప్పక తప్పదు. విదేశాలకు ఎగుమతి అవుతున్న పాదరక్షల్లో 25శాతం ఆగ్రాలో తయారైనవే. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది కుటుంబాలు పాదరక్షల తయారీ పరిశ్రమపై ఆధారపడ్డాయి. ఇంత పెద్ద ఎత్తున విస్తరించిన ఈ పరిశ్రమ ఇప్పుడు అనేక సమస్యలతో తల్లడిల్లుతోంది. ఇందులో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులంతా జనవరి 8-9 జరగబోయే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నారు.

చెప్పులు, బూట్లు తయారీ కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. రాత్రిపగలు పనిచేసినా వారికి దక్కుతున్న ఆదాయం అంతంత మాత్రమే. పిల్లలకు మంచి చదువు, ఆహారం అందించడమన్నది పెద్ద సవాల్‌గా మారింది. జీఎస్టీ, నోట్లరద్దు, గో పరిరక్షణ...వంటివి ఆగ్రా చెప్పుల తయారీ పరిశ్రమను దారుణంగా దెబ్బకొట్టింది. ఆగ్రాలో మూడోవంతు జనాభాకు ఆధారం 'చెప్పుల తయారీ' పరిశ్రమనే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ఏండ్లుగా కొనసాగుతున్న నిర్లక్ష్యం పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టివేసింది.

ఉచిత విద్యుత్ ఆపేశారు...జీఎస్టీ వేశారు

మోడీ సర్కార్ తీసుకొచ్చిన కొత్త పన్నుల విధానం జీఎస్టీ వల్ల చిన్న మధ్యస్థాయి తయారీదారులు తీవ్రంగా నష్టపోయారనీ, పన్నుల విధానం గురించి వీరికి పెద్దగా అవగాహన లేదనీ బూట్ల తయారీదారుడు రాజ్ కుమార్ అన్నారు. "పెద్ద పెద్ద ఫ్యాక్టరీల నుంచి ఆర్డర్లు తెచ్చుకుంటాం. సింథటిక్ లెదర్ కట్టింగ్‌కు రూ.4, బూట్ల ఉపరితల భాగం తయారీకి రూ.15-20, కింది భాగానికి రూ.5 ఇస్తారు. బూట్ల తయారీ మొత్తం ఏడు అంచెలుగా ఉంటుంది. ప్రతీ రోజు 10గంటలు పనిచేసినా ఒక కార్మికుడికి రూ.6వేల-8వేలు మాత్రమే వస్తున్నాయి. అది కూడా సంవత్సరంలో ఆరు నెలలు మాత్రమే పని ఉంటోంది" అని రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్యాక్టరీకి వెళ్లకుండా చెప్పుల తయారీ, బూట్ల తయారీ అన్నది పూర్తికాదు. అక్కడ ఉండే పెద్ద పెద్ద యంత్రాలతో పని పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫ్యాక్టరీలలో పనిచేసేవారికి కూడా తక్కువ జీతభత్యాలు అందుతున్నాయి. ఇంతకు ముందు ప్రభుత్వం అమలుజేసిన ఉచిత విద్యుత్ పరిశ్రమను ఆదుకుంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని ఆపేశారు. పోగా నోట్లరద్దు, జీఎస్టీ అమల్లోకి తెచ్చారు. ఈ పరిణామం చిన్నమధ్య స్థాయి తయారీదారులను దారుణంగా దెబ్బకొట్టింది. కార్మికుల ఖర్చులు విపరీతంగా పెరిగాయిగానీ, వారి ఆదాయం మాత్రం పెరగలేదు.

గో హత్యలు, మూక హత్యలు పెరగటం, గో పరిరక్షణ అన్నది పెద్ద ఎత్తున తెరమీదకు రావటం 'లెదర్' పరిశ్రమను ప్రభావితం చేసింది. సింథటిక్, రెక్సిన్ లెదర్‌ను వాడటం ద్వారా అనేకమంది తయారీదారుల పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. నిరంతరం 10గంటలు పనిచేసినా రోజుకు 200-250 మాత్రమే వస్తున్నాయని, కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇదేమాత్రం సరిపోవటం లేదని కార్మికులంతా వాపోతున్నారు.

అప్పుల ఊబిలో పడి ఆత్మహత్యలు



పాదరక్షల తయారీ పరిశ్రమలో ముడి సరకుల ధరలు విపరీతంగా పెరిగాయి. మరోవైపు జీఎస్టీ భారంగా మారింది. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని ఫ్యాక్టరీలు పెట్టినవారే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరగటం, దానికి తగ్గట్టు మార్కెట్లో తమ ఉత్పత్తులకు సరైన ధర లభ్యంకాకపోవటం కార్మికుల్ని కుంగదీస్తోంది. కుటీర పరిశ్రమ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. అదంతా గత చరిత్రగా మారింది. ఒక కార్మికుడు ముడి సరుకులు కొనుగోలు చేసి వంద జతల చెప్పులు తయారుచేస్తే నెలకు దక్కుతున్నది రూ.4-5వేలు మాత్రమే ఉంటోంది. ఎప్పుడైతే మోడీ సర్కార్ కేంద్రంలో వచ్చిందో అప్పుడే వారిపై పిడుగుపడింది. అంతకు ముందు చేతినిండా పని, చేతినిండా డబ్బు వచ్చేది. అదంతా ఇప్పుడు తలకిందులైంది.

దేశ జనాభాలో 65శాతం మంది అవసరాల్ని 'ఆగ్రా' పాదరక్షల తయారీ పరిశ్రమ తీరుస్తోంది. లక్షలాది కుటుంబాలకు 'ఆగ్రా' చెప్పుల తయారీ పెద్ద ఎత్తున నీడకల్పిస్తోంది. ఎంఆర్‌పీ రూ.300లోపు పాదరక్షలకు ఇంతకు ముందు వ్యాట్ విధించలేదు. జీఎస్టీ తీసుకొచ్చి 5-18శాతం వరకు పన్నులు వేస్తున్నారు.

జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నేత ఆర్ లక్ష్మయ్య పిలుపు

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో



దేశవ్యాప్తంగా జనవరి 8, 9వ తేదీల్లో జరగనున్న జాతీయ కార్మిక సమ్మెకు అఖిల భారత రోడ్డు రవాణా వర్కర్స్ అసోసియేషన్ సమన్వయ సమితి, ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు సమ్మెను విజయవంతం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. జాతీయ సమ్మెకు సంఘీభావంగా తాము కూడా పాల్గొని జయప్రదం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మయ్య మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు రవాణా వర్కర్స్ డిమాండ్లను సైతం ఆయన మీడియా దష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ రంగం తర్వాత దేశ ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్నది రవాణా రంగమేనని అన్నారు. అందువల్ల కేంద్రం విధిస్తున్న నూతన పన్నుల నుంచి రవాణా రంగాన్ని మినహాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గడచిన రెండు సంవత్సరాల్లో రవాణా రంగం నుంచి కేంద్ర ప్రభుత్వం రూ. 3,09,601 కోట్లు పన్నుల రూపేణా వసూలు చేసినట్టు తెలిపారు. వసూలు చేసిన మొత్తం రోడ్డు రవాణాభివద్ధికే వెచ్చించాల్సి ఉన్నప్పటికీ సర్కారు సరైన విధంగా కేటాయింపులు చేయడం లేదన్నారు. జీఎస్టీ వల్ల రవాణా రంగంలోని కార్మికులు పెద్ద ఎత్తున నష్ట పోయినట్టు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోటారు వెహికల్ సవరణను తక్షణమే మోడీ సర్కారు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రోడ్డు రవాణా కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రత ప్రభుత్వం కల్పించాలని అన్నారు. ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లను ప్రభుత్వం కార్మిక శాఖలో నమోదు చేసుకునే విధంగా గుర్తింపు ఇవ్వాలని అన్నారు. ఆలిండియా మోటార్ ట్రాన్స్ పోర్టు కమిటీ ఛైర్మన్ కుల్తారన్ సింగ్ అట్వాలీ మాట్లాడుతూ... అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 24 వేలు ఇవ్వాలని కోరారు. ఇన్స్యూరెన్స్ ప్రిమియమ్‌లో దళారీ వ్యవస్థను నిలువరించాలని కోరారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ కిందకు తీసుకువచ్చి... 5 శాతం శ్లాబులోకి చేర్చాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై పోరాడుతూనే జాతీయ కార్మిక సమ్మెకు మద్దతు ఇస్తామని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో రాజధాని పరివాహన్ పంచాయత్ అధ్యక్షులు ఇంద్రజీత్ సింగ్, ఆటో టాక్సీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ మన్యూరీ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ డైరెక్టర్ పర్యవేక్షణలోనే

లంచం కేసులో రాకేశ్ ఆస్తానాపై దర్యాప్తునకు సంబంధించి సీబీఐ వివరణ


మురుగేశన్ రాకేశ్ ఆస్తానా

న్యూఢిల్లీ: సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాపై దర్యాప్తును ఆ ఏజెన్సీలోని జాయింట్ డైరెక్టర్ వి.మురుగేశన్ పర్యవేక్షణలోనే కొనసాగిస్తామని అధికారవర్గాలు స్పష్టం చేశాయి. మురుగేశన్‌ను అవినీతి నిరోధక విభాగం నుంచి ఆర్థిక నేరాల విభాగంలోకి బదిలీ చేసినట్టు వార్తలు వెలువడ్డ కొన్ని నిమిషాల్లోనే సీబీఐ వివరణ ఇచ్చింది. ఓ కేసులో నిందితులను తప్పించేందుకు వారి నుంచి లంచం తీసుకున్నట్టు ఆరోపణలున్న ఆస్తానాపై మురుగేశన్ నేతృత్వంలోని సీబీఐ బృందం దర్యాప్తు జరుపుతోంది.


ఏసీ(హెచ్‌క్యూ)-1 జోన్ అదనపు బాధ్యతల నుంచి మురుగేశన్‌కు ఉపశమనం కలిగిస్తున్నట్టు కూడా సీబీఐ తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ జోన్‌లోనే ఆస్తానాపై అవినీతి కేసు నమోదు కావడం గమనార్హం. ఈ బాధ్యతల వల్ల ఆయనపై పని ఒత్తిడి ఉండటం వల్లే మార్పులు చేసినట్టు సీబీఐ వివరణ ఇచ్చింది. ఈ బాధ్యతలను జాయింట్ డైరెక్టర్ జికె గోస్వామికి అప్పగించింది. ఇప్పటికే లక్నో జోన్ చూస్తున్న గోస్వామి అదనంగా ఏసీ(హెచ్‌క్యూ)-1 బాధ్యతలు నిర్వహించనున్నారు.

2018, అక్టోబర్ 15న ఆస్తానాపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. హైదరాబాద్ వ్యాపారి సానా సతీశ్‌ను మాంసం ఎగుమతిదారు మొయిన్‌ఖురేషీ కేసు నుంచి తప్పించేందుకు లంచం తీసుకున్నట్టు ఆస్తానాపై ఆరోపణలున్నాయి. రూ.2 కోట్ల లంచం తీసుకునేందుకు దుబాయికి చెందిన మధ్యవర్తిని ఆస్తానా తనకున్న పాత పరిచయాలతో ఉపయోగించారని ఆరోపణలున్నాయి. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ, ప్రత్యేక డైరెక్టర్ ఆస్తానా ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు సంధించుకున్న నేపథ్యంలో వారిద్దరినీ కేంద్ర ప్రభుత్వం బలవంతంగా సెలవుపై పంపించడంపై సుప్రీంకోర్టు విచారిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సీబీఐకి తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వర్‌రావు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 31న అలోక్‌వర్మ రిటైర్ కానుండటంతో సీబీఐకి నూతన డైరెక్టర్‌గా కేంద్రం ఎవరిని నియమిస్తుందన్నదానిపై ఆసక్తి నెలకొన్నది.

మేఘాలయ సర్కారుకు 100 కోట్ల జరిమానా

- రెండు నెలల్లోగా చెల్లించాలని ఎన్‌జీటీ ఆదేశం
- అక్రమ మైనింగ్‌ను అడ్డుకోలేకపోయినందుకు చర్యలు

న్యూఢిల్లీ : మేఘాలయ సర్కారుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బొగ్గు అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయలేక పోయినందుకు రూ.100 కోట్ల జరిమానా చెల్లించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) శుక్రవారం ఆదేశించింది. ఈ మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాలని స్పష్టం చేసింది. డిసెంబర్ 13న అక్రమంగా బొగ్గు తవ్వేందుకు గనిలోకి వెళ్లిన 15 మంది కార్మికులు అదృశ్యమైన సంగతి తెలిసిందే. 20 రోజులు గడిచినా వారి ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదు. మేఘాలయలో అక్రమంగా బొగ్గు తవ్వకా లను నిషేధిస్తూ ఎన్‌జీటీ 2014లో తీర్పునిచ్చింది. కాగా.. రాష్ట్రంలో ఎన్నో మైనింగ్ కంపెనీలు లైసెన్స్ లేకుండానే నడుస్తున్నాయని ఎన్‌జీటీ దృష్టికి వచ్చిన నేపథ్యంతో.. గతే డాది ఆగస్టులో గౌహతి హైకోర్టు మాజీ న్యాయమూర్తి బిపి కకోటీ నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు సంస్థను నియమిం చింది.



ఈ క్రమంలోనే కకోటీ కమిటీ ఇటీవల ఎన్‌జీటీకి నివే దికను సమర్పించింది. రాష్ట్రంలో దాదాపు 24 వేల బొగ్గు గనులు న్నాయని, వీటిలో ఎక్కువ శాతం అక్రమంగా నడుస్తున్నవేనని కమిటీ తెలిపింది. చాలా మైనింగ్ కంపెనీలకు పర్యావరణ అనుమతులు కూడా లేవని వెల్లడించింది. అక్రమ మైనింగ్‌ను నిషేధిస్తూ 2014లో ఇచ్చిన తీర్పును బేఖాతరు చేశారని, నదులు, సరస్సులలోని నీరు గనుల గుండా ప్రవహించడం ద్వారా కలుషితమవుతున్నదని తెలిపింది. దీంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు ఆ నీరు త్రాగడానికి పనికి రాదని నివేదికలో పేర్కొన్నది. ఈ నివేదిక ఆధారంగా.. ఎన్‌జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయెల్ నేతృత్వంలోని బెంచ్ తాజా చర్యలు చేపట్టింది. రూ.100 కోట్ల జరిమానాను కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు డిపాటిట్ చేయాలని ఆదేశించింది. అక్రమంగా నడుస్తోన్న బొగ్గు గనుల వద్ద అన్ని క్రేన్లను వెంటనే సీజ్ చేయాలని వెల్లడించింది. దీంతోపాటు బొగ్గును అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుబడ్డ 2,700 ట్రక్కులను వాటి కొత్త ధరలో 50 శాతం మొత్తాన్ని చెల్లిస్తేనే విడుదల చేయాలని తేల్చి చెప్పింది.

బీహార్ మూక హత్యకేసులో అరెస్టులు నిల్

- హతుడికి నేర చరిత్ర ఉంది: పోలీసులు

పాట్నా: బీహార్‌లోని అరేరియాలో మూకహత్య జరిగి వారం గడిచినా ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు ఒక్కరినీ అరెస్టు చేయలేదు. కాగా, ఈ దాడిలో మృతి చెందిన కబుల్ మియాపై 16 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ఇప్పటివరకు ఇంకా ఎవరూ అరెస్టు కాలేదని అడిషనల్ డైరెక్టర్ జనరల్ కుందన్ క్రిష్ణన్ వివరించారు. కబుల్‌పై 1981లో మొదటి ఎఫ్ఐఆర్ దాఖలైందని, ఇటీవలే నేపాలీ రైఫిల్ కూడా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కాగా, కబుల్ ఇంట్లో రైఫిల్ లభించినా ఆయన్ని ఎందుకు అరెస్టు చేయలేదని, 16 కేసుల్లో ఒక్కదాంట్లోనైనా ఎందుకు దోషిగా తేల్చలేదన్న ప్రశ్నలకు ఆయన సంతృప్తికర సమాధానాన్ని ఇవ్వలేదు. ఈ కోణాల్లోనూ తాము దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గో అపహరణ ఆరోపణలతో డిసెంబర్ 29న అరేరియాలోని సిమర్బని గ్రామంలో కబుల్ మియాపై దాదాపు 300 మంది దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా బయటకు వచ్చింది.

ప్రతి పౌరుడూ ప్రశ్నించాలి

- రాఫెల్ వివాదంపై రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందానికి సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మోడీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేస్తూ పార్లమెంట్‌లో తాను సంధించిన ప్రశ్నలనే ప్రధానిని, ఆయన మంత్రులను అడగాలని దేశ ప్రజలను కోరారు. రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై దాదాపు రెండు గంటల పాటు పార్లమెంట్‌లో మాట్లాడిన రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ నేను అడిగిన రెండు చిన్న ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పలేక పోయారు" అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. రక్షణ మంత్రిని అడిగిన రెండు ప్రశ్నలతో కూడిన వీడియోను ఆయన పోస్ట్ చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల కాంట్రాక్టును అనిల్ అంబానీకి ఎవరు ఇచ్చారు? ఈ ఒప్పందాన్ని మోడీ తప్పుదోవ పట్టిస్తుంటే రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు అవును, కాదు అని మాత్రమే సమాధానమివ్వాలని సీతారామన్‌ను కోరుతూ రాహుల్ ఆ వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. "ఈ వీడియో చూసి అందరికి షేర్ చేయండి. ప్రధానిని, అతని మంత్రి వర్గ సభ్యులను ప్రతి పౌరుడూ ఈ ప్రశ్నలను అడిగేలా చేయండి" అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. కాగా రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తుందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఆరోపించారు.

లోక్‌సభ ఎన్నికలు మందిరం చుట్టూ తిరగవు

రానున్న లోక్‌సభ ఎన్నికలు మందిరం నిర్మాణం చుట్టూ తిరగవని, ఉద్యోగాలు, రైతు సమస్యలు, రాఫెల్ ఒప్పందంలో అవినీతి తదితర సమస్యల చుట్టూ తిరుగుతాయని రాహుల్ గాంధీ అన్నారు. "2019 ఎన్నికల ఇతివృత్తం చాలా సాధారణమైనది. అది యువతకు ఉపాధి కల్పించడం. యువతకు ఉపాధి కల్పిస్తే అది మోడీ చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తుంది." అని రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల మూడో ఇతివృత్తం ప్రజలకు విద్య, ఆరోగ్య సంరక్షణలు అందించడమని ఆయన చెప్పారు. ఇక చివరిది పెద్ద ఎత్తున చోటు చేసుకున్న అవినీతి. రాఫెల్ ఒప్పందంలో రూ30 వేల కోట్లను దేశ ప్రజల నుండి తీసుకున్న మోడీ దానిని తన మిత్రుడికి ఇచ్చాడని రాహుల్ చెప్పారు. ఆలయ నిర్మాణ అంశం రానున్న ఎన్నికలపై ప్రభావం చూపనున్నదా? అని అడిగిన ప్రశ్నకు రాహుల్ పైవిధంగా సమాధానం చెప్పారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

లక్నో : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వచ్చే నెల 6 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 4 లక్షల మంది సమ్మెలో పాల్గొననున్నట్టు పాత పెన్షన్ సాధన సమితి కన్వీనర్ హరికిషోర్ తివారి శనివారం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సమయానికి ముందుగా నిర్వహిస్తున్న ఈ సమ్మెకు ఇతర అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు పలికినట్టు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి గత రెండు నెలలుగా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉద్యోగులకు తప్పుదోవ పట్టిస్తున్నట్టు తెలిపారు. ఇదే విధంగా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా కొత్త పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ గత నెల 12న బెల్గాం పట్టణంలోని వీధుల్లో ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇది జరిగిన 2 వారాల తరువాత నష్టాల పేరుతో దేనా, విజయ బ్యాంకులను బ్యాంకు ఆఫ్ బరోడాలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ 9 ప్రభుత్వ బ్యాంకులకు సంబంధించిన దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు దేశ వ్యాప్త సమ్మె చేపట్టారు. తమ జీతాలకు సంబంధించి సవరణ కూడా చేపట్టాలని వారు ఈ సందర్భంగా నినదించారు.

మహారాష్ట్ర సర్కార్ నిర్వాకం

- 2019 క్యాలెండర్ నుంచి శివాజీ, సాహు, ఫూలే, అంబేద్కర్‌లు మాయం

ముంబయి : మహారాష్ట్ర బీజేపీ సర్కార్ మరో వివాదానికి తెరతీసింది. ఛత్రపతి శివాజీ మహారాజ్, ప్రజాస్వామ్య సంస్కరణవాది రాజార్షి సాహు మహారాజ్, సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా ఫూలే, బిఆర్ అంబేద్కర్‌ల వార్షికోత్సవాల ప్రస్తావనను 2019 క్యాలెండర్‌లో మినహాయించింది. సచివాలయం, రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరసంస్థలకు ఈ లెజెండ్ల వర్ధంతుల ప్రస్తావన లేకుండా ముద్రించిన క్యాలెండర్లను పంపిణీ చేశారు. ప్రపంచ ఎయిడ్స్ డే (డిసెంబర్ 1), ప్రపంచ వికలాంగుల దినోత్సవం (డిసెంబరు 3) వంటి ఇతర కార్యక్రమాల గురించిన ప్రస్తావనలు ఉండటం గమనార్హం. ఫూలే, భారత రత్న అంబేద్కర్‌ల ప్రస్తావన లేకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. ఇది చాలా తీవ్రమైన వైఫల్యం అని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాధాకృష్ణ విఖే ఆరోపించారు. దీనికి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "బీజేపీ-శివసేన ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ ప్రముఖ వ్యక్తులు పేర్లను క్యాలెండర్ నుంచి తొలగించింది' అని ఆరోపించారు. గొప్ప వ్యక్తులను అవమానించడమేననీ, ముఖ్యమంత్రి ఫడ్నవీస్ క్షమాపణ చెప్పాలని కోరారు.

వేధింపులపై ఫిర్యాదు చేస్తే పొమ్మన్నారు

- యూపీలో ఓ పాఠశాల నిర్వాకం

లక్నో: లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న బాధిత బాలికకు అండగా నిలవాల్సిన పాఠశాల ప్రిన్సిపాల్ అందుకు విరుద్ధంగా వ్యవహరించాడు. వేధింపుల గురించి ఫిర్యాదు చేసినందుకు క్రమశిక్షణ చర్యల కింద ఆమెను పాఠశాల నుంచి వెళ్లిపోవాలని ఆదేశించాడు. ఈ ఘటన యూపీలో చోటుచేసుకున్నది. బాధితురాలు కుషీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పాఠశాలలో చదువుకుంటున్నది. అయితే తోటి విద్యార్థి ఒకరు ఆమెతో చనువుగా ఉండేవాడు. ప్రేమిస్తున్నానని బాధితురాలి వెంటపడి వేధించేవాడు. తన వెంటపడకూడదని ఆ అబ్బాయికి బాధితురాలు అనేకసార్లు హెచ్చరించింది. అయినప్పటికీ అతని తీరు మారలేదు. దీంతో విసిగెత్తిపోయిన బాలిక పాఠశాల ప్రిన్సిపాల్ సిబి సింగ్‌కు ఫిర్యాదు చేసింది. అయితే ధైర్యం చెప్పాల్సిన ప్రిన్సిపాలే ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపులపై ఫిర్యాదు చేయడం క్రమశిక్షణారాహిత్యమన్నాడు. తక్షణమే పాఠశాలను విడిచి వెళిలపోవాలని ప్రిన్సిపాల్ ఆమెను ఆదేశించాడు. ఇలాంటి బాలికలు ఇక్కడ చదవాల్సిన అవసరం లేదని, వారి వల్ల పాఠశాల ప్రతిష్ట దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రిన్సిపాల్ తీరుపై బాలిక తల్లిదండ్రులు, పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరగా ఈ సమాచారం పోలీసులకు చేరింది. బాలికను వేధింపులకు గురిచేసిన బాలుడిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్టు కుషీనగర్ పోలీసు అధికారి నితేశ్ ప్రతాప్ సింగ్ తెలిపారు.

17న కొత్త శాసనసభ షురూ..

18న స్పీకర్ ఎన్నిక

- 20 వరకు సభ కొనసాగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముందస్తు ఎన్నికల తర్వాత నూతన శాసనసభ ఈనెల 17న కొలువుదీరనుంది. ఈ క్రమంలో కొత్తగా ఎన్నికైన శాసనసభ్యుల్లో సీనియర్ అయిన ముంతాజ్ అహ్మద్‌ఖాన్ (చార్మినార్ ఎమ్మెల్యే) 16న ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్.. ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. ఆ మరుసటి రోజు (ఈనెల 17) ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన శాసనసభా సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో ముందస్తు ఎన్నికల్లో గెలుపొందిన శాసనసభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. అనంతరం స్పీకర్ ఎన్నిక షెడ్యూల్ విడుదలవుతుంది. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 18న స్పీకర్ ఎన్నికపై ప్రకటన వెలువడుతుంది.

ఆ తర్వాత కొత్తగా ఎన్నికైన స్పీకర్‌కు సభానాయకుడు, సీఎం కేసీఆర్‌తోపాటు ప్రధాన ప్రతిపక్ష నేత, ఇతర పక్షాల నేతలు, సభ్యులు శుభాకాంక్షలు తెలుపుతారు.

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్



ఫైల్

ఆయన్ను వారందరూ కలిసి స్పీకర్ స్థానంలో కూర్చోబడతారు. అనంతరం స్పీకర్ అధ్యక్షతన సభా కార్యక్రమాలు జరుగుతాయి. ఆ తర్వాత బీఏసీ సమావేశం నిర్వహించి.. గవర్నర్ ప్రసంగంపై నిర్ణయం తీసుకుంటారు. 19న ఉభయ సభలనుద్దేశించి నరసింహన్ ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదిస్తారు.

స్పీకర్‌గా పోచారం..?

శాసనసభ సమావేశాల ముహూర్తం ఖరారు కావడంతో స్పీకర్ పదవి ఎవరిని వరిస్తుందో అన్న చర్చ ఇపుపడు టీఆర్ఎస్‌లో ఊపందుకుంది. మొన్నటి వరకూ స్పీకర్‌గా పనిచేసిన మధుసుధనాచారి ఈ దఫా ఓటమి పాలు కావడంతో....అనుభవజ్ఞులకే స్పీకర్ పదవిని కట్టబెట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. దీంతో మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్ అవుతారనే చర్చ పార్టీలో వినిపిస్తోంది. పోచారానికి కాని పక్షంలో పలువురు సీనియర్ల పేర్లు వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాల దృష్టితో ఇతర వర్గాలకు స్పీకర్ పదవి కట్టబెట్టాల్సి వస్తే ఆయా వర్గాల నుంచి సీనియర్లకే ప్రాధాన్యత కల్పించే ఛాన్స్ ఉందని సమాచారం. గతంలో మాదిరిగా బీసీలకు స్పీకర్ పదవి ఇవ్వాల్సి వస్తే మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎస్టీల నుంచి రెడ్యా నాయక్, ఎస్సీల నుంచి కొప్పుల ఈశ్వర్, మహిళకు అవకాశం కల్పించాలని భావిస్తే పద్మా దేవెందర్‌రెడ్డికి స్పీకర్ పదవి దక్కొచ్చని భావిస్తున్నారు. వీరుగాక పోతే మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి స్పీకర్ పదవి దక్కే అవకాశాలున్నాయని తెలిసింది.

బీసీలను బానిసలుగా మార్చారు

జస్టిస్ ఈశ్వరయ్య

- జనరల్ స్థానాలను బీసీలకు వదిలేయండి



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను తగ్గించి బీసీలను బానిసలుగా మార్చారని ఓబీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జస్టిస్ ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో సాధారణ (జనరల్) స్థానాలను బీసీలకు వదిలేయాలని అన్నారు. అగ్రకులాలకు చెందిన వారు ఇప్పటికే వారు ఎమ్మెల్యేలు, ఎంపీలకు పోటీలుగా ఉన్నారని గుర్తు చేశారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజకీయాల్లోకి రాకుడదనే ఉద్దేశంతో టీఆర్ఎస్ సర్కారు కుట్ర పన్నిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టులో ఉన్న కేసును రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఉపసంహరించుకోవాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధన కోసం వీధి పోరాటం నుంచి న్యాయస్థానం వరకు పోరాటం చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 12, 753 పంచాయతీలను ఒక యూనిట్ గా తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేయకపోవడం వల్ల ఉన్న 22 శాతంలోనే బీసీలకు కేవలం 18 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయని చెప్పారు. రిజర్వేషన్లపై బీసీ సంఘాలు, అఖిలపక్ష సమావేశం నిర్వహించకుండా సీఎం కేసీఆర్ మీడియా సమావేశం నిర్వహించి తమ తప్పును సరిదిద్దుకోవడం సమంజసం కాదన్నారు. న్యాయ స్థానాల్లో పోరాడే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం కల్పించుకోలేదని ప్రశ్నించారు.

తమ పోరాటాలను సీఎం తేలికగా తీసుకున్నారని విమర్శించారు. సామాజికవేత్త సాంబశివరావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల గ్రామాల్లో దొరల పెత్తనం మళ్లీ తెరపైకి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన కన్నా ముందే బీసీ రిజర్వేషన్లు తగ్గే అవకాశం ఉందని తాము పది పేజీలతో కూడిన నివేదికను టీఆర్ఎస్‌కు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామాల్లోని బీసీలంతా ప్రభుత్వ కుట్రను గుర్తించి బీసీలంతా బీసీ అభ్యర్థులనే గెలిపించాలని పిలుపునిచ్చారు. రిటర్డ్ ఐఆర్ఎస్ అధికారి బీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఉన్న రిజర్వేషన్లను తగ్గిస్తే ప్రజాస్వామ్యం ముందుకు ఎలా పోతుందని ప్రశ్నించారు. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను మరింత పెంచాల్సి ఉండగా తగ్గించడం అన్యాయమన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ విద్యుత్తు ఉద్యోగుల సమావేశంలో ఆర్ కృష్ణయ్య
- రేపు మహాసభ



మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న బీసీ ఉద్యోగులకు ప్రమోష న్లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలే యర్‌ను ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 7న ఇందిరా ప్రియదర్శిని ఆడి టోరియంలో మహాసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు శనివారం జరిగిన బీసీ భవన్‌లో బీసీ విద్యుత్తు ఉద్యోగుల సమావేశంలో ఆయన ప్రకటించారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి చట్టపరమైన, రాజ్యాగంపరమైన ఇబ్బందులు ఏమిలేవని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం, బీసీ వ్యతిరేక వైఖరిని అవలంభించడం వల్లనే రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమిషన్ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని సిఫార్సు చేసిందని, ఇటీవల ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగులు లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఇలా అన్ని వైపుల నుంచి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలంటూ సిఫార్సులు ఉన్నా ఆచరణకు నోచుకోకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర స్థాయి ఉద్యో గాల్లో 54లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే బీసీలు కేవలం 7.50లక్షల మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు ఇప్పటికీ 14 శాతం ప్రాతినిధ్యం ఉందని చెప్పారు. బీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీలకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదన్నారు. గతంలో పాలించిన పార్టీల తరహాలోనే నరేంద్రమోడీ పాలన ఉందని విమర్శించారు. అత్యున్నత స్థానాల్లోనూ బీసీలకు ప్రాతినిధ్యం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి ప్రణాళికలపై ఫిబ్రవరిలో అంతర్జాతీయ సదస్సు

- రీసెర్చ్ ఫర్ రీసర్జెన్స్ ఫౌండేషన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశానికి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలపై చర్చించి.. ఒక కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా ఫిబ్రవరిలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు రీసెర్చ్ ఫర్ రీసర్జెన్స్ ఫౌండేషన్ తెలిపింది. హైదరాబాద్ కేంద్రీ య విశ్వ విద్యాలయం (హెచ్‌సీయూ) ఈ సదస్సుకు వేదిక కానుందని ఫౌండేషన్ కన్వీనర్ డాక్టర్ రాజేశ్ బి.బినీవాలే చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాశ్చాత్య దేశా లకు చెందిన వివిధ పరిశోధనలు, అధ్యయనాలు భారతదేశంలోని పలు సమస్య లకు పరిష్కారం చూపలేకపోయాయని చెప్పారు. ముఖ్యంగా భూ సంరక్షణ, క్రిమి సంహారక మందులను విచ్చవిడిగా వాడటం, వాయు, జల కాలుష్యాలు, అడవుల తరగుదల, పరిశ్రమల్లోంచి వెలువడే వ్యర్థ పదార్థాలను తగ్గించటం తదితర సమస్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీటికి పరిష్కార మార్గాలను వెతికేందుకు తమ సంస్థ ప్రయత్ని స్తున్నదని తెలిపారు. 'భారతీయ మార్గం ద్వారా ప్రత్యామ్నాయ పరిష్కారాలపై దృష్టి' అనే అంశం ఇందులో కీలకంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో విలువలతో కూడిన విద్య అత్యంత ఆవశ్యకమని తెలిపారు.

ఈ సదస్సును ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారని బినీవాలే చెప్పారు. ఆయనతోపాటు పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరవుతారని తెలిపారు. దేశ, విదేశాల్లోని పలు యూనివర్సిటీలకు చెందిన దాదాపు 150 మంది వీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఓయూ, ఇఫ్లూతోపాటు వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఎన్ఐఎన్, సీసీఎంబీ, హెచ్ఆర్‌డీ, డీఆర్‌డీవో తదితర ప్రతిష్టాత్మక సంస్థల నుండి ప్రొఫెసర్లు, మేధావులు, శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో రీసెర్చ్ ఫర్ రీసర్జెన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ అరవింద్ జోషి, డాక్టర్ మధుసూదన్ జోషి, డాక్టర్ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

గ్రామ స్వరాజ్యం



పల్లె గొప్పదా? పట్నం గొప్పదా? అని ఒకప్పుడు ఉపన్యాస పోటీలు పెట్టేవారు. పట్నాల్లో ఉండే పిల్లలు సైతం పల్లె గొప్పదనం గురించి మాట్లాడేవారు. ఎందుకంటే పల్లెలంటే గౌరవం, మమకారం. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావాలన్న ఆకాంక్షల్ని వ్యక్తం చేసేవారు. ఇప్పుడు అలాంటి పోటీలు పెడితే పట్నం గొప్పదనం గురించి చెప్పేవారే అధికము. పల్లెల గొప్పదనం గురించి కేవలం నాయకుల మాటల్లోనే వింటాం. ఇవాళ పల్లెల్లో ఉండాలని ఎవరూ కోరుకోడం లేదు. ప్రభుత్వాలు పల్లెల అభివృద్ధి గురించి ఎన్ని మాటలు చెప్పినప్పటికీ వాటి విచ్ఛిన్నానికి దారితీసే విధానాలనే అమలు చేస్తు న్నాయి. నగరీకరణకు, పట్టణీకరణకు దారులు సుగమం చేస్తున్నాయి. పల్లెల్నించి వలసలు పెరిగే రీతికి దన్నుగా నిలుస్తున్నాయి. పైకి మాత్రం గ్రామాలు స్వయంపోషకం కావాలన్న గాంధీజీ స్వప్నసాకారం కోసం శ్రమిస్తున్నట్టు పాలకులు తియ్యటి మాటలు చెబుతారు.

బహుళజాతి కంపెనీల భల్లూకపు పట్టు నుంచి విముక్తి అయినప్పుడే అసలుసిసలు గ్రామస్వరాజ్యం సాధ్యం. స్వతంత్రంగా, స్వయం పోషకంగా, నిండైన ఆత్మ గౌరవంతో వ్యవహరించే దిశగా పల్లెల చైతన్యం పాదుకొల్పడం అవసరం. దీన్ని గుర్తించిన క్రియా శీలత ద్వారానే ఏనుగు నర సింహారెడ్డి చెప్పినట్టు పాడుపడిన పల్లెలు మరల పరిమళిస్తాయి. పాడిపంటలతో పరవశిస్తాయి. ప్రపంచీకరణ కుట్రల్ని జయిస్తాయి.

మాటలకీ చేతలకీ పొంతన లేని తీరు పల్లెల్ని చూస్తే తెలిసిపోతుంది. పల్లెల పచ్చదనం గురించిన వర్ణనలు ఆంధ్ర ప్రాంతపు నవలల్లో ఎక్కువగా కనిపించేవి. వాటిని చదివిన వారు పల్లె పట్టులు అందాల నెలవులుగా భావించే వారు. సంక్రాంతి పద్యాల్లోనూ పల్లెల పచ్చటి అందాలని అతి సుందరంగా వర్ణించేవారు. కానీ వాస్తవంలో పల్లెలు తమ స్వేచ్ఛని, సౌందర్యాన్ని కోల్పోతున్నాయి. క్రమక్రమంగా పల్లె దృశ్యం మారింది. పల్లె జీవితం విచ్ఛిన్నమయింది. చెరువులు మాయమయ్యాయి. బావులు ఎండి పోయాయి. వాగులు, ఏర్లు ఎండిపోయి ఎండ్లయింది. ఇసుక తప్ప నీళ్ళు లేవు. ఆ ఇసుకని కూడా కాంక్రీట్ జంగిళ్ళ కోసం తరలించే ఇసుక మాఫియా పెట్రేగిపోతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే పల్లెల పచ్చదనంలో చిచ్చు పెట్టారు. ఎవరో కాదు బహుళజాతి కంపెనీలు, వారి తాబేదార్లయిన మన ప్రభుత్వాలు, వాటికి ప్రాతినిధ్యం వహించే పాలకులు, సంపన్నదేశాల అడుగులకు మడుగులొత్తే రాజకీయ నాయకులు అంతా కలిసి పల్లెల్ని విచ్ఛిన్నం చేశారు. పల్లె జీవితంలోని ప్రశాంతతని కొల్లగొట్టారు. అందుకే పల్లె కన్నీరు పెడుతున్న దృశ్యాల్ని కవులు వినిపిస్తున్నారు.


స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటినా గ్రామస్వరాజ్యం అనే గాంధీజీ సదాశయం కలగానే మిగిలింది. నిజానికి ఏడుపదుల కిందటితో పోలిస్తే గ్రామీణ జీవితం మరింత ధ్వంసమయింది. వ్యవసాయం దెబ్బతిన్నది. వృత్తులు నాశనమయ్యాయి. వాటిని అంటిపెట్టుకుని వున్న శ్రమైక జీవన సంస్కృతి తన ప్రాభవాన్ని కోల్పోయింది. పల్లె బతుకుని హీనంగా భావించే పరిస్థితి ఏర్పడింది. అందుకే ఇవాళ్టి పల్లెల సంవేదనని 'మట్టిపాట'గా వినిపించారు ఏనుగు నరసింహారెడ్డి. పల్లెల విలాపాన్ని వినిపిస్తూ రాసిన ఈ శతకంలో ప్రతి పద్యాన్ని 'పల్లె బతుకు మాది పాడుగాను' అనే మకుటంతో ముగించారు. ఇది నిష్ఠురం, నిరసన స్వరం.

పల్లెల్లో బతకడం ఆదర్శంగా భావించే స్థితి ఇవాళ కనిపించదు. ఎందుకంటే బతకాలంటే పని దొరకాలి. భుక్తి గడవాలి. ఏ మనది లేకుండా మనగలగాలి. తను బతకటం కోసం, నలుగుర్ని బతికించటం కోసం పుట్టిన పల్లె బతకలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. తను పనిచేస్తూ పదుగురికి తిండిపెట్టే పల్లె రైతు జీవితపు దౌర్భాగ్యాన్ని 'కాపుబిడ్డ' కావ్యంలో గానం చేశారు గంగుల శాయిరెడ్డి. ఒకరి కింద పని చేయడం నామోషీగా భావించే వారు కాపుబిడ్డలు. వ్యవసాయం మేలిమిపుత్రిగా తలపోసేవారు. కానీ వ్యవసాయం చేయలేక పోలేక పట్నం బాటపట్టే స్థితికి నెట్టబడ్డ దీనావస్థ ఎల్లెడలా కనిపించే విషాద దృశ్యం.

పల్లె విలాపధ్వన్యాల్ని చూస్తూ కూడా ఏకగ్రీవ ఎన్నికలతోనే 'గ్రామ స్వరాజ్యం' ఆవిష్కృతమవుతుందని నేతలు చెప్పడం ఒక పరిహాసం. వ్యవసాయమూ, దాన్ని అంటిపెట్టుకున్న ఉపాధిపనులు దెబ్బతిన్నాక బతకలేక, పోలేక కునారిల్లుతున్న గ్రామాల్లో స్వరాజ్యం ఎక్కడ? ఎవరికి? అన్నదే అసలు ప్రశ్న. తెలంగాణలో ఇప్పటికీ అరవైశాతానికి పైగా జనాభా పల్లెల్లోనే జీవనం సాగిస్తున్నది. అయినప్పటికీ వారికి బతుకుదెరువు లేదు. సరైన పారిశుధ్యం లేదు. ఆస్పత్రులు, గ్రంథాలయాలు మృగ్యం. వృత్తి ఉద్యోగాలు దొరకని స్థితి. వ్యవసాయం ఒక నరక కూపంగా మారింది. ఆరుగాలం కష్టపడినా గిట్టుబాటు ధర వస్తుందన్న గ్యారంటీ లేదు.

ఆహారపంటలు పోయాయి. వాణిజ్య పంటలు వచ్చి కూటికి గింజలు దొరకని పరిస్థితి నెలకొన్నది. పాడిపశువులు లేవు. పాలు, పెరుగు, నెయ్యి పుష్కలంగా దొరికిన కాలం ఇపుడు ఒక జ్ఞాపకం మాత్రమే. ప్రపంచీకరణ ప్రకంపనల్లో సంప్రదాయిక ఆటపాటలు మట్టిగొట్టుకు పోయాయి. గొల్లసుద్దులేవీ. వీధి భాగోతాలు, బుర్రకథలు, వృత్తి పురాణాలు, పటం కథలు కానరాకుండా పోయాయి. పిండాలు పెట్టముట్టని స్థితిని ఆర్ద్రంగా చెప్పారు నందిని సిధారెడ్డి ఓ కవితలో. మొబైల్ టవర్ల ధాటికి పిట్టల, పక్షుల రెక్కలు తెగిపడ్డవైనాన్ని ప్రతీకాత్మకంగా సూచించారు. ప్రపంచీకరణ గ్రామాల్ని ముట్టడించి బతుకుని, బతుకులోని సకల సంబంధాల్నీ పరాస్తం చేసిన దృశ్యాన్ని ప్రబలంగా చెబుతున్నారు తెలంగాణ కవులు. ఈ నేపథ్యంలో 'గ్రామ స్వరాజ్యం' అనే పదబంధం వినసొంపుగా ఉన్నా వాస్తవాలకు ఆమడదూరంలో ఉంది. బహుళజాతి కంపెనీల భల్లూకపు పట్టు నుంచి విముక్తి అయినప్పుడే అసలుసిసలు గ్రామస్వరాజ్యం సాధ్యం. స్వతంత్రంగా, స్వయంపోషకంగా, నిండైన ఆత్మ గౌరవంతో వ్యవహరించే దిశగా పల్లెల చైతన్యం పాదుకొల్పడం అవసరం. దీన్ని గుర్తించిన క్రియాశీలత ద్వారానే ఏనుగు నరసింహారెడ్డి చెప్పినట్టు పాడుపడిన పల్లెలు మరల పరిమళిస్తాయి. పాడిపంటలతో పరవశిస్తాయి. ప్రపంచీకరణ కుట్రల్ని జయిస్తాయి.

సమ్మె బాటలో కార్మికులు



కె. వేణుగోపాల్

భారత దేశ కార్మికులు మరియు ఉద్యోగులు మరొక్కమారు పోరాట మార్గంలోకి దూకనున్నారు. తమ 12 పాయింట్లు డిమాండ్ల సాధనకై వారు సమ్మె మార్గం పట్టనున్నారు. ఇంతకుముందు సెప్టెంబర్ 2, 2015 న ఆ తర్వాత సెప్టెంబర్ 2, 2016 న దేశవ్యాపిత సమ్మెలు చేసినా తమ డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో ఈసారి దేశ వ్యాప్తంగా జనవరి 8 మరియు 9న రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్

ఈరోజు కార్మికులే కాక ప్రజలు కూడా నయా ఉదారవాద విధానాలతో విసిగిపోయి ఉన్నారు. ఐక్యమవుతున్న ప్రజలను, కార్మికులను మతతత్వ విధానాలతో విభజించాలన్న ప్రభుత్వ కుటిల యత్నాలను అడ్డుకోవాలన్న కతనిశ్చయంతో వారున్నారు. ప్రజాస్వామ్యాన్ని భావ ప్రకటనాస్వేచ్ఛను హరించి వేస్తున్న నియంతత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రజలు కార్మికులు ముందుకు వస్తున్నారు.కాబట్టి ప్రభుత్వం మరియు దాని అనుకూల సంఘాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రానున్న రెండు రోజుల సమ్మె విజయవంతం కావడం తథ్యం.

అనుకూల మరియు దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దాదాపు 15 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు.

కార్మికుల డిమాండ్లను పట్టించుకోకుండా సులభతర వాణిజ్య ప్రక్రియపై, జీడీపీని పెంచుకోవడంపై ప్రభుత్వాలు దష్టి సారిస్తున్నాయి. సంపద సష్టి జరిగితే అన్ని వర్గాల వారు లాభ పడతారని ప్రభుత్వాలు అంటున్నాయి. కానీ వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. జీడీపీలో వద్ధి ఉన్నా ఉపాధిలో మాత్రం వద్ధి లేదు. జిడీపీలో కార్పొరేట్ల లాభాల శాతాలు పెరుగుతుండగా కార్మికుల వేతనాల శాతాలు తగ్గుతూ వస్తున్నాయి.121 మంది శత కోటీశ్వరుల వాటా జిడీపీలో 22 శాతం ఉండగా 67 కోట్ల మంది సంపద కనీసం ఒక్క శాతం కూడా పెరగలేదు..

సులభతరం వాణిజ్యం పేరుతో ప్రభుత్వాలు కొత్త మార్గాల ద్వారా కార్మికులను దోపిడీకి గురి చేస్తున్నాయి. ఔట్ సోర్సింగ్, ఫిక్స్ ఎంప్లాయిమెంట్, అప్రెంటిస్ పద్ధతుల్లో ఉపాధి యొక్క శాశ్వత స్వభావాన్ని తాత్కాలికమైనదిగా మార్చేస్తున్నాయి. ఔట్ సోర్సింగ్‌లో యాజమాన్యాలు తమకు కావాల్సిన కార్మికులను తాము నియమించుకోకుండా నిర్ణీత సొమ్మును చెల్లించి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ప్రధాన యజమానికి ఈ కార్మికులకు ఏ రకమైన ప్రత్యక్ష సంబంధం ఉండదు. యాజమాన్యానికి వారి పట్ల ఏ బాధ్యతా ఉండదు. కాంట్రాక్ట్ కార్మిక చట్టం 1970 వీరికి వర్తించదు. ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించబడ్డ ఉద్యోగాలు తాత్కాలికమైన ఉద్యోగాలుగా ఉంటున్నాయి. ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్స్ కి ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా సవరణ తెచ్చి ఫిక్స్ ఎంప్లాయిమెంట్ పద్ధతిని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో ఒక ఉద్యోగిని ఒక నిర్ణీత సమయం వరకు మాత్రమే నియమించుకోవచ్చు. కానీ ఈ నిర్ణీత సమయం తర్వాత ఆ ఉద్యోగిని ఉద్యోగంలో కొనసాగించవచ్చు లేదా ఉద్యోగం నుంచి తీసివేయవచ్చు. ఈ రకంగా ఉద్యోగికి ఏ రకమైన ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుంది ఫిక్స్ ఎంప్లాయ్‌మెంట్ పద్ధతి. వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన వేతనాలను చెల్లించాలన్న నియమం ఉన్నా యజమాన్యాలు ఈ వేతనాలను వారికి చెల్లించవు. ఉద్యోగి కూడా తనను ఎక్కడ ఉద్యోగం నుంచి తీసి వేస్తారో నన్న భయంతో సమాన వేతనాలను అడగలేడు. అట్లాగే నేషనల్ ఎంప్లాయిమెంట్ ఎంపవర్మెంట్ మిషన్ పేరు మీద రెగ్యులర్ ఉద్యోగుల స్థానాలలో అప్రెంటిస్‌లను నియమించుకొని రెగ్యులర్ ఉద్యోగులు చేసే పనిని అప్రెంటిస్‌ల ద్వారా చేయించుకుంటున్నారు. తక్కువ మొత్తంలో స్టైఫండ్‌ను చెల్లిస్తున్నారు. కార్మికులను పని ప్రదేశాలలో వివిధ సమూహాలుగా విభజిస్తున్నారు. వారు చేసే పని ఒకటైనా వేతనాలు వేరు. సర్వీస్ కండిషన్లు వేరు. ఈ రకంగా కార్మికులు కట్టుబానిసలుగా మారిపోతున్నారు.

మనదేశంలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు 35 ఏళ్ళ కన్నా తక్కువ వయస్సు ఉన్న వాళ్లే. ప్రతి నెల 10 లక్షల మంది ఉపాధి మార్కెట్లోకి వస్తున్నారు. అంటే ఏడాదికి కనీసం 1.2 కోట్ల ఉద్యోగాలను సష్టించాలి. మోడీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి, డిమానిటైజేషన్ మరియు జీఎస్టీలతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టాయి. 2014లో 43% గా ఉన్న వర్కింగ్ పాపులేషన్ ఇప్పుడు 40 శాతానికి దిగజారిపోయింది. అంటే 1.3 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నమాట. గ్రామీణ ఉపాధి పథకం కింద వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా వాస్తవానికి 50 రోజుల కన్నా తక్కువ రోజులే పని కల్పించబడుతుంది.

కార్మిక చట్టాలను సవరించి కార్మిక సంఘాలను బల హీనపరిచి చివరకు కార్మిక సంఘాలను నిర్మూలించేట్టుగా ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. 44 కేంద్ర కార్మిక చట్టాలను మార్చివేసి వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనీస వేతనాల చట్టం, పేమెంట్ అఫ్ **wages act, bonus act equal remuneration act**లను వేజ్ కోడ్‌గా అట్లాగే పారిశ్రామిక వివాదాల చట్టాన్ని, ట్రేడ్ యూనియన్ ఏక్ట్‌ని మరియు ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ ఏక్ట్‌ని ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేజ్ కోడ్ కింద కనీసం వేతనం ఎంత ఉంటుందో తెలియని పరిస్థితి. వేతనాల చెల్లింపు ఎలా జరుగుతుందో తెలియదు. ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ ప్రకారం 300 కన్నా తక్కువ కార్మికులు పనిచేసే సంస్థలలో యాజమాన్యాలు తమ ఇష్టానుసారం కార్మికులను నియమించుకోవచ్చు అలాగే తీసివేయవచ్చు. కార్మిక సంఘాలను పెట్టుకోవడం చాలా కష్టంగా మారుతుంది. సమ్మె చేయడం అసాధ్యం అయిపోతుంది. సోషల్ సెక్యూరిటీ కోడ్ కింద ఈపీఎఫ్, ఈఎస్ఐ మరియు కార్మికుల సంక్షేమ సెస్‌లోని నిధులను ప్రధానమంత్రి అధ్యక్షతన ఉన్న నేషనల్ అడ్వైజరీ బోర్డుకి మళ్లిస్తారు. పెద్ద ఎత్తున ఉన్న ఈ నిధులను స్టాక్ మార్కెట్లోకి మళ్లించడం వలన కార్మికులు దాచుకున్న పొదుపు ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. నేషనల్ పెన్షన్ సిస్టమ్ అమల్లోకి రావడంతో పెన్షన్ నిధులు పెద్ద ఎత్తున షేర్ మార్కెట్‌లోకి వెళ్లే అవకాశాలు పెరిగాయి. ఇవన్నీ ఉద్యోగులు కార్మికుల పొదుపు సొమ్మును కార్పొరేట్ల ప్రయోజనాలకి వాడుకోతుండటంతో అంతిమంగా కార్మికుల పొదుపుకు భద్రత లేకుండా పోతున్నది.



కార్మిక వర్గం ఈరోజు కనీస వేతనం 18,000గా ఉండాలనీ, అలాగే కనీసం పెన్షన్ 6000గా ఉండాలని డిమాండ్ చేస్తున్నది. కానీ ప్రభుత్వం ఈ దిశలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సెవెంత్ పే కమిషన్ కూడా కనీస వేతనం 18000 గా ఉండాలని నిర్ణయించింది. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ కూడా కనీస వేతనం 18000గా ఉండాలని సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు తీర్పు కూడా దీనికి అనుగుణంగానే ఉంది. కనీస వేతనాల చట్టంను వేజ్ కోడ్ బిల్లులో కి మార్చి వేయడం ద్వారా కనీస వేతనాలు చెల్లించే బాధ్యత నుంచి ప్రభుత్వాలు, యాజమాన్యాలు తప్పించుకోవాలని చూస్తున్నాయి.

నూతన ఆర్థిక విధానాలలో భాగంగా పబ్లిక్ రంగ సంస్థలను, ప్రభుత్వ వనరులను అలాగే ప్రభుత్వ సర్వీసులను ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతున్నది. ఇది ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడమే.1991 కాంగ్రెస్ ప్రభుత్వంతో మొదలైన ఈ ప్రైవేటీకరణ ప్రక్రియ ఎన్డీఏ ప్రభుత్వంలో జోరుగా సాగుతున్నది. పార్లమెంట్‌లో వామపక్షాలు బలంగా ఉన్న సమయంలో ఈ ప్రైవేటీకరణ జోరు ఆగినా ప్రస్తుత ప్రభుత్వంలో అది తిరిగి వేగం పుంజుకున్నది. ప్లానింగ్ కమిషన్‌ను రద్దు చేసి నీతి ఆయోగ్ ఏర్పరచడం జరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ మరియు వాటిని అమ్మే బాధ్యతను నిటి ఆయోగ్‌కు అప్పగించడం జరిగింది. డిఫెన్స్, స్టీలు, బొగ్గు, పవర్, ఫార్మస్యూటికల్స్, డ్రగ్స్, విమానయానం, హెవీ ఇంజనీరింగ్, నిర్మాణ రంగం, బ్యాంకులు బీమా కంపెనీలు అన్నిటినీ ప్రైవేట్ రంగానికి దారాదత్తం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. డిఫెన్స్ రంగ ప్రైవేటీకరణ వల్ల డిఫెన్స్ రంగంలో గల స్వావలంబన మరియు పరిశోధన దెబ్బతినే అవకాశం ఉన్నది. రైల్వే డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పరిచి భారతీయ రైల్వేలను ప్రైవేటీకరించాలని చూస్తున్నారు. భారతీయ రైల్వే ట్రాక్‌లపై ప్రైవేట్ వారిని అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన సికింద్రాబాద్ స్టేషన్‌తో సహా ప్రధాన నగరాలలోని 23 రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణకు మార్గం సుగమం అయిపోయింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనాల ద్వారా ప్రైవేట్ పరం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇన్సూరెన్స్ రంగంలో జీఐసీరే మరియు న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలలో పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. ఐడీబీఐ కొనుగోలు నేపథ్యంలో బీమా దిగ్గజం అయిన ఎల్ఐసి ని కూడా ప్రైవేటీకరించాలని కార్పొరేట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. లాభాలు సంపాదిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర ఉన్న మిగులు నిధులను డివిడెండ్ల పేరుమీద ముక్కు పిండి వసూలు చేసుకుని ఆ సంస్థల ఆర్థిక పుష్టిని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నది. ఇలా ప్రభుత్వ రంగ సంస్థలు అన్నిటినీ ఏదో రూపేనా నష్టపరిచి వాటిని కారుచౌకగా ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పగించే ప్రయత్నం ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్నది.

కార్మికుల మీద, ఉద్యోగుల మీద దాడులు పెరుగుతున్నప్పుడు సహజంగానే ఉద్యమాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు దేశంలో అదే జరుగుతున్నది. నేషనల్ పెన్షన్ సిస్టమ్ కి వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఢిల్లీ ప్రభుత్వం దిగివచ్చి ఎన్‌పీఎస్‌ను రద్దు చేస్తామన్నది. మోటార్ వెహికల్ యాక్ట్ కు వ్యతిరేకంగా, బస్సు రూట్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు. బ్యాంక్ ఉద్యోగులు బ్యాంకుల విలీనానికి వ్యతిరేకంగా సమ్మెలు చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ప్రత్యేకమైన టవర్ కార్పొరేషన్ ఏర్పరచడానికి వ్యతిరేకంగా సమ్మె చేసారు. గ్రామీణ డాక్ సేవక్‌లు తమ డిమాండ్ల సాధనకై 16 రోజులు సమ్మె చేశారు. విద్యుత్‌రంగ ఉద్యోగులు విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలలో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు తమ వేతనాల సవరణకు ఉద్యమబాటలో ఉన్నారు. ప్రైవేట్ రంగంలో కార్మికులు చాలా చోట్ల సమ్మెలు చేసి విజయాలు సాధించారు. కార్మికుల ఉద్యోగుల ఐక్యత పెరుగుతున్నది. పోరాటాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాన్నీ యాజమాన్యాలను ఇవి కలవరపెడు తున్నాయి. కొన్ని ప్రభుత్వ అనుకూల సంఘాలు జనవరి 8, 9న జరిగే సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్ని స్తున్నాయి. కానీ ఈరోజు కార్మికులే కాక ప్రజలు కూడా నయా ఉదారవాద విధానాలతో విసిగిపోయి ఉన్నారు. ఐక్యమవుతున్న ప్రజలను, కార్మికులను మతతత్వ విధానాలతో విభజించాలన్న ప్రభుత్వ కుటిల యత్నాలను అడ్డుకోవాలన్న కతనిశ్చయంతో వారున్నారు. ప్రజాస్వామ్యాన్ని భావ ప్రకటనాస్వేచ్ఛను హరించి వేస్తున్న నియంతత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రజలు కార్మికులు ముందుకు వస్తున్నారు.కాబట్టి ప్రభుత్వం మరియు దాని అనుకూల సంఘాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రానున్న రెండు రోజుల సమ్మె విజయవంతం కావడం తథ్యం.

సెల్: 9440244277

రిపోర్టర్స్ డైరీ

గులాబీ పార్టీ.. నరసింహనాయుడు...

నటసింహం బాలకష్ణ నటించిన సినిమాల్లో సూపర్ డూపర్ బ్లాక్ బాస్టర్‌గా నిలిచిన సినిమా నరసింహనాయుడు. ఫ్యాక్షన్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా జనాలను థియేటర్లకు పరుగులు పెట్టించటమే కాదు నిర్మాతకు కాసుల వర్షం కూడా కురిపించింది. ఆ మూవీలో గ్రామం కోసం, ప్రజల రక్షణ కోసం బాలకష్ణ ఒక సైనికుడిలా పని చేస్తాడు. ఆయన తండ్రి బాలకష్ణను గ్రామానికే అంకితం చేస్తాడు. అదే తరహాలో ఇప్పుడు టీఆర్ఎస్ తరపున ఒక్కో గ్రామం నుంచి ఒక్కో నరసింహనాయుడు తయారు కావాలంటూ సూచిస్తోంది ఆ పార్టీ అధిష్టానం. పది ఇండ్లకో కార్యకర్త.. వంద మందికో కార్యకర్త ఉండాలంటూ ఆ పార్టీ మార్గదర్శనం చేస్తున్నది. తద్వారా గ్రామాల్లో చీమ చిటుక్కుమన్నా అధిష్టానానికి తెలియాలంటూ ఇటీవలే హుకూం జారీ చేశారు గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. జనాల బాగు.. గ్రామ సంక్షేమమంటూ ఆయన ఈ సందర్భంగా స్పీచ్ దంచి కొట్టారు. పైకి చూట్టానికి ఇదంతా బాగానే ఉన్నా.. లోపల మాత్రం పార్లమెంటు ఎన్నికల కోసమేనంటున్నారు పాత్రికేయ మిత్రులు. రెండోసారి బంపర్ మెజారిటీతో గెలిచిన టీఆర్ఎస్ పార్టీకి ఇప్పటికీ గ్రామ స్థాయిలో సరైన నిర్మాణం లేదన్న విషయం అందరికీ ఎరుకే. ఈ విషయాన్ని గమనించిన ఆ పార్టీ పెద్దలు.. గెలిచిన ఊపులో మనం నిర్మాణాన్ని మరిచిపోతున్నాం.. దాన్ని పట్టించుకోకపోతే అసలుకే మోసం వస్తదంటూ ఆందోళనలో పడ్డారు. దీంతో ఆఘమేఘాల మీద పది ఇండ్లకో కార్యకర్త.. అంటూ హడావుడి చేస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల కామెంట్....

-బి.వి.యన్.పద్మరాజు

బయోపిక్‌లు..

కాదేదీ కవిత కనర్హం అన్నారు మహాకవి శ్రీశ్రీ. అదే రీతిలో కాదేదీ ఎన్నికలకు అనర్హం అంటున్నారు రాజకీయ నేతలు. ప్రతి సమయాన్ని, సందర్భాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని లాభ పడేందుకు వారు శతవిధాలా ప్రయత్నిస్తుంటారనేది కాదనలేని సత్యం. ఇప్పటిదాకా కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట రాజకీయాలు సాగించిన మన నాయకుల దృష్టి ఇప్పుడు సినిమా రంగం మీద పడింది. జనాల మెదళ్లపై విపరీతమైన ప్రభావం చూపే మాధ్యమాల్లో సినిమా ఒకటి. ఈ విషయాన్ని గమనించిన పొలిటీషియన్స్ వెండి తెరను ఆయుధంగా చేసుకుని ఓట్ల పంట పండించేందుకు రెడీ అయిపోతున్నారు. తాజాగా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు జీవిత చరిత్ర ఆధారంగా ఎన్టీఆర్, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా యాత్ర అనే రెండు సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఇదికాక కేసీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా కూడా ఓ సినిమా రూపొందుతుందట. ఈ సినిమాల వల్ల ఆ పార్టీలకు ఏ మాత్రం లాభం కలుగుతుందో వేచి చూడాలి...

- అచ్చిన ప్రశాంత్

దూడను పాలుతాగమని.... ఆవును తన్నమన్నట్టు...

లేగదూడను పాలు తాగమని చెప్పి.. ఆవును తన్నమన్నట్టుంది ప్రభుత్వ పని తీరు. ప్రజల ప్రాణాలు సంకనాకిపోయినా సరేగానీ ప్రభుత్వం ఖజానా నింపుకోవాలని చూసినట్టుంది. ధనార్జనే ధ్యేయమని భావించిన ప్రభుత్వం 31డిసెంబర్‌ను ఆదాయ వృద్ధి రోజుగా ఎంచుకుంది. ఒక్క రోజే రూ. 178 కోట్లు సమకూర్చుకుంది మన తెలంగాణ ప్రభుత్వం. సాధారణంగా వైన్ షాపులు జీహెచ్ఎమ్‌సీ పరిధిలో రాత్రి 11 గంటల వరకు, ఇరత ప్రాంతాల్లో రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటాయి. కానీ ఆ రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు వైన్ షాపులు తెరిచి ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లను రాత్రి ఒంటిగంట వరకు తెరిచిపెట్టారు. అదేవిధంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పాయింట్లు ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేశారు. ఒక పక్క తాగమనీ, తాగి ఊగమనీ ప్రోత్సహించిన సర్కారు, మరోపక్క తాగి డ్రైవింగ్ చేయొద్దంటూ హెచ్చరించింది. ఈ విధంగా రెండు వైపుల నుంచి ప్రజల సొమ్ము దోచుకోవడానికి ప్రభుత్వానికి కొంచెమైనా సిగ్గుండాలంటూ కొంత మంది ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు.


- మోత్కూరు యాదయ్య

సీపీఎంపై విషం!

శబరిమల విషయంలో మతోన్మాద శక్తులు సీపీఐ(ఎం)పై విషం చిమ్ముతున్నాయి. వాస్తవాలను మరుగుపరిచి శబరిమల ఘటనలకు సీపీఐ(ఎం) కారణమంటూ దుష్ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళలు వెళ్లవచ్చు అన్న సుప్రీంకోర్టు తీర్పును పక్కన పెట్టి భక్తుల విశ్వాసాలను సీపీఐ(ఎం) దెబ్బతీస్తున్నదంటూ కారుకూతలు కూస్తున్నాయి. మహిళలను సీపీఐ(ఎం) సర్కారే ఆలయంలోకి తీసుకపోతున్నదని ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, బీజేపీ వాస్తవాలను వక్రీకరిస్తూ...కేరళ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నాయి. సుప్రీం కోర్టు తీర్పు వెలువడగానే ముందుగా మతోన్మాద శక్తులు చీకట్లో ఒక 'సంస్థ'ను స్థాపించాయి. ఎవరైనా మహిళలు ఆలయంలోకి పోతే అడ్డుకుంటామని హెచ్చరికలు జారీ చేశాయి. అక్కడే తిష్టవేసి మహిళలపై నిఘా పెట్టాయి. అందులో సీపీఐ(ఎం) పాత్ర ఏమీలేదు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దానికి అనుగుణంగా ఆలయంలోకి పోవడానికి మహిళలు సిద్ధపడితే...దానికి.. సీపీఎం పార్టీకి ఏం సంబంధమో చెప్పడలేదు. సీపీఐ(ఎం) రెచ్చగొడుతుందంటూ పదే పదే మతోన్మాద శక్తులు గోబెల్ ప్రచారాన్ని చేస్తున్నాయి. శబరిమల ఘటనను ఉపయోగించి కేరళ రాష్ట్రంలో పాగా వేయాలని బీజేపీ కుట్ర చేస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతలపై చర్యలు చేపడితే...అన్ని కోర్టు తీర్పులను అమలు చేస్తున్నారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. సుప్రీం కోర్టుపైగానీ, రాజ్యాంగం పట్లగానీ వారికి నమ్మకం లేదు. కేవలం మత విశ్వాసాలపై మాత్రమే నమ్మకం పెడుతున్నారు. ఈ వైఖరి దేశానికి, ప్రజలకు చాలా ప్రమాదం..

-గుడిగ రఘు

పార్టీల దుక్నాలు




తెలిదేవర భానుమూర్తి

నడిరాత్రి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. కుక్కలు బౌబౌమంటున్నయి. సడక్ మీద ఆడొకమోటర్ ఈడొక లారి బోతున్నది. సలి వనికిస్తున్నది. అందరు బండుకున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. సడక్ మీద లాటితోని మోర్ గొట్టుకుంట గూర్క దిర్గుతున్నడు. నిద్ర నడ్మల లేసిన సంటిపోరడు పాల కోసం ఏడుస్తున్నడు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్లకెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.

సరింగ నాత్రి రొండు గొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. గని ఎప్పటి లెక్కనే సైకిల్ గంటి సప్పుడినంగనే బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నట్లు గొడ్తున్నదునుకోని ఐదారు పార్లు విక్రమార్కుడు గంటి బజాయించిండు. గంటి సప్పుడుకు బేతాలుడు నిద్ర లేసిండు. సల్లనీల్లతోని మొకం గడుక్కుండు. ఇంట్లకెల్లి ఇవుతలకొచ్చిండు. సైకిలెన్క ఎక్కి గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు–

“ నన్ను గూసుండ బెట్టుకొని గుంతలు; ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీ కాల్లు గుంజొచ్చు. నీకు దమ్ము రావొచ్చు. గవన్ని యాది మర్సెతందుకు నీకొక కత జెప్త ఇను. పహెలీ తారీకు పట్నంల నుమాయిష్ షురువైంది. హోంమంత్రి మహమూద్ అలీ రిబ్బిన్ కట్ చేసి నుమాయిస్‌ను షురువు జేసిండు. ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ గూడ గాయిన యెంబడి ఉన్నడు. నుమాయిష్లకు బోయెతందుకు మూడు గేట్లు బెట్టింద్రు. విఐపిల కోసం ఇంకొక గేటు గూడ ఉన్నది. నుమాయిష్లకు బోయెతందుకు తలా ముప్పై రూపాల టికిట్ బెట్టింద్రు. నుమాయిష్ల రంగుల రాట్నమున్నది. మినీరైలున్నది. తీరుతీర్ల దుక్నాలు ఉన్నయి. మినీరైలు ఎక్కి నుమాయిష్ నంత సూడొచ్చు. నుమాయిష్ల టిఆర్ఎస్ దుక్నమున్నది. గది గులాబి రంగుతోని ఉన్నది. గా దుక్నంల గులాప్పూలున్నయి. బుకా గులాలున్నయి. గులాబి జెండలు; గులాబి కండ్వలున్నయి. మోటర్ బొమ్మలున్నయి. అసెంబ్లి ఎలచ్చన్లప్పుడు కెసిఆర్ రాసిన పాటలు ఉన్న సీడీలు గూడ ఉన్నయి. గా దుక్నంల ముక్యమంత్రి కుర్సి బొమ్మ ఉన్నది. హోం మంత్రి కుర్సి బొమ్మ ఉన్నది. గని కడ్మ మంత్రులు కుర్సిల బొమ్మలు లెవ్వు. పంచాయితి ఎలచ్చన్లు జెయ్యబట్కె నెలదినాలైనంక కడ్మ మంత్రుల కుర్సిల బొమ్మలు బెడ్తరంట. గా దుక్నంల తెలంగాన తల్లి బొమ్మనే గాకుంట తెలంగాన నక్ష గూడ ఉన్నది. రైతు బంధు చెక్కులు; బత్కమ్మ చీరెల నమూనాలు గూడ గా దుక్నంల ఉన్నయి. గవ్విటిని గూడ పంచాయితి ఎలచ్చన్లు అయినకంనే ఇస్తరంట. గులాబి రంగు పతంగిలు; గులాబి రంగు చెర్కలే గాకుంట గులాబి రంగు మాంజ



గూడ గా దుక్నంల ఉన్నది. తీరుతీరు ముగ్గులు; తీరుతీరు తిట్లతోని గూడిన వైలు గూడ గా దుక్నంల ఉన్నయి. గంతే గాకుంట రొండు పెద్ద అయస్కాంతాలు గా దుక్నంల ఉన్నయి. వాస్తు వైలు గూడ ఉన్నయి. గా దుక్నంల కొత్త క్యాలండర్లు ఉన్నయి. గవ్విట్ల పదహారు అని పెద్దగ రాసి ఉన్నది.

“గీ క్యాలండర్లల్ల పదహారు అని పెద్దగ ఎందుకు రాసింద్రు” అని అడిగితె

“ పార్లమెంటు ఎలచ్చన్ల పదహారు నియోజక వర్గాలల్ల టిఆర్ఎస్‌ను గెలిపియ్యాలని జెనంకు జెప్పెతందుకే గట్ల రాసింద్రు” అని గాడ ఉన్న ఒక టిఆర్ఎస్ లీడర్ అన్నడు. గులాబి రంగు దుక్నంల డబల్ బెడ్‌రూం ఇండ్ల ఫోట్వలు గూడ ఉన్నయి. కొన్ని డబల్ బెడ్‌రూం ఇండ్లు మొగులు మీద ఉన్నట్లు ఉన్నయి. గవ్విటిని తాల్లు ఏసి జెనం కిందికి గుంజుతున్నట్టు ఫోట్వలు ఉన్నయి. పట్నంల ఒక్క గుంత గూడ లేనట్లు దీసిన ఫోట్వలు గూడ గా దుక్నంల ఉన్నయి. కెసిఆర్ యాగం జేస్తున్నప్పుడు దీసిన ఫోట్వలే గాకుంట కెటిఆర్ నెత్తిమీద కిరీటం బెట్టుకోని కత్తి బట్టుకున్న ఫోట్వ; కవిత బత్కమ్మ ఆడుతుండగ దీసిన ఫోట్వలు గా దుక్నంల ఉన్నయి.

“గివన్నిటిని ఎవరు గొంటరు?” అని అడిగితె–

“పంచాయితి ఎలచ్చన్లే గాకుంట పార్లమెంటు ఎలచ్చన్ల టిఆర్ఎస్ దిక్కుకెల్లి పోటి జేసెటోల్లు గొంటరు” అని దుక్నంల గూసున్నోడు జెప్పిండు. టిఆర్ఎస్ దుక్నంల సకినాలు; సర్వప్ప; గర్జెలు; బచ్చాలు; ముర్కులు; బుబ్బాలు; బజ్జీలు అసువంటియి గూడ అమ్మబట్టింద్రు. నుమాయిష్‌కు వొచ్చిన జెనం గవ్విటిని గొనుక్కోని దినబట్టింద్రు.

టిఆర్ఎస్ దుక్నానికి ఎదురుంగ కాంగ్రెస్; తెలుగు దేసం దుక్నాలున్నయి. కాంగ్రెస్ దుక్నం మూడు రంగులతోని ఉన్నది. గా దుక్నంల కద్దరు బట్టలున్నయి. నెహ్రూ; ఇందిరాగాంది; రాజీవ్‌గాంది; సోనియాగాంది; రాహుల్‌గాంది ఫోట్వలున్నయి. పంతొమ్మిది ఎమ్మెల్యే కుర్సిల బొమ్మలున్నయి. దివాల దీసిన కాంగ్రెస్ లీడర్ల ఫోట్వలు చెయ్యి తీర్గ ఉన్న చెంచలు; గంటెలు గా దుక్నంల ఉన్నయి. ఎంపి టికెట్లున్నయి. ఈవిఎంల నమూనలున్నయి. కల చెదిరింది. కత మారింది' అసువంటి పాటలున్న సీడీలున్నయి. ఎంపి టికిట్లకు గిరాకి లేకబోయె బట్కే గీ దుక్నంల బెట్టి అమ్ముతున్నం. ఈవిఎంల ట్యాంపరింగ్ అయ్యిందని జెనంకు జెప్పెతందుకే గవ్విటి నమూనలుంచినం అని దుక్నల గూసున్న కాంగ్రెస్ లీడర్ అన్నడు. ఇగ పచ్చరంగు, పచ్చని జెండలతోని తెలుగుదేసం దుక్నమున్నది. గా దుక్నంల పసుప్పు కండ్వలున్నయి. పసుప్పు ఉన్నది. ఊసి పోయిన సైకిల్ పయ్యెలున్నయి.చైన్ ఉన్నది. హైండిల్ ఉన్నది. పిర్బిల్ ఉన్నది. గివ్వటిని జమాయించినోనికి ఇనాం ఇస్తమని గాడ ఉన్న ఒక తెలుగుదేసం లీడర్ అన్నడు. గా దుక్నంల రొండు టిడిపి ఎమ్మెల్యే కుర్సిల బొమ్మలు గూడ ఉన్నయి. “టిఆర్ఎస్ దుక్నంల అయస్కాంతాలు ఎందుకున్నయి. గీ సవాల్కు జవాబ్ జెప్పకుంటె నీ సైకిల్ బిరక్ ఫేలైతది” అని బేతాలుడు అన్నడు.

“కాంగ్రెస్; తెలుగుదేసం దుక్నాలల్ల ఉన్న ఎమ్మెల్యే కుర్సి బొమ్మలను గుంజెతందుకు అని విక్రమార్కుడు జెప్పంగనే సైకిల్ దిగి బేతాలుడు బొందల గడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్: 9959150491

మానవి
నవతెలంగాణ



ఒక్క ఫ్రేములో ప్రపంచాన్ని చూపినవారు కొందరైతే.. ప్రపంచంలోని భిన్న కోణాలను ఫ్రేములు ఫ్రేములుగా మన ముందుంచిన దర్శకులు మరికొందరు. సినిమా తీయాలంటే... అక్షరాలను దృశ్యాల్లోకి అనువదించే నైపుణ్యం తెలియాలి. అమోఘమైన ఆ దృశ్యజ్ఞానం తెలిసిన డైరెక్టర్ శ్రీవిద్య బసవ. ఆమెకు సినిమా అంటే ఎంత ప్యాషనో... 'మధ' టీజర్ చూస్తే తెలుస్తుంది. అద్భుతమైన ప్రజెంటేషన్, ఆర్ధ్రతతో నిండిన ఆర్ఆర్... సినిమాపై ఆమెకున్న పర్ఫెక్షన్‌ను చెబుతాయి. తెలుగు ఇండస్ట్రీలో కొత్త జానర్ అయిన 'సైకో థ్రిల్లర్'ను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా మానవితో శ్రీవిద్య పంచుకున్న ముచ్చట్లు ఆమె మాటల్లోనే...



సినిమాయే ప్రపంచంగా...

'మా సొంతూరు మెదక్ జిల్లా జోగిపేట. ఐదుగురు అక్కాచెల్లెళ్లలో నట్టనడుమ వ్యక్తిని. మా చదువుల కోసమని కుటుంబం హైదరాబాద్‌కు వచ్చింది. నేను చదివింది ఇక్కడే. నేను టెంత్ క్లాసులో ఉన్నప్పుడే మమ్మీ, డాడీ విడిపోయారు. అమ్మ పేరు బసవ ఇందిర. ఇంట్లో ఆమెదే నిర్ణయాధికారం. అయితే ఐదుగురం ఆడపిల్లలం అయినా ఆమె ఎప్పుడూ భారంగా ఫీలవ్వలేదు. సరికదా... మేం ఎవ్వరం ఏం చేస్తామన్నా ఎంకరేజ్ చేసింది. 'ఇది వద్దు... అది వద్దు... ' అని రిస్ట్రిక్ట్ చేయలేదు. అమ్మ మమ్మల్ని ఎప్పుడు తక్కువ అంచనా వేయలేదు. ఫిజికల్‌గా, మెంటల్‌గా ఎంతో బలంగా పెంచింది. ఓ ఎడారిలో వేసినా... అక్కడ బతకగలిగిలా మమ్మల్ని తయారు చేసింది. మా పెద్దక్క... తన ఆసక్తి ఉన్న నటన, సంగీతం వైపు వెళ్లింది. రెండో అక్క సివిల్ ఇంజనీర్. నేను సినిమాల్లో. పెద్ద చెల్లి యూఎస్ ఆర్మీలో సైనికురాలిగా పనిచేస్తోంది. రెండో చెల్లి... యూఎస్ నేవీలో సైనికురాలు. కుటుంబం అంతా అమెరికాలోనే సెటిలయ్యింది. నేను మాత్రం సినిమాలకోసం హైదరాబాద్‌లోనే ఉండిపోయాను.

> **నా బలం అమ్మే!**
>
> ఈ సినిమా నుంచి 'మనం విశ్వసించినదాన్ని కరెక్టుగా చేస్తే... మన చుట్టూ ఉన్నావాళ్లు కూడా మనలను నమ్ముతారు'. అని నేర్చుకున్నాను. నిజానికి నా కంటే అమ్మకే నా మీద నమ్మకం ఎక్కువ. 'ఎప్పుడన్నా నేను లోగా ఫీలయినా.., బయ్యర్స్, డిస్ట్రిబ్యూటర్స్ దొరకడం లేదు. అరే ఇట్లయ్యిందే' అని బాధపడ్డా... అస్సలు నిరుత్సాహపడొద్దని చెబుతుంది. పెయిన్ లేకపోతే గోయిన్ లేదు. 'ఇల్లు, కార్, గోల్డ్ అమ్మి సినిమాకు ఇన్వెస్ట్ చేశాం. వర్కవుట్ అవ్వకపోతే తరువాత ఏంటి?' అంటే 'మళ్లీ జీరోనుంచి మొదలుపెడదాం!' అంటుంది. నా వెనుక ఉన్న ప్రోత్సాహం, నా బలం పూర్తిగా అమ్మే!



టీవీ షోస్...

నేను చదువుకుంటూనే ఏదో ఒక పని చేస్తూ ఉండేదాన్ని. అలా నేను చేసిన బిజినెసుల్లో ఒకటి... పెట్స్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్. సినీ నటుడు నాగబాబుగారు నా దగ్గర డాగ్ తీసుకున్నారు. దాని పెంపకం గురించి పూర్తిగా గైడ్ చేసేదాన్ని. దాని డెలివరీ కూడా నేనే చేశాను. పెట్స్ గురించి నాకున్న అవగాహన చూసి నాగబాబుగారు ఆశ్చర్యపోయారు. 'వీటి మీద నీకింత నాలెడ్జ్ ఉంది. టీవీ షో చేయొచ్చు కదా! ఈ సబ్జెక్ట్‌పై ఇంత వరకు ఎవ్వరూ చేయలేదు కావాలంటే మా టీవీలో నేను చెబుతాను' అని సలహా ఇచ్చారు. అంతేకాదు.. 'కంటెంట్ కూడా నువ్వే ప్రిపేర్ చేసుకో, యాంకరింగ్ నువ్వే చేయి' అని శరత్ మరార్‌గారికి కో ఆర్డినేట్ చేశారు. నేను చార్ట్‌పైన డ్రా చేసి తీసుకెళ్తే నవ్వి... 'ప్రోగ్రామ్ ప్రజెంట్ చేయాల్సింది ఇలా కాదు. పవర్‌పాయింట్ ప్రజెంట్‌చేయి' అని చెప్పారు. అడిగినట్లుగానే పిపిపి చేసి చూపించాను. కెమేరా, ఎడిటింగ్ మాటీవీ నుంచి సపోర్ట్ చేశారు. డెమో చేశాను. ఆయనకు నచ్చింది. కానీ 'మా'లో స్లాట్స్ ఖాళీ లేవు. కొంచెం టైమ్ పడుతుంది అన్నారు. చాలా లేటయిపోతుందని... హెచ్ఎమ్ టీవీలో అప్రోచ్ అయ్యాను. మొదటి మూడు ఎపిసోడ్స్ ప్రయోగం లాగే చేశారు. ఛానల్‌కు అప్పటికి ఏడాది వయసే. అయినా నా ప్రోగ్రామ్‌కి హయ్యెస్ట్ టీఆర్‌పీ వచ్చింది. దాంతో ఏడాది కాంట్రాక్ట్ ఇచ్చారు.

యాడ్స్‌నుంచి సినిమాలవైపు...

ఏడాది ఎపిసోడ్స్ చేస్తున్న క్రమంలో... మేకింగ్ మీద చాలా రీసెర్చ్ చేశాను. సినిమాల పట్ల నా నాలెడ్జ్‌ను పెంచుకునే ప్రయత్నం మొదలుపెట్టాను. అదే సమయంలో శ్రీ చరణ కమ్యూనికేషన్స్ యాడ్ ఏజెన్సీ వాళ్ల పిల్లలు బాగా చూస్తారట. ఆయన



హెచ్ఎమ్‌టీవీకి మార్కెటింగ్ హెడ్ కూడా. 'మేం డాగ్ తీసుకుందామనుకుంటున్నాం. మీరు హెల్ప్ చేస్తారా?' అని అడిగారు. వెళ్లి మాట్లాడుతుంటే తెలిసింది... ఆయన నాకు మామయ్య అవుతారని. తరువాత ఓ చిన్న యాడ్‌కి అవకాశం ఇచ్చారు. చేశాను. నచ్చింది. అంతే కార్పొరేట్ ఫిలింస్ చేయడం మొదలుపెట్టాను.కాన్సెప్ట్ దగ్గరనుంచి అన్ని నేనే చూసుకునేదాన్ని. ఆ క్రమంలోనే రచన మీద ఆసక్తి పెరిగింది. ఒక స్టోరీ రాయడం మొదలుపెట్టాను. యాడ్స్ డైరెక్షన్ చేస్తూనే... ఫిల్మ్ డైరెక్ట్ చేయాలని గోల్ పెట్టుకున్నా.తరువాత 'సినిమాటిక్ వెడ్డింగ్స్' కంపెనీ కూడా పెట్టాను. వెడ్డింగ్స్ షూట్ చూసేదాన్ని. ఈ మొత్తం ప్రక్రియలో ఫిలిం మేకింగ్ మీద పూర్తి అవగాహన పెంచుకున్నాను. ఎలాగైనా సినిమా తీసేయాలి! అదొక్కటే నా ముందున్న కల, కళ. ఎంతోమంది నిర్మాతల దగ్గరికి వెళ్లాను. ఫీమేల్ సెంటర్డ్. సైకలాజికల్ థ్రిల్లర్. 'మన తెలుగులో సైకలాజికల్ థ్రిల్లర్స్ లేవు. జీరో కమర్షియల్. సీరియస్ అండ్ డార్క్ సబ్జెక్ట్' అంటూ నిర్మాతలెవ్వరూ ఆసక్తి చూపించలేదు. 'లవ్ స్టోరీస్ తీసుకోవచ్చు కదా! సైకలాజికల్‌థ్రిల్లర్ ఎందుకు? అది అంత సేఫ్ జానర్ కాదు. నువ్వు మా దగ్గర ప్రొడక్షన్‌లో ఒక మూవీకి అసిస్టెంట్‌లాగా చేయి. మీ మీద నమ్మకం వస్తే సినిమా అవకాశం ఇస్తాం. మీ స్టోరీ ఇవ్వండి. వేరే డైరెక్టర్‌ను పెట్టి తీస్తాం' అన్నవాళ్లే అందరూ. వేరేవాళ్ల దగ్గర వర్క్ నేర్చుకుంటే.. వాళ్ల స్టయిల్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ నా మీద ప్రభావం చూపిస్తుంది. కానీ నా ఓన్ స్టయిల్ ఉండాలి. నా సిగ్నేచర్ ఉండాలని నేను అనుకున్నాను.

సినిమానే ప్రపంచంగా...

మరోవైపు సినిమాలు వర్కవుట్ కాకపోవడంతో అమెరికాకు వచ్చి సెటిలవ్వమని కుటుంబం నుంచి సలహా. కచ్చితంగా ఓ సినిమా చేయాల్సిందేనని నేను. సినిమా పట్ల నా పిచ్చిని అర్థం చేసుకుని.. అమ్మ మనమే చేద్దామన్నది. ఇల్లు అమ్మేసింది. కారు, తన నగలన్నీ అమ్మి.. నా సినిమాకోసం నిర్మాతగా మారింది. మొదట ఇండిపెండెంట్ సినిమా అనుకుని మొదలుపెట్టాం. కానీ ప్రాజెక్ట్‌లోకి వెళ్లాక బడ్జెట్ పెద్దదైపోయింది. కానీ అడుగయితే వేశాం కదా... వెనక్కి తగ్గేది లేదనుకున్నా. నా కోర్ టెక్నీషియన్స్ అందరికీ ఇది మొదటి సినిమా. అందరం సినిమా తప్ప మరో ప్రపంచం లేకుండా పనిచేశాం. మహిళా దర్శకుల దగ్గర పనిచేయడమా అని వ్యత్యాసం చూపించలేదు. రెగ్యులర్‌గా యూనిట్‌లో ఉండేవాళ్లు.. ఆర్ట్, కాస్ట్యూమ్.. డిపార్ట్‌మెంట్ వాళ్లు మొదట కాస్త తేలికగా చూసినట్లు అనిపించినా... ఒక్కసారి నా పని పద్ధతి తెలిశాక.. నా కమిట్‌మెంట్ చేశాక... వాళ్ల బాధ్యతను కరెక్టుగా నిర్వహించారు. షూటింగ్ మొదలయిన నాటినుంచి... ఎలాంటి సమస్య రాలేదు. నాకు ఓన్లీ వర్క్. పని తప్ప వేరే ప్రపంచం లేదు. అందుకే అందరూ అంతే సీరియస్‌గా తీసుకున్నారు. డే అండ్ నైట్ నిద్ర లేకుండా షూటింగ్ చేసుకున్నాం. సినిమా పూర్తయ్యాక... ఎనర్జీ లేక చచ్చిపోయినా ఓకే కానీ... సినిమా పర్ఫెక్ట్‌గా రావాలని డెడికేషన్‌తో పనిచేశాం. ఇన్ని ఏండ్ల తరువాత ఒక అవకాశం వచ్చింది. దాన్ని సరిగ్గా వినియోగించుకోవాలి. అని ఇష్టంతో కష్టపడ్డాం.

సినిమా మొత్తం పూర్తయ్యింది. రెడీ ఫర్ రిలీజ్. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయాలనుకుంటున్నాం. మాలాగే పాషనేట్ డిస్ట్రిబ్యూటర్ దొరికితే బాగుంటుంది. ప్రస్తుతం చర్చలు నడుస్తున్నాయి. సంక్రాంతి లోపు నిర్ణయం అవుతుంది. మార్చిలో సినిమా విడుదల అవుతుంది.'

> **మహిళలు డైరెక్షన్‌లోకి రావాలి...**
>
> ఇండస్ట్రీలో మహిళా డైరెక్టర్స్ చాలా తక్కువ.వేళ్లమీద లెక్కపెట్టుకోవచ్చు. మహిళలు ఉన్నా.. కాస్ట్యూమ్, మేకప్, స్టయిలింగ్ వైపు వెళ్తున్నారు. లేదంటే అసిస్టెంట్ డైరెక్షన్స్. కారణం. డైరెక్టర్ అనగానే మనకు మేల్ ఫిగర్ కనిపిస్తుంది. వీళ్లు ఒక సినిమాను హ్యాండిల్ చేయలేరేమో.. అని ఇండస్ట్రీ తక్కువ అంచనా వేస్తుంది. ఆ భావన పోవాలి. అలాగని మేల్ డామినేషన్ అని కూడా అనను. ఉన్న కొద్దిపాటి మహిళలను కూడా తొక్కేస్తే అది డామినేషన్ అవుతుంది. కేవలం మహిళల సంఖ్య లేకపోవడం వల్ల డామినేషన్‌గా కనిపిస్తుందేమోనని నా ఫీలింగ్. ఇది పోవాలంటే మహిళలు ఎక్కువగా డైరెక్షన్‌లోకి రావాలి.

కట్ట కవిత



చలి మాత్రమే కాదు..!

చలికాలంలో గర్భిణులలో చర్మం ఎక్కువగా పగిలే అవకాశాలు ఉన్నాయి. అందుకు వల్ల డిహైడ్రేషన్, జలుబు, దగ్గు, ఇన్‌ఫెక్షన్స్ వంటి అనేక ఇబ్బందులు రావచ్చు. ఈ సమయంలో దాహం లేకపోయినా కనీసం రెండు నుండి మూడు లీటర్లు మంచినీళ్లు తీసుకోవాలి. వీలైనంత వరకు రద్దీ ప్రదేశాలకు వెళ్లడం తగ్గించుకోవాలి. ఈ సమయంలో జలుబు, దగ్గు వంటి ఇన్‌ఫెక్షన్స్ తొందరగా వేరేవాళ్ల నుంచి లేదా చల్లటి వాతావరణం వల్ల వచ్చే అవకాశాలు ఉన్నాయి. వీలయితే డాక్టర్ సలహా మేరకు ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది. చర్మం పొడిబారిపోకుండా మాయిశ్చరైజర్ వాడాలి. గోరువెచ్చని నీళ్లలో స్నానం చెయ్యవచ్చు. తాజాగా కూరగాయలు, పప్పులు, పండ్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. వెచ్చని వులెన్ దుస్తులు శరీరంతో పాటు చేతులకి, కాళ్లకి కూడా మరీ బిగుతుగా లేకుండా ధరించవచ్చు. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది లేకపోతే దుప్పటి పూర్తిగా కప్పుకోవచ్చు. రోజూ కొద్దిసేపు వాకింగ్, మెడిటేషన్, యోగా వంటి వ్యాయామాలు డాక్టర్ సలహా మేరకు చెయ్యడం మంచిది. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే జలుబు, దగ్గు వంటి వ్యాధులు ఉన్నవారికి దూరంగా ఉండటం మంచిది. ప్రెగ్నెన్సీ సమయంలో రోగ నిరోధక శక్తి, మామూలు సమయంలో కంటే తక్కువగా ఉండటం వల్ల, అంటువ్యాధులు త్వరగా వ్యాపించే అవకాశాలు ఉంటాయి. ఫోలిక్ యాసిడ్ అనేది బి9 అనే బీకాంప్లెక్స్ విటమిన్ జాతికి చెందినది. ఇది శరీరంలోని కణాలలో డీఎన్ఏ తయారీకి ఉపయోగపడుతుంది. ఇది ప్రెగ్నెన్సీ రాకముందు, వచ్చిన తర్వాత కూడా వాడటం వల్ల బిడ్డ ఎదుగుదల, అవయవాల తయారీకి ఉపయోగపడుతుంది. అలాగే మెదడు నాడీ వ్యవస్థ సరిగా ఏర్పడటానికి దోహదపడుతుంది. దీని లోపం వల్ల కొంత మంది శిశువులలో అవయవలోపాలు, మెదడు, వెన్నుపూస ఏర్పడటంలో లోపాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. కాబట్టి గర్భిణీలు తప్పనిసరిగా మొదటి మూడునెలలు ఫోలిక్ యాసిడ్ సంబంధిత ఆహారం తీసుకోవడం, మాత్రలు రోజుకొకటి వేసుకోవడం మంచిది.


*

రంగ వల్లులు




సంగీత
నల్లగొండ

16 చుక్కలు, 16 వరుసలు










మలిచేయండిలా...

'ఇనుములో హృదయం మొలిచెనే...' ఓ సినిమా పాట. నిజమే మనకు మనసుంటే నిజంగానే ఇనుములో హృదయం మొలిపించొచ్చు. దానికి కాసింత సృజనను జోడించేస్తే.. ఎలాంటి తీగలనైనా ఇలాంటి అద్భుతమైన కళాఖండాలుగా మలిచేయొచ్చు. ఇంట్లో అందమైన అలంకరణ వస్తువులుగా చేసేయొచ్చు.













నరసరావుపేట యువ జడ్జి ఐశ్వర్య హఠాన్మరణం

నరసరావుపేట : గుంటూరు జిల్లా నరసరావుపేట ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పొట్లూరి ఐశ్వర్య(26) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఆమె కోర్టులో కాలు బెణికి జారి పడినట్టు సిబ్బంది తెలిపారు. అనంతరం విశ్రాంతి కోసం సెలవు పెట్టారన్నారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఐశ్వర్య తన తల్లికి కాఫీ కలుపుతూ కుప్పకూలిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఐశ్వర్య భౌతిక కాయాన్ని స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, పలువురు జడ్జీలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని చిత్తూరు జిల్లా చంద్రగిరికి తరలించారు.

రేణుకాచౌదరిపై గుస్సా..!

- ఖమ్మం నేతల ఫిర్యాదు
- టీడీపీతో పొత్తు నష్టం చేకూర్చింది
- రెండు రోజు కాంగ్రెస్ సమీక్షల్లో నేతల వివరణ

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

మాజీ ఎంపీ రేణుకాచౌదరి సొంతపార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేశారని ఖమ్మం జిల్లాల నేతలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వకపోగా, లోలోపల వ్యతిరేకంగా పని చేశారని ఆరోపణలు గుప్పించారు. ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి టీడీపీతో పొత్తే కారణమని, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తును వ్యతిరేకిస్తామని మాజీమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగంగానే చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి పార్లమెంటు నియోజకవర్గాల సమీక్ష నిర్వహించింది. దీనికి టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, సలీంమహ్మద్ హాజరయ్యారు. పార్టీ ఘోర పరాజయానికి గల కారణాలను నియోజకవర్గాల వర్గాల వారీగా అభిప్రాయాలు తీసుకుంటున్నది. ఓటమికపై ఆయా నియోజకవర్గాల అభ్యర్థులను, జిల్లా పార్టీ ముఖ్యనేతలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు అభ్యర్థులను ఎందుకు విశ్వసించలేదని, పార్టీ నేతల్లో ఉన్న అంతర్గత కుమ్ములాటలు పని చేశాయా? అంటి అంశాలపై చర్చ జరిగింది. అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడం, టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వంటి అంశాలే తమ ఓటమికి కారణమైనట్టు పలువురు అభ్యర్థులు అధిష్టానం దష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. చాలా తక్కువ ఓట్లతో ఓటమిపాలైన చోట్ల వీవీపీఏటీ స్లిప్పులను లెక్కించేలా న్యాయస్థానాలను ఆశ్రయించాలనే అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది.

మహాకూటమి ఎందుకని ముందే చెప్పా : కోమటిరెడ్డి

ఎన్నికలో జరిగిన అవకతవకలపై అభ్యర్థులు తమ అభిప్రాయాలు అడిగారని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. మహాకూటమి వద్దని ఎన్నికలకు ముందే తాను చెప్పినట్టు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పొత్తు వద్దని సమీక్ష సమావేశంలో చెప్పానన్నారు.

ఓటమికి సమిష్టి బాధ్యత : మల్లు భట్టి విక్రమార్క

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి సమిష్టి బాధ్యత అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఎన్నికలను కేసీఆర్ వర్సెస్ చంద్రబాబు అనేలా మార్చివేశారన్నారు. కొన్ని చోట్ల చంద్రబాబుతో లాభం జరిగిందని, మరిన్ని కొన్ని చోట్ల నష్టం జరిగిందన్నారు. పార్టీ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా పని చేస్తానన్నారు.

వీడీసీలను నిషేధించాలి

- సార్వత్రిక సమ్మెలో దళితులు పాల్గొనాలి: కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. నాగయ్య




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగేతర శక్తిగా అరాచకాలు చేస్తున్న విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ)లను వెంటనే నిషేధించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. నాగయ్య డిమాండ్ చేశారు. శనివారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో కేవీపీఎస్ రాష్ట్ర ఆఫీసుబేరర్స్ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాడిగళ్ల భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో వీడీసీల ముసుగులో అగ్రకుల పెత్తందారులు దళితులను సాంఘిక బహిష్కరణకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలనకు పోటీగా వీడీసీలను అగ్రకుల పెత్తందారులు ఏర్పాటు చేశారని చెప్పారు. నిజామాబాద్ జిల్లా మారంపల్లిలో అన్ని కులాలు తమ కుల భవనాలు నిర్మించుకుంటే పట్టించుకోని వీడీసీ ఎస్సీలు, అంబేద్కర్ భవనం నిర్మించుకుంటే ఎందుకు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బంధువులు మాల కులస్తులపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. తక్షణమే వీడీసీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని వీడీసీల ఆగడాలను అరికట్టాలని కోరారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ 8,9 తేదీల్లో జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎం. కుర్మయ్య, ఎం. కృపాసాగర్, ఎ. మాణిక్యం, నందిపాటి మనోహర్, పాలడుగు నాగార్జున, అరూరి కుమార్, ఎం. దశరరథ్, బోడ సామేలు, తిప్పారపు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పునరుద్ధరించాల్సిందే..!

- రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల ధర్నాలో రమేశ్‌బాబు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వేతనం పెరుగుతున్నప్పుడల్లా రిటైర్డు బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ కూడా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 'కో ఆర్డినేషన్ ఆఫ్ బ్యాంక్ పెన్షనర్స్‌అండ్ రిటైర్డు అసోసియేషన్, ఆలిండియా బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్' సంయుక్తంగా ధర్నా చేపట్టాయి. పెన్షన్ పునరుద్ధరణ కోసం అనేక పోరాటాలు చేసినప్పటికి కేంద్ర ప్రభుత్వ పట్టించుకోవడం లేదని వక్తలు విమర్శించారు. శనివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీబీపీఆర్‌వో జాయింట్ కన్వీనర్ ఎ రమేశ్‌బాబు మాట్లాడుతూ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చాలా కాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. అయినప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ధర్నా చేట్టామని చెప్పారు. అందులో ముఖ్యంగా పెన్షన్ పునరుద్ధరణతోపాటు ఫ్యామిలీ పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. 2012 తర్వాత రిటైరు ఉద్యోగులకు పెన్షన్ పెరగడం లేదన్నారు. ఆర్యోగబీమా సౌకర్యం కూడా అమలు కావడంలేదని, డీఏ పెరగడం లేదన్నారు. ఈ విషయంలో ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని డిమాండ్ చేశారు. వేతనాలతోపాటు పెన్షన్లు కూడా పెంచాలంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆ తీర్పును కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ఉద్యోగులు రిటైరైన తర్వాత జీవితాంతం ఆ కుటుంబం బతకడానికి పెన్షన్ ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంలో బ్యాంక్ ఉద్యోగ పెన్షనర్లు 4.23 లక్షల మంది పెన్షనర్లు, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20వేల మంది పెన్షనర్లు ఉన్నారని చెప్పారు. పెన్షన్ రెగ్యులేషన్ 35 (1) ప్రకారం పెన్షన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు సదాశివరావు, శాస్త్రీ, కృష్ణకుమార్, జి సుబ్రమణ్యం, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలతో వ్యవసాయం చిన్నాభిన్నం

కౌలు రైతులు లేకపోతే సాగు ప్రశ్నార్థకం

- ప్రకృతి సాగు వెనుక కార్పొరేట్ లాభాలు
- ఆర్థిక సంస్కరణలు-వ్యవసాయరంగంపై ప్రభావం సదస్సులో శ్రీనివాసరావు



ఏలూరు: సంస్కరణల అమలుతో తొలిదెబ్బ వ్యవసాయంపైనే పడిందని, సబ్సిడీలు ఎత్తేసి, ఎరువుల ధరలు అమాంతంగా పెంచడంతో రైతులు రక్తం చిందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాల ఫలితంగా గ్రామీణ పేదలు, రైతుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పవరుపేటలో అన్నే భవనం వద్ద రైతు, వ్యవసాయ కార్మిక నేత, అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు 15వ వర్ధంతి సభ సందర్భంగా 'ఆర్థిక సంస్కరణలు-వ్యవసాయ రంగంపై ప్రభావం' అంశంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 25 సంవత్సరాల నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ఉపాధి కోల్పోయి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. భూ యజమానులు పూర్తిగా వ్యవసాయ సాగు నుంచి తప్పుకున్నారని చెప్పారు. కౌలు రైతులే లేకపోతే వ్యవసాయ సాగులేదని, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కరణల ఫలితంగా అభివృద్ధి ఫలాలు కొందరికే చేరుతున్నాయని, పేదలు మరింత పేదలుగా మారారని చెప్పారు. అభివృద్ధి అంటే సిమెంట్ రోడ్లు, భవనాలు గురించి మాట్లాడుతున్నారని, మనిషి అభివృద్ధి గురించి మాట్లాడడం లేదని పేర్కొన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగి వ్యవసాయంలో నష్టాలొచ్చి కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. గిట్టుబాటు ధరలేక, కష్టపడి పండించిన పంటలు అమ్ముకునే పరిస్థితి లేక రైతుకు అప్పులే మిగులుతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు ఒకప్పుడు వరి వ్యవసాయంలో సంవత్సరానికి 70 నుండి 80 రోజులు పని దొరికితే, ఇప్పుడు 20 నుండి 25 పని దినాలకు పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీరో బడ్జెట్‌తో ప్రకృతి సేద్యం అంటున్నారని, అందులో నిజం లేదని చెప్పారు. ఆవుపేడ, పంచామృతంతో ఎకరా, అరెకరా సాగు చేయొచ్చని, నాలుగు, పది ఎకరాలు సాగుచేసే రైతుకు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. వాటి సరఫరాకు కార్పొరేట్లు కంపెనీలు స్థాపించి దోచుకుంటారన్నారు. ముఖ్యమంత్రి అమెరికా వెళ్లి ప్రకృతి సేద్యంలో పెట్టుబడులు పెట్టాలని చెబుతున్నారన్నారు. ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, రైతులు, చేతివృత్తిదారులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పూర్వ నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ అన్నే వెంకటేశ్వరరావు 13 ఏండ్ల వయసులోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని అరెస్టు అవ్వడంతో ప్రారంభించిన ప్రజా జీవితం 2003 వరకూ సమాజ మార్పు కోసం అంకితం చేశారని తెలిపారు. ఆయన సతీమణి అనసూయ పోరాటాలలో, ఉద్యమాలలో చేదోడు వాదోడుగా పనిచేశారని చెప్పారు.

'ఉపాధి'కి నిధుల కొరత

ఇప్పటికే 99శాతం ఫండ్ ఖర్చు

- అదనపు నిధుల కోసం పలుపార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేల డిమాండ్
- ప్రధాని మోడీకి చట్టసభ్యులు, ఆర్థికవేత్తల లేఖాస్త్రం

న్యూఢిల్లీ: గ్రామీణ భారతంలో ఎందరికో జీవనాధారంగా మారిన ఉపాధి హామీ చట్టం.. మోడీ హయాంలో నిధుల కొరతను ఎదుర్కొంటున్నది. వ్యవసాయ సంక్షోభంతో గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు కొట్టుమిట్టాడుతుండగా.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ)కు నిధుల కొరత ఏర్పడటం వారిని మరింత అగాధంలోకి నెట్టేసేలా ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీలకతీతంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేధావులు, కార్యకర్తలు ఒక్కతాటిపైకి వచ్చి అదనపు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కర్నాటక, రాజస్థాన్, గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్‌ల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖ విద్యావేత్తలు, ఆర్థిక వేత్తలు ఈ మేరకు ప్రధాని మోడీకి లేఖాస్త్రాన్ని సంధించారు.

ఢిల్లీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో.. ఇప్పటికే 99శాతం(మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ప్రకారం) ఎంజీఎన్ఆర్ఈజీఏ నిధులు ఖర్చయిపోయాయని వారు వెల్లడించారు. దేశంలోని గ్రామీణుల జీవనం దుర్భరంగా మారిన ప్రస్తుత తరుణంలో, ఎంతో మందికి జీవనోపాధిని కల్పిస్తున్న ఈ చట్టంపై మోడీ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. 2010-11లో ఎంజీఎన్ఆర్ఈజీఏ నిధుల కేటాయింపు జీడీపీలో 0.51శాతంగా ఉండగా, 2017-18లో 0.38కి తగ్గాయని వివరించారు. ఐదేండ్ల నుంచి ప్రతియేటా కేటాయించిన నిధుల్లో 20శాతం క్రితం ఏడాదిలోని పెండింగ్ ఖర్చులకే పోతున్నాయని, దీంతో ఈ ఎంజీఎన్ఆర్ఈజీఏను అమలు చేయడం కష్టతరంగా మారిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి తమ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేరుస్తామని పలుపార్టీల ప్రతినిధులు తెలిపారు.

సీపీఐ(ఎం) నేతలు సీతారాం ఏచూరి, బృందా కరత్, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ, పృథ్వీరాజ్ చౌహాన్, ఎంపీలు కరణ్ సింగ్ యాదవ్, రాజీవ్ గౌడ, కె రాజ, పీపుల్స్ యాక్షన్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ సభ్యులు, ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా, సమృద్ధ భారత్ ఫౌండేషన్, ప్రముఖ ఆర్థిక వేత్తలు జయతీ ఘోష్, ప్రభాత్ పట్నాయక్, అరుణ రాయ్, హర్షమందర్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టాన్ని మరింత బలపరిచేలా మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, గ్రామీణ కార్మికుల సమస్యలను అనుసంధానించే చూసే అవసరమున్నదని వారు అభిప్రాయపడ్డారు. బీహార్‌కు చెందిన కార్మికుడు, కార్యకర్త సంజయ్ సాహ్ని మాట్లాడుతూ.. నెలలపాటు ఎదురుచూసినా కార్మికులకు వేతనాలు అందట్లేదని అన్నారు. గ్రామాల్లో ఉపాధి కోసం ఎందరో ఎదురుచూస్తున్నారని.. కానీ, ఎంజీఎన్ఆర్ఈజీఏ సరిగ్గా అమలు కావడం లేదని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రీనా మాట్లాడుతూ.. చట్టం హామీనిస్తున్నట్టు 100 రోజుల ఉపాధిని అందించడం లేదని విమర్శించారు.



ఉపాధి హామీ చట్టంపై మోడీ నిర్లక్ష్యం.. దేశంలో ఈ చట్టంపై ఆధారపడి జీవితాలను వెళ్లదీస్తున్న పేదలపాలిట శాపమేనని దళిత నేత జిగ్నేశ్ మేవానీ అన్నారు. ఈ చట్టంలోని ఉపాధి దినాలను 200 రోజులకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. మొదటిసారిగా.. ఎంజీఎన్ఆర్ఈజీఏ సమస్యలపైనా పోరాడేందుకు రైతు ఉద్యమం అంగీకరించిందని స్వరాజ్ అభియాన్ నేత యోగేంద్ర యాదవ్ తెలిపారు. పంట ఇన్సూరెన్స్, రుణ మాఫీతోపాటు ఎంజీఎన్ఆర్ఈజీఏ సమస్యలపైనా తమ గళాన్ని వినిపిస్తామని అన్నారు.

ఉపాధి హామీ చట్టానికి మద్దతునివ్వడమే కాదు, ఈ నెల 8, 9 తేదీల్లో చేపట్టే భారత్ బంద్‌లో ఈ అంశాన్ని ప్రధానంగా లేవదీస్తామని సీపీఐ(ఎం) కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు.

ఎంజీఎన్ఆర్ఈజీఏ నుంచి ఆధార్ అనుసంధాన్ని తొలగించాలని సీపీఐ(ఎం) నేత బృందా కరత్ డిమాండ్ చేశారు. సోషల్ ఆడిట్ ప్రాధాన్యాన్ని ఆమె గుర్తు చేశారు. ఉపాధి హామీచట్టం గ్రామీణ కార్మికుల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు.

శంషీర్ ఇంటిపై కాషాయగూండాల బాంబుదాడి

డీవైఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కేరళ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎఎన్ శంషీర్ ఇంటిపై కాషాయ గూండాల బాంబుదాడికి డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శంషీర్ ఇంటిపై శనివారం ఉదయం కాషాయ గూండాలు చంపాలనే కుట్రతో బాంబులతో, కర్రలతో దాడులు చేసి అరాచకాన్ని సృష్టించాలని చూశాయని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న కేరళ ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నాయని పేర్కొన్నారు. శబరిమలలో సంప్రదాయం పేరుతో మహిళలను ఆలయంలోకి అనుమతించాలనే సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరిస్తూ ఆందోళనలు చేస్తూ అలజడి సృష్టిస్తున్నాయని తెలిపారు. శబరిమలకు స్వచ్ఛందంగా వస్తున్న మహిళలను సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని అస్థిరత కలగజేసి కూల్చాలని ప్రయత్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఉగ్రచర్యలకు కాషాయ శక్తులు పూనుకుంటున్నాయని తెలిపారు. ఈ చర్యలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ దాడికి నిరసనగా ఆదివారం అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీతో టీఆర్ఎస్ రహస్య ఒప్పందం: పొన్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీతో టీఆర్ఎస్‌కు ఉన్న రహస్య ఒప్పందంలో భాగంగానే టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ కార్యానిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్ విమర్శించారు. 103 నియోజకవర్గాల్లో డిపాజిట్లు దక్కని బీజేపీని వదిలి పెట్టి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం గాంధీభవన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి ఫయిమ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. పంచాయతీలు ఏకగ్రీవమైతే రూ 10లక్షలు ఇస్తామని ఎన్నికల అధికారులు చెబుతుంటే కేటీఆర్ రూ 15 లక్షలు ఇస్తామని భయపెడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నాయన్నారు.

లైంగిక బాధితులకు అండగా నిలవాలి

ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ

- హైదరాబాద్‌కు చేరిన రాష్ట్రీయ గరిమ అభియాన్ డిగ్నిటీ మార్చ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో లైంగిక దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. బాధితులకు న్యాయం జరగక అనేక అవమానాలు, ఛీదరింపులు, అణచివేత, ఆదిపత్యధోరణికి గురవుతున్నారని అన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దోపిడికి వ్యతిరేకంగా రాష్ట్రీయ గరిమ అభియాన్ ఆధ్వర్యంలో తలపెట్టిన 'డిగ్నిటీ మార్చ్' హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'భారతదేశంలో లైంగిక హింస - రేప్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రముఖులతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన లైంగిక బాధితులు సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మహిళలు వికృతమైన దుస్తులు ధరించడం లైంగిక దాడులను ప్రేరేపిస్తాయని, ఇలాంటి వాటిని కొంతమంది సమర్థించడం ఆందోళన కలిగించే అంశమని వాపోయారు. నిజానికి పురుషాధిక్య భావజాలం వల్ల ఇలాంటి దాడులు జరుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొన్ని మీడియా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా బాధితులను కించపర్చే విధంగా ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. 'నేరం చేసింది మీరు..మేము కాదు' అంటూ బాధితులు ఇలాంటి యాత్రలు చేయడం హర్షణీయమని అన్నారు. మహిళా సామాజిక వేత్త కె.సత్యవతి మాట్లాడుతూ లైంగిక కేసులు ఏండ్ల తరబడి పెండింగ్‌లో పేరుకుపోతుండటంతో బాధితులకు న్యాయం జరగడంలేదని, ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఇలాంటి కేసుల్లోని బాధితులను సమాజం అంటరాని వారీగా చూస్తున్నదని వాపోయారు. రాష్ట్రీయ గరిమ అభియాన్ కన్వీనర్ ఆశిఫ్ షేక్ మాట్లాడుతూ లైంగిక కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితులపై అవమానాలు, వేధింపులకు పాల్పడకుండా మద్దతుగా నిలవాలని అప్పుడే వారికి సామాజిక న్యాయాన్ని అందించిన వారమవుతాయని అన్నారు. సదస్సులో బాధితులు లలిత (మధ్యప్రదేశ్), హల్లీభాయి (ఉత్తర ప్రదేశ్), యశోద (మహారాష్ట్ర) తదితరులు పాల్గొన్నారు. కాగా, డిసెంబర్ 20న ముంబైలో 5 వేల మందితో ప్రారంభమైన డిగ్నిటీ మార్చ్ ఫిబ్రవరి 22న ఢిల్లీలో ముగియనుంది. యాత్రలో బాధితులు 24 రాష్ట్రాల్లో 10 వేల కి.మీ. పర్యటించి లైంగిక బాధితులను దూరంగా ఉంచడం, నిందించడం, వెటకారాలను నిరోధించడం వంటి అంశాలపై ప్రచారం చేస్తారు.

కార్టూనిజం సులువు కాదు


నిత్యం రాజకీయ అధ్యయనంతోనే అద్భుత కార్టూన్లు : అల్లం నారాయణ

- కార్టూ'నిజం' కత్తిమీద సాములాంటిది: కె.శ్రీనివాస్‌రెడ్డి
- కార్టూనిస్టుకు నిత్యం ప్రసవ వేదనే : కట్టా శేఖర్‌రెడ్డి
- మీడియా ప్రశ్నిస్తే సహించలేని పరిస్థితి: ఎస్.వీరయ్య
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఉత్తమ కార్టూనిస్టు-2018 అవార్డు గ్రహీత నర్సింకు సన్మానం




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్, నారాయణగూడ

దినపత్రికల్లో రోజూ కార్టూన్లు గీయడం అంత సులువుకాదని, రాజకీయ పరిణామాలను నిత్యం అధ్యయనం చేయడంతో పాటు విశ్లేషణా సామర్థ్యం ఉంటేనే అది సాధ్యమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ అన్నారు. మీడియా ఆర్టిస్టులు, కార్టూనిస్టులు, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఉత్తమ కార్టూనిస్టు-2018 అవార్డు గ్రహీత, నవతెలంగాణ సమగ్ర తెలుగు దినపత్రిక కార్టూనిస్టు నర్సింకు సన్మానసభ శనివారం జరిగింది.



ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అల్లం నారాయణ మాట్లాడుతూ కుంచెకు అద్భుత జ్ఞానం తోడైతేనే మంచి కార్టూన్లు జాలువారుతాయన్నారు. ఇన్‌చార్జి, న్యూస్‌ఎడిటర్, ఎడిటర్..ఇలా అందరినీ సంతృప్తి పరుస్తూ ఆ రోజు జరిగిన రాజకీయ, ఇతర పరిణామాల మీద ఎవ్వరి మనస్సులు నొప్పించకుండా వ్యంగం తో కూడిన కార్టూన్ వేయడం చాలా ఒత్తిడితో కూడుకున్నదని అభిప్రాయపడ్డారు. క్యారికేచర్ కళ అద్భుతమైనదన్నారు. అద్భుతమైన జర్నలిస్టులు, కార్టూనిస్టులు ఉన్నప్పటికీ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి పనిచేయాల్సిన పరిస్థితి నేడు నెలకొందని వాపోయారు. మొదట్నుంచీ రాజకీయ, సామాజిక, ప్రశ్నించే, పోరాట చైతన్యం వల్లనేమోగానీ నల్లగొండ జిల్లా నుంచి జర్నలిస్టులు అధికంగా వస్తున్నారనీ, ప్రధాన పత్రికల ఎడిటర్లందరూ, కార్టూనిస్టులందరూ అదే జిల్లాకు చెందిన వారు కావటం గర్వకారణమని అన్నారు. ఇటీవల మీడియా విస్తరణ ఎక్కువైపోయిందనీ, అదే క్రమంలో మీడియా సంస్థలు బతకడమూ కష్టమై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక, రాజకీయ రుగ్మతలపై కార్టూన్లను గీయించే స్వేచ్ఛ నవతెలంగాణకే కలదు : కట్టా శేఖర్‌రెడ్డి



నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టాశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కార్టూనిస్టు ప్రతిరోజూ కార్టూన్ వేయటం ప్రసవ వేదన లాంటిదన్నారు. వరల్డ్‌బ్యాంకు, అంతర్జాతీయ రాజకీయ, మతోన్మాదం, రాజకీయ రుగ్మతల మీద కార్టూన్లు వేయించి ప్రచురించేగల స్వేచ్ఛ తెలుగులో ఒక నవతెలంగాణ పత్రికకే ఉందని కొనియాడారు. మంచి కార్టూన్లు వేసినప్పటికీ అనివార్యంగా రోజువారీ పరిస్థితుల వల్ల ఎడిటర్లు తిరస్కరిస్తే వెంటనే కార్టూనిస్టులు వాటిని సోషల్ మీడియాలోకి వదులుతున్నారని, అక్కడ అద్భుతంగా పేలుతున్నాయని ప్రస్తావించారు. ఇక్కడ ఎడిటర్లు కార్టూన్లు తిరస్కరించారంటే బాగా లేవని కాదని, కొన్ని పరిస్థితుల వల్ల అలా చేయాల్సి వస్తున్నదని అన్నారు. ఆంక్షలు, కట్టుబాట్లు ఉన్నప్పటికీ నెట్‌లో కార్టూన్లు హల్‌చల్ చేస్తున్నాయని, ఇది మంచి పరిణామమని అన్నారు. కార్టూనిస్టులు సమాజాన్ని చక్కదిద్దేలా గీతల ద్వారా సందేశాన్ని, విమర్శను, వ్యంగాన్ని జోడిస్తూ కార్టూన్‌లు వేయాలని ఆకాంక్షించారు.

స్వేచ్ఛగా కార్టూన్లు వేసే అవకాశముండటం నా అదృష్టం : నర్సిం

నవతెలంగాణ సమగ్ర తెలుగు దినపత్రిక కార్టూనిస్టు నర్సిం మాట్లాడుతూ స్వేచ్ఛగా కార్టూన్లు వేసే అవకాశం దక్కటం తన అదృష్టమన్నారు. తెలుగులో ఫస్టుపేజీలో ప్రాధాన్యతగా కార్టూన్లను ప్రచురిస్తూ నవతెలంగాణ పత్రిక పునర్జీవనం పోస్తున్నదని, మిగతా పత్రికల యాజమాన్యాలు కూడా అలా చేస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు. నవతెలంగాణలో ఎడిటోరియల్స్ ప్రాధాన్యతను కార్టూన్లకు కల్పించడం గొప్ప పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్ర కళాకారుడు ఏలె లక్ష్మణ్, కార్టూనిస్టులు మృత్యుంజయం(నమస్తే తెలంగాణ), జె. వెంకటేశ్వర్లు(వెలుగు), సముద్రాల సురేంద్ర(మనం), ఫ్రీలాన్స్ కార్టూనిస్టులు శ్రీచంద్ర, చిత్ర, ప్రభాకర్, నవతెలంగాణ ఆర్టిస్టు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మనస్సులను నొప్పించకుండా గీయటం కష్టం : శ్రీనివాస్‌రెడ్డి



తెలంగాణ టుడే ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనస్సులను నొప్పించకుండా చెప్పాల్సిన భావాన్ని వ్యంగ్యంగా చిత్రీకరించటం కత్తిమీద సాములాంటిదన్నారు. రాజకీయ పరిణామాల మీద ఒక చిత్రాన్ని గీసి దానికో అద్భుత వ్యాఖ్యను జోడించి ఓ కార్టూనిస్టు ఇటు సబ్ ఎడిటర్, అటు ఫొటోగ్రాఫర్ విధుల్ని నిర్వర్తిస్తారని ప్రశంసించారు.

నర్సింకు అవార్డు రావటం అభినందనీయం : ఎస్.వీరయ్య



నవతెలంగాణ సమగ్ర తెలుగు దినపత్రిక ఎడిటర్ ఎస్.వీరయ్య మాట్లాడుతూ నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన నర్సిం కార్టూన్‌కు జాతీయ ఉత్తమ కార్టూన్ అవార్డు-2018 రావటం గర్వకారణంగా ఉందన్నారు. సమాజ రుగ్మతలపై మీడియా ప్రశ్నిస్తే తట్టుకోలేని స్థితిలో పాలకులు ఉన్నారన్నారు. ఫోర్త్ ఫిల్లర్‌గా భావించే మీడియాలో కార్టూనిస్టులకు, జర్నలిస్టులకు నేడు స్వేచ్ఛ కరువైపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా కార్పొరేటీకరణ పెరిగిన తర్వాత ఈ ధోరణి విస్తృతమైందన్నారు. చివరకు సోషల్ మీడియాపైన ఆంక్షలు విధించడం, పర్సనల్ కంప్యూటర్‌పైనా నిఘా పెట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఇంకోవైపు కార్పొరేట్ల, పాలకుల భజన చేస్తే తప్ప పత్రికలు మనుగడ సాధించలేని దుస్థితి నేడు నెలకొందన్నారు. నిర్బంధం పెరిగే కొద్దీ పాత్రికేయుల రాతలకు, కార్టూనిస్టుల గీతలకు ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. రాచరికాలు, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా మీడియా పుట్టిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎప్పుడైతే ప్రశ్నించేతత్వాన్ని అడ్డుకోవటం మొదలు పెడితే ప్రజలు చైతన్యవంతులై పోరుబాట పడతారన్న విషయాన్ని పాలకులు గ్రహించాలని సూచించారు.

యుద్ధానికి సిద్ధంగా ఉండాలి

సైన్యానికి చైనా అధ్యక్షుడు పిలుపు!

- తైవాన్ చైనాలోనే అంతర్భాగమే : జిన్‌పింగ్

బీజింగ్: చైనా సైనికులు యుద్ధానికి సిద్ధంగా ఉండాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. తైవాన్ చైనాలో అంతర్భాగమేనని పునరుద్ఘాటించారు. అధ్యక్ష కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో జిన్‌పింగ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అమెరికా, చైనా మధ్య దక్షిణ చైనా సముద్రం విషయంలో వివాదం నెలకున్న నేపథ్యంలో జింగ్‌పింగ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

గత కొంత కాలంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆర్మీ అధికారులతో జరిగిన సమావేశంలో అమెరికా నుంచి ముప్పు పొంచి ఉందన్న అభిప్రాయాన్ని జిన్‌పింగ్ వ్యక్తం చేసినట్టు చైనా స్టేట్ మీడియా జిన్హువా ప్రకటించింది. భవిష్యత్తులో అనేక సవాల్ ఎదురయ్యే అవకాశం ఉందని, వీటిని ఎదుర్కొడానికి సైన్యం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర మిలిటరీ కమిషన్‌కు చైర్మెన్‌గానూ వ్యవహరిస్తోన్న



జిన్‌పింగ్.. సైన్యం ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలతో ముందుకు సాగాలని కోరారు. గత శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనివిధంగా ప్రపంచం అనూహ్య మార్పులను ఎదుర్కొంటోందని, ఇలాంటి తరుణంలో అభివృద్ధికి వ్యూహాత్మక అవకాశాన్ని చైనా ఇప్పటికీ కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు.

అత్యవసర పరిస్థితులు ఎదురైనట్టయితే దీన్ని సమర్థంగా తిప్పికొట్టేలా సైన్యం సన్నద్ధం కావాలని, తమ శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని జిన్‌పింగ్ సలహా ఇచ్చారు. తైవాన్ అంశంపై జింగ్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేసిన రెండు రోజుల అనంతరం ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించడం విశేషం. తైవాన్ కూడా చైనాలో అంతర్భాగమేనని, అది కచ్చితంగా తమలో కలిసి తీరుతుందని అన్నారు. తైవాన్‌ను చైనాపై ఎగదోసేందుకు అమెరికా కుట్ర పన్నిందన్నారు.

ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. యుద్ధవాతావరణం సృష్టించాలని తైవాన్ ప్రయత్నించినట్టయితే బలగాలను ఉపయోగించేందుకు వెనకాడబోమంటూ జిన్‌పింగ్ హెచ్చరించారు. దక్షిణ చైనా సముద్ర జలాల భద్రత కోసం ఆసియా రీఎష్యూరెన్స్ ఇనీషియేటివ్ చట్టానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపిన నాలుగు రోజుల్లోనే చైనా అధినేత ఇలాంటి హెచ్చరికలు చేయడం గమనార్హం.

హిజాబ్, తలపాగాలతో ప్రతినిధుల సభకు...



- 181ఏండ్ల నిబంధన రద్దుకు కాంగ్రెస్ సభ్యుల ఆమోదం

వాషింగ్టన్ : అమెరికా ప్రతినిధుల సభ 181 ఏండ్ల నిబంధనను తిరగరాస్తూ కొత్త చరిత్రను లిఖించింది. మత సంప్రదాయాలకు విలువనిస్తూ వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు తమ ఆచారం ప్రకారం తలపాగా (హిజాబ్, టర్బన్) ధరించి సభకు హాజరయ్యేలా రూపొందించిన బిల్లుకు గురువారం ఆమోదం తెలిపింది. హౌజ్‌కు తొలిసారిగా ఎన్నికైన తొలి ముస్లిం మహిళలుగా సరికొత్త రికార్డు సృష్టించిన రషీదా త్లాయిబ్, ఇల్హాన్ ఒమర్‌లు ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఈ బిల్లు ఆమోదం పొందడం విశేషం. 'హెడ్‌గేర్ ధరించడంపై 181 ఏండ్లుగా ఉన్న నిషేధాన్ని 116వ కాంగ్రెస్ సభ్యులు ఎత్తివేశారు. సభకు సాదర స్వాగతం పలికిన నా సహచరులకు ధన్యవాదాలు. అమెరికాలో పలు దేశాలకు చెందిన ముస్లిం వలసదారులను నిషేదించాలని దేశాధ్యక్షుడు జారీ చేసిన ఆదేశాలను కూడా ఉపసంహరించుకునే రోజు కోసం ఎదురుచూస్తున్నా' అని ఇల్హాన్ ఒమర్ ట్విటర్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. గతేడాది నవంబరులో జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 100 మంది మహిళలు దిగువ సభకు ఎన్నికై చరిత్ర సృష్టించారు. వీరిలో 28 మంది తొలిసారిగా ఈ సభలో అడుగుపెట్టబోతున్నారు. వీరంతా డెమోక్రటిక్ పార్టీకి చెందిన వారే కావడం విశేషం. ఇక ప్రతినిధుల సభకు ఎన్నికైన తొలి ముస్లిం మహిళలుగా రషీదా త్లాయిబా, సోమాలియాకు చెందిన ఇల్హాన్ ఒమర్‌లు గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

జర్మనీ నేతల వ్యక్తిగత సమాచారం హ్యాక్

బెర్లిన్: జర్మనీ కీలక నేతల వ్యక్తిగత సమాచారం హ్యాకింగ్‌కు గురైంది. జర్మనీ ఛాన్సెలర్ ఏంజెలా మెర్కెల్ సహా పలువురు ప్రభుత్వాధికారులే లక్ష్యంగా కొందరు అగంతకులు డేటా లీక్ చేశారు. వందలాది జర్మన్ రాజకీయనేతలు, మెర్కెల్‌కి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించిన దుండగులు ఆన్‌లైన్ పెట్టినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆన్‌లైన్‌లో పెట్టిన సమాచారంలో నివాసాల చిరునామాలు, వ్యక్తిగత మొబైల్ ఫోన్ నెంబర్లు, లేఖలు, గుర్తింపు పత్రాల కాపీలు, ఇన్వాయిస్ లు ఉన్నాయి. వీటిని డిసెంబర్ లోనే ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కానీ గత వారమే ఈ డేటా లీకేజీ వ్యవహారం వెలుగు చూసింది. అయితే హ్యాకర్లు అధికారులను టార్గెట్ చేశారా లేదా వారు అంతర్గత లీక్ బాధితులా తెలియాల్సి ఉంది. 'ఛాన్సెలర్ మెర్కెల్ సహా వందలాది రాజకీయ నేతలు, ప్రముఖుల వ్యక్తిగత సమాచారం, పత్రాలను ఇంటర్నెట్ లో పెట్టారని' ప్రభుత్వ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని, ఆగంతకులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. బాధితులలో పార్లమెంట్ దిగువ సభ.. బుండెస్టాగ్ సభ్యులు, యూరోపియన్ పార్లమెంట్ సభ్యులు, స్థానిక, ప్రాంతీయ అసెంబ్లీల సభ్యులు కూడా ఉన్నట్టు చెప్పారు. బుండెస్టాగ్ అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్ స్టీన్మీర్ సహా సభలో అన్ని పార్టీల నాయకుల డేటా లీకైంది. మెర్కెల్ కార్యాలయం నుంచి ఎలాంటి సున్నితమైన సమాచారం, వివరాలు లీక్ కాలేదని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ సంఘటన జర్మనీ రాజకీయ వర్గాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశ ప్రజాస్వామ్యంపై, సంస్థలపై ఉన్న నమ్మకాన్ని దెబ్బ తీసేందుకే కొందరు ఈ చర్యకు పాల్పడ్డారని న్యాయశాఖ మంత్రి కెటరీనా బార్లే అన్నారు. రాజకీయ నేతలతో పాటు పలువురు సెలబ్రిటీలు, జర్నలిస్టుల వ్యక్తిగత సమాచారాన్ని కూడా ఈ లీక్ బట్టబయలు చేసింది. ఎప్పుడు ఈ డేటా చౌర్యం ప్రారంభమైందో తెలియదు కానీ అక్టోబర్ చివరి వరకు కొనసాగిందని బిల్డ్ వార్తాపత్రిక పేర్కొంది. రాజకీయంగా సున్నితమైన అంశాలేవీ దొంగిలించనట్టు తోస్తున్నప్పటికీ పబ్లిష్ చేసిన వ్యక్తిగత డేటా పరిమాణాన్ని చూస్తుంటే ఇదేదో భారీ దెబ్బ తీయనున్నట్టు కనిపిస్తోందని ఆర్బీబీ అనుమానం వ్యక్తం చేసింది. పలు మార్గాలలో ఈ డేటా చౌర్యం జరిగినట్టు తెలిపింది. ఈ సైబర్ దాడి గురించి పార్లమెంటరీ గ్రూప్ నేతలకు గురువారం అర్ధరాత్రి తెలియజేశారు. ఫెడరల్ ఆఫీస్ ఫర్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, దేశీయ నిఘా సంస్థలు దర్యాప్తును ప్రారంభించాయి.

షట్‌డౌన్‌పై వెనక్కి తగ్గం : ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో షట్‌డౌన్ నెలల పాటు లేదా సంవత్సరాలైనా కొనసాగొచ్చని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. రిపబ్లికన్ పార్టీ నేతలతో సమావేశమైన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. యూఎస్ కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించేందుకు తనకు జాతీయ అత్యవసర పరిస్థితి విధించే అధికారం ఉందని అన్నారు. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మించడానికి నిధులు కేటాయించాలని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా, డెమోక్రాట్లు అందుకు ఒప్పుకోకపోవడంతో ద్రవ్య వినిమయ బిల్లు పెండింగ్‌లో పడిన సంగతి తెలిసిందే. అమెరికాలో గతేడాది డిసెంబర్ 22 నుంచి షట్‌డౌన్ కొనసాగుతోంది. పాలన స్తంభించడంతో దాదాపు 8లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు వేతనాలు లేకుండా పనిచేయాల్సి వస్తోంది. మెక్సికో సరిహద్దు వద్ద గోడ నిర్మాణం కోసం సుమారు 5.6 బిలియన్ల డాలర్లు కేటాయించాలని ట్రంప్ పట్టుపట్టారు. ట్రంప్ నిర్ణయం పట్ల సొంత పార్టీ నేతల్లోనూ తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత నెలకొంది. అయితే, చాలా మంది ఉద్యోగులు షట్‌డౌన్‌కు సహకరిస్తున్నారని ట్రంప్ చెప్తున్నారు. సరిహద్దులో రక్షణ గోడ తమకు ఎంతో అవసరమని వారు భావిస్తున్నారని ట్రంప్ వెల్లడించారు. తానేమీ క్రీడల గురించి మాట్లాడడం లేదని, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని అన్నారు. మాజీ అధ్యక్షులెవరూ మెక్సికో-అమెరికా సరిహద్దులో గోడ నిర్మాణంపై దృష్టిపెట్టలేదని అన్నారు. ఈ గోడ నిర్మాణం చేపట్టినట్టయితేనే దేశ భద్రత సాధ్యమవుతుందన్నారు. షట్‌డౌన్‌కు ఇప్పట్లో ముగింపు లభించే అవకాశంలేదని అన్నారు.



విదేశీ విద్యార్థుల భద్రతకు భరోసా...

అమెరికాలోని ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులంతా ఇక్కడి కంపెనీల అభివృద్ధికి దోహదపడాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. వలస విధానాల కారణంగా తాము ప్రతిభావంతులను కోల్పోతున్నామని అన్నారు. చట్టబద్ధమైన వలస విధానాల్లో ఉన్న లొసుగులను అంతం చేయాలని.. ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ప్రజలు చట్టబద్ధంగా, ప్రతిభ ఆధారంగా అమెరికాకు వలస రావాలని తన యంత్రాంగం భావిస్తోందని చెప్పారు. 'నాకు గొప్ప గొప్ప టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దేశంలోని మంచి విద్యా సంస్థలలో చదువుకున్న వారిని ఇక్కడ ఉంచలేక పోతున్నాం అని చెపుతున్నారు. వేలాది మంది విదేశీ విద్యార్థులు చైనా, జపాన్, తదితర దేశాలకు వెళ్లిపోతున్నారు. వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నాం. వాళ్లు ఇక్కడి అత్యుత్తమమైన విద్యా సంస్థల్లో చదువుతున్నారు. వివిధ కారణాల వల్ల వారికి ఇక్కడ ఉండే అవకాశం లభించడం లేదు. దీంతో గొప్ప ప్రతిభావంతులను కోల్పో తున్నాం' అని ట్రంప్ అన్నారు. విదేశీ విద్యార్థులు చదువు పూర్తయిన అనంతరం అమెరికాలో ఉండి ఉద్యోగం చేసుకునే విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఈ విషయంపై డెమోక్రటిక్ పార్టీ నేతలతో చర్చించినట్టు తెలిపారు. గొప్ప కంపెనీలను, ప్రతిభావంతులను వదులుకోమని అన్నారు. ఆశ్రయం కావాలని



కోరుకునే వారికి చట్టబద్ధమైన విధానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఇటీవల కాలిఫోర్నియాలో భారత సంతతికి చెందిన పోలీసు అధికారిని అక్రమ వలసదారుడు కాల్చి చంపడంపై స్పందించిన ట్రంప్.. అమెరికన్లను సురక్షితంగా ఉంచేందుకు సరిహద్దులు మరింత భద్రంగా ఉండాలని వెల్లడించారు. అమెరికాలో భద్రత కట్టుదిట్టం చేస్తామని, విదేశీ విద్యార్థుల రక్షణకు తోడ్పడతామని అన్నారు.

జపాన్ 'టునా' చేప ఖరీదు 21కోట్లు ..!



టోక్యో: చేప ధర ఎంత ఉంటుంది. రకాన్ని బట్టి కిలో రూ. 200 నుంచి ఐదారు వందలు పలుకు తుంది. ఇక గోదావరి నదిలో దొరికే పులస చేప కాస్త ఎక్కువే. కిలో రూ.10వేల దాకా ఉంటుంది. కానీ జపాన్‌లోని ఓ చేప ధర రూ. వేలు, లక్షలు కాదు.. ఏకంగా రూ. 21కోట్లు పలికింది. సముద్ర చేపల్లో అత్యంత రుచిరకంగా ఉండే చేపగా టునా చేప ఖ్యాతి పొందింది. అందుకే దీని ధర కూడా భారీగానే ఉంటుంది. అయితే ఈ చేపలు తక్కువ సంఖ్యలో లభ్యమవుతుంటాయి. దీంతో వీటిని వేలం వేస్తారు. టోక్యోలోని ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సుకిజీ చేపల మార్కెట్లో ఏటా నూతన సంవత్సరం సందర్భంగా పెద్ద ఎత్తున టునా చేపల వేలం కార్యక్రమం జరుగుతుంది. గతేడాది ఈ చేపల మార్కెట్‌ను సుకిజీ నుంచి టొయోసుకు మార్చారు. ఈ ఏడాది టొయోసు మార్కెట్లో జరిగిన వేలంలో 278 కిలోల భారీ బ్లూఫిన్ టునా చేప ఏకంగా రూ. 21కోట్లు పలికింది.టునా చేపలను విరివిగా కొనుగోలు చేసే స్థానిక సుషీ రెస్టారెంట్ల యజమాని కియోషీ కిమురానే ఈ సారి కూడా బ్లూఫిన్ టునాను దక్కించుకున్నారు. తాజాగా జరిగిన వేలంలో ఈ చేపను 333.6 మిలియన్ యన్‌లకు(భారత కరెన్సీలో దాదాపు రూ. 21కోట్లు) కిమురా కొనుగోలు చేశారు. అంత క్రితం 2013లో జరిగిన వేలంలోనూ కిమురా 155 మిలియన్ యన్‌లను(భారత కరెన్సీలో దాదాపు రూ. 9కోట్లు) చెల్లించి టునా చేపను దక్కించుకున్నారు. తాజాగా అంతకు రెట్టింపు ధర పలికింది. టునా చేపకు జపాన్‌లో మంచి గిరాకీ ఉంటుంది. సుషీ రెస్టారెంట్లలో ఈ చేప ఓ ముక్క ధర రూ. వేలల్లో ఉంటుంది. ఈ సారి ధర కాస్త ఎక్కువైనప్పటికీ కస్టమర్ల నుంచి అంతే స్థాయిలో డిమాండ్ ఉంటుందని కిమురా విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

40 లక్షల మందికి చేరువైన షీటీమ్

1655 ఎఫ్ఐఆర్‌లు,320 నిర్భయ కేసులు



మహిళలు, మైనర్ల పట్ల అసభ్యకర ప్రవర్తనలు 26 నుంచి 12 శాతానికి..

మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయండి: షీటీమ్స్ ఐజీ స్వాతి లక్రా




(ఫైల్)

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మహిళల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మూడేండ్ల క్రితం పోలీసుశాఖలో ఏర్పాటు చేసిన షీ టీమ్స్ మంచి ఫలితాలను రాబట్టడమే గాక మహిళల్లో భరోసాను పెంచిందని షీ టీమ్స్ విభాగం తో పాటు రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఐజీ అయిన స్వాతి లక్రా తెలిపారు. మహిళలను వేధించడం, టీజింగ్ చేయడం మొదలుకుని ఫేస్‌బుక్‌ల ద్వారా అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యల వరకు మహిళలపై సాగుతున్న అరాచకాలను అరికట్టడంలో షీటీమ్స్ నిర్విరామంగా కృషి చేస్తున్నాయని ఆమె తెలిపారు. ముఖ్యంగా మైనర్ బాలికలు మొదలుకుని మహిళలు, కాలేజీ విద్యార్థినులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి వాటిని అరికట్టడానికి తాము తీసుకున్న చర్యలు ఫలితాలను ఇచ్చాయని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అసభ్యకర ప్రవర్తనలు, వేధింపులు, ఈవ్‌టీజింగ్ మొదలుకుని ఆన్‌లైన్ ద్వారా జరిగే వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ గురించి 40లక్షల 12వేల మందిని చైతన్య పర్చామని, తద్వారా వారు ఇటువంటి ఘటనలు ఎదురైతే ధైర్యంగా ఎలా ఎదుర్కొవాలో మార్గదర్శనం చేయగలిగామని స్వాతి లక్రా వివరించారు. మహిళలు, విద్యార్థినులు ఎక్కువగా వేధింపులు, టీజింగ్‌లకు గురయ్యే ప్రాంతాలు, బస్సు స్టాప్‌లు, మార్గాలను గుర్తించి అక్కడ షీటీమ్‌లు ప్రత్యేక ఆపరేషన్‌లను నిర్వహించడం ద్వారా వేల మందికి బుద్ధి చెప్పగలిగాయని అన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలను కూడా తీసుకున్నామని ఆమె చెప్పారు. 2018-19 లో ఇప్పటి వరకు మహిళలపై వేధింపులకు పాల్పడ్డ వారికి సంబంధించి 1655 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశామని, ఇందులో 320 వరకు నిర్భయ కేసులు నమోదు చేశామని ఆమె వివరించారు.

వార్నింగ్‌తో వదిలిపెట్టం..

ఐటీ చట్టం క్రింద 73 కేసులు, పోక్సో చట్టం కింద 104 కేసులను నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. అలాగే 3076 పెటీ కేసులను నమోదు చేసి నిందితులకు జరిమానా పడేలా చూశామని, 10646 మందికి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించకుండా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. మరో 4008 మందికి మరోసారి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించకుండా వార్నింగ్ ఇచ్చి బైండోవర్ చేశామని తెలిపారు. ఎక్కువగా విద్యార్థినులు , యువతులు, మహిళా ఉద్యోగులు వేధింపులకు గురవుతున్న



కాలేజీలు, స్కూళ్లు, ప్రభుత్వ , ప్రయివేటు కార్యాలయాలకు సంబంధించి 7354 మార్లు కౌన్సిలింగ్‌లు, అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లను నిర్వహించామని తద్వారా లక్షల మందిని చైతన్య పరిచగలిగామని స్వాతి లక్రా వివరించారు. రాష్ట్రంలో మరిన్ని షీ టీమ్‌లను ఏర్పాటు చేసి వాటిని మరింతగా పటిష్టం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో తమకు ఎక్కడైనా వేధింపులు, అసభ్యకర ప్రవర్తనలు ఎదురైతే వెంటనే షీటీమ్‌లను సంప్రదించాలని ఆమె ప్రజలను కోరారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత



నవతెలంగాణ - మద్దూరు

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని అర్జున్‌పట్లలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన శేర్ల వెంకటయ్య రోజూలాగే కొట్టంలో గొర్రెలను తోలాడు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఊరకుక్కలు మందపై దాడి చేశాయి. దీంతో 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తీవ్రం నష్టం జరిగిందని వెంకటయ్య బోరున విలపించాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



8వ ప్యాకేజీ పనులను మార్చిలోగా పూర్తి చేయాలి

- సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్

నవతెలంగాణ-రామడుగు


కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో మెగా కంపెనీ నిర్మిస్తున్న 8వ ప్యాకేజీ పనులను మార్చిలోగా పూర్తి చేయాలని సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె 8వ ప్యాకేజీ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిగిలిన పనులను మార్చి చివరి వరకు పూర్తిచేసి, వచ్చే ఖరీఫ్‌కు రైతులకు సాగు నీరందించాలన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, దేవసేన, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఏఈ నూనె శ్రీధర్, సీఈ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగర్ నీళ్లివ్వాలని రైతుల ఆందోళన

- ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట బైటాయింపు

నవతెలంగాణ-ఖమ్మంటౌన్

ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ రెండో జోన్‌కు నీటి విడుదల సాధ్యం కాదని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తేల్చి చెప్పడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. శనివారం చింతకాని, కొణిజర్ల మండలాల రైతులు ఖమ్మం చేరుకుని తొలుత ఖమ్మం నగర ప్రవేశ ద్వారమైన శ్రీ శ్రీ సర్కిల్‌లో ఫ్లెక్సీలు చేతబట్టుకుని ఆందోళన చేశారు. వేసిన మొక్కజొన్న, మినుము, వేరుశనగ, పెసర పంటకు నీళ్లిచ్చి బతికించాలని నినాదాలు చేశారు. ట్రాఫిక్ పోలీసులు వారిని చెదరగొట్టారు. అనంతరం ఖమ్మంలోని ఎన్నెస్పీ ఎస్ఈ కార్యాలయానికి చేరుకున్న రైతులు ధర్నా నిర్వహించారు. కార్యా లయం ఎదుట బైటాయించి సాగర్ రెండో జోన్‌కు నీళ్లివ్వాలని నినాదాలు చేశారు. పంటలు వేయకముందు సమాచారం ఇవ్వకుండా తీరా పంటలు వేసిన తర్వాత నీళు రావని చెప్పడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వేసిన పంటలకు నీళ్లిచ్చి బతికించాలని డిమాండ్ చేశారు.



'వినయ విధేయ రామ'లో రామ్‌చరణ్

నవచిత్రం

నయా కాంబినేషన్‌లో కొత్త సినిమా..!



మహేష్‌బాబు, కత్రినా కైఫ్, సుకుమార్

మహేష్‌బాబు, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన నవ్య కథా చిత్రం 'వన్ నేనొక్కడినే'. ప్రయోగాత్మకంగా రూపొందిన ఈ సినిమా క్రిటికల్‌గా మెప్పు పొందినప్పటికీ కమర్షియల్‌గా ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయింది. ఇటీవల 'రంగస్థలం'తో ఇండ్రస్టీ హిట్‌ని అందించిన సుకుమార్ దర్శకత్వంలో మరోసారి మహేష్ ఓ సినిమా చేయబోతున్న విషయం విదితమే. మహేష్ నటించబోతున్న 26వ చిత్రమిది. మే నుంచి రెగ్యులర్ షూటింగ్‌ని జరుపుకోనుందట. జూన్ నుంచి మహేష్ చిత్రీకరణలో పాల్గొనే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. నవ్యమైన కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కించేందుకు సుకుమార్ ప్లాన్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కబోయే ఈ సినిమాలో కథానాయిక ఎవరనేది ఇంకా ఫైనల్ కాలేదు. గతంలో రకుల్ ప్రీత్ సింగ్‌ని ఎంపిక చేసినట్టు వార్తలు వినిపించాయి. తాజాగా బాలీవుడ్ హీరోయిన్ కత్రినా కైఫ్ పేరు వినిపిస్తోంది. ఆమెని తీసుకోవడం వల్ల బిజినెస్ పరంగానూ హెల్ప్ అవుతుందని చిత్ర బృందం భావిస్తుందట. ఇప్పటికే కత్రినా తెలుగులో 'మల్లీశ్వరీ', 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించి మెప్పించిన విషయం విదితమే. గతంలో బిపాస బసు, అమృతరావు, ప్రీతి జింటా లాంటి బాలీవుడ్ హీరోయిన్లతో మహేష్ కలిసి నటించాడు. మరో సారి బాలీవుడ్ హీరోయిన్‌తో జోడీ కట్టి తెరపై మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు టాక్. ప్రస్తుతం ఆయన వంశీపైడిపల్లి దర్శకత్వంలో 'మహర్షి' చిత్రంలో నటిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సినిమా ఏప్రిల్ 5న విడుదల కానుంది.

మరో సంచలనం కోసం..!



ఎన్టీఆర్

ఎన్టీఆర్ ఇటీవల పంథా మార్చి విభిన్న కథా చిత్రాల్లో నటిస్తున్నారు. 'టెంపర్' నుంచి 'అరవింద సమేత' వరకు దేనికదే డిఫరెంట్ కథా చిత్రాలను చేసి విజయాలను అందుకున్నారు. అదే కొత్తదనాన్ని కొనసాగిస్తూ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మల్టీస్టారర్ 'ఆర్ఆర్ఆర్' చిత్రంలో నటిస్తు న్నారు. తర్వాతి చిత్రం 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటించేం దుకు సిద్ధమవు తున్నారట. మొదట మహేష్ బాబు హీరోగా సందీప్‌రెడ్డి వంగా సినిమా చేయబోతున్నాడనే వార్తలు వినిపించాయి. కానీ ఇప్పుడు ఎన్టీఆర్‌కి ఓ కథ చెప్పారట. స్క్రిప్ట్ బాగా నచ్చడంతో ఎన్టీఆర్ ఓకే చెప్పినట్టు తెలుస్తుంది. విజయ్ దేవరకొండ హీరోగా రూపొందిన 'అర్జున్‌రెడ్డి' సంచలన విజయం సాధించింది. మరి ఇప్పుడు ఎన్టీఆర్‌తో మరో సంచలనాత్మక సినిమా తీసే అవకాశం ఉన్నట్టు చిత్ర వర్గాలు అనుకుంటున్నాయి. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్‌లో 'కబీర్ సింగ్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, కైరా అద్వానీ జంటగా నటిస్తున్నారు. ఎన్టీఆర్ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ 'ఆర్ ఆర్ ఆర్' ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అయితే ఈ చిత్ర కథేంటనేది అన్ని వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగుతుందని వినిపించింది. అయితే ఇది పీరియాడికల్‌గా సాగుతుందట. ఎన్టీఆర్ డాన్ తరహా నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో కనిపిస్తారని తెలుస్తుంది. ఇందులో కథానాయికలుగా రష్మిక మందన్నా, కీర్తిసురేష్‌తోపాటు మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. త్వరలోనే హీరోయిన్లకు సంబంధించి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా 2020లో విడుదల కానుంది. ఆ తర్వాతే సందీప్ రెడ్డి వంగా సినిమా ఉంటుందని సమాచారం.

సస్పెన్స్ కామెడీ ఎం6



ధ్రువ, వి.వి.వినాయక్, విశ్వనాథ్ తన్నీరు

ధ్రువ హీరోగా జైరాం దర్శకత్వంలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'ఎం6'. అశ్విని కథానాయిక. ఈ చిత్ర ట్రైలర్‌ని ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర బృందాన్ని అభినందించారు. నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ, 'మా చిత్ర ట్రైలర్‌ని విడుదల చేసిన వినాయక్‌కి ధన్యవాదాలు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. ఖర్చుకి వెనకాడకుండా రాజీపడకుండా నిర్మించాం. దర్శకుడు జైరాం అత్యద్భుతంగా తెరకెక్కించారు. హీరో ధ్రువ కొత్తవాడైనా చక్కటి నటనను ప్రదర్శించాడు. హీరోయిన్‌కిది తొలి సినిమా అయినా బాగా నటించింది. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. సినిమాటోగ్రఫీ, సంగీతం, సస్పెన్స్, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు సినిమాకి హైలైట్‌గా నిలుస్తాయి. ప్రేక్షకులు సినిమాలోని ప్రతి సీన్‌ని ఎంతో ఎంజాయ్ చేస్తూ చూస్తారు. ఎక్కడా బోర్ ఫీలవ్వకుండా ఉత్కంఠని కలిగించేలా ఈ సినిమాను రూపొందించాం. దీనికి 'ఎం6' అనే టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుంది. 'ఈ క్షణం' అనే పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది. దీన్ని మంగుళూరు, అరకులో చిత్రీకరించాం. పాటకు మంచి స్పందన లభించింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను త్వరలోనే విడుదల చేస్తాం' అని అన్నారు. 'హీరోగా నాకిది తొలి చిత్రం. అందర్నీ అలరించే విభిన్నమైన పాత్రలు పోషించి ఇండస్ట్రీలో నటుడిగా నాకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవాలన్నది నా చిరకాల కోరిక. నిర్మాత విశ్వనాథ్ తన్నీరు, దర్శకుడు ఇచ్చిన ప్రోత్సాహంతో ఇబ్బంది పడకుండా నటించగలిగాను. సినిమాలో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే అంశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక మంచి సినిమా ద్వారా హీరోగా పరిచయమవుతున్నందుకు హ్యాపీగా ఉంది. నన్ను, ఈ సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని హీరో తెలిపారు. తిలక్, సాధన, అప్పలరాజు, హరిత, వంశీ, ఇంద్రతేజ నటించిన ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ.

కాజల్



ఇంకెన్నాళ్లు ఈ అవమానాలు..!

చేదు అనుభవాలు ప్రతి ఒక్కరికి ఏదో సందర్భంలో ఎదురవుతుంటాయి. సినీ నటులకు కూడా అవి అతీతం కాదు. అందులో భాగంగా హీరోయిన్ కాజల్ కూడా ఓ చేదు అనుభవాన్ని ఎదుర్కొందట. ముంబయి విమానాశ్రయంలో తాను చాలా అవమానం ఎదుర్కొన్నానని తెలిపింది. ఈ విషయాన్ని ట్విట్టర్‌లో పేర్కొంటూ, 'ఇటీవల ముంబయి విమానాశ్రయానికి వెళ్ళగా, అక్కడ ఓ కౌంటర్‌లో ఓ మహిళా నన్ను బాగా విసిగించింది. నేను విమానం బయలుదేరేందుకు 75 నిమిషాల ముందు విమానాశ్రయానికి వెళ్ళినా అనవసర ప్రశ్నలతో అవమానపరిచే విధంగా ప్రవర్తించింది. గంట సమయం ఉన్నా, విమానంలోకి వెళ్లే దారిని మూసేశారు. విమానంలోకి వెళ్ళడానికి అరగంట పట్టేంత దూరంలో నన్ను నిలిపివేశారు. ఇలా పలు అవమానాలు, కష్టాలను ఎదుర్కొన్నా. ఇంకేన్నాళ్లీ అవమానాలు. ఈ విషయంపై విమానాశ్రయ అధికారులకు తెలియజేయగా, వారు ఏకాంతంగా మాట్లాడటానికి రమ్మన్నారు. దీంతో వారితో మాట్లాడటం ఇష్టంలేక వెళ్ళిపోయా' అని తెలిపింది. ప్రస్తుతం కాజల్ తమిళంలో 'పారిస్ పారిస్', 'కొమలి' చిత్రాల్లో నటిస్తుంది. తెలుగులో తేజ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన నటిస్తోంది. ఈ సినిమాకు 'సీత' అనే టైటిల్ వినిపిస్తోంది. కాజల్ పాత్ర ప్రధానంగా సినిమా సాగుతుందని, అందుకే 'సీత' అనే పేరును ఖరారు చేసే ఆలోచనలో తేజ ఉన్నట్టు సమాచారం.

హార్ట్ బ్రేక్ అయ్యిందంటున్న మజ్ను



'మిస్టర్ మజ్ను'లో అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. 'తొలి ప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుంది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమాలోని మరో పాటని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెల 25న విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో పలుకు మరచినట్టు పెదవికేమైనదో..' అనే టైటిల్ సాంగ్ శ్రోతలని అలరిస్తోంది. నేడు(ఆదివారం) ఈ సినిమాలోని 'హార్ట్ బ్రేక్..' పాటని సాయంత్రం 6గంటలకు విడుదల చేయబోతున్నాం. అన్ని వర్గాలను అలరించే చిత్రమవుతుంది. ఇందులో అఖిల్ లుక్, డాన్స్‌లు, యాక్షన్ విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆదరించాలని కోరుకుంటున్నాం' అని అన్నారు. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: థమన్.

వాళ్ళది చాలా గొప్ప మనసు..!



జ్యోతిక

'అజిత్, విజయ్‌కాంత్ గొప్ప మనసున్న వ్యక్తులు. వారు ఎంత సహాయం చేసినా బయటకు చెప్పుకోరు' అని అన్నారు జ్యోతిక. కథానాయికగా రీఎంట్రీ తర్వాత పలు మహిళా ప్రధానమైన చిత్రాల్లో నటిస్తూ మెప్పిస్తోంది జ్యోతిక. ఇటీవల తమిళంలో 'కాట్రిన్ మోజీ' చిత్రంలో నటించి ఆకట్టుకుంది. తాజాగా ఓ సహాయ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, 'ఇతరులకు హెల్ప్ చేయడమనేది గొప్ప లక్షణం. ఇతరుల సహకారం లేకుండా జీవించడం ఎవరికీ సాధ్యం కాదు. కానీ చిన్న చిన్న విషయాలకు మరో వ్యక్తి హెల్ప్ కోరడం సబబు కాదు. అదే సమయంలో మనకు సహకరించిన వారిని ఎప్పటికీ మర్చిపోకూడదు. కొందరైతే ఎంత సాయం చేసినా బయటకు చెప్పుకోరు. అది వాళ్ళ సహజత్వం. నటులు విజయ్ కాంత్, అజిత్‌లు కూడా అంతే. ఎంత మందికి హెల్ప్ చేసినా ఎప్పుడూ చెప్పుకునే అలవాటు లేదు. వారి మనసు చాలా గొప్పది. ఐదు రూపాయలు ఇచ్చిన ఐదువందల మందికి చెప్పుకునే వారి మధ్య ఇలాంటి వ్యక్తులుండటం గొప్ప విషయం' అని తెలిపింది. ప్రస్తుతం జ్యోతిక రెండు కొత్త చిత్రాలకు సైన్ చేసినట్టు తెలుస్తుంది.

నిర్మాతగా రైతు పోరాట కథ



సల్మాన్‌ఖాన్

సల్మాన్ హీరోగానే కాదు, పలు సినిమాలను నిర్మిస్తూ అభిరుచి గల నిర్మాతగా రాణిస్తున్నారు. తాజాగా ఆయన సతీష్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అంతేకాదు సల్మాన్ ఖాన్, దర్శకుడు సతీష్ కౌశిక్ కాంబినేషన్‌లో దాదాపు 16ఏండ్ల తర్వాత ఈ సినిమా వస్తుంది. గతంలో సతీష్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన 'తేరా నామ్' చిత్రంలో సల్మాన్ హీరోగా నటించారు. ఇది ఘన విజయం సాధించింది. 'కాగజ్' పేరుతో తాజా సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమా ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌కి చెందిన రైతు లాల్ బిహారీ జీవితం ఆధారంగా రూపొందిస్తున్నారు. బంధువులు, అధికారులు కుమ్మక్కై తను చనిపోయాడని తన భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. దీంతో విషయం తెలుసుకున్న లాల్ బిహారీ అవినీతి అధికారులకు వ్యతిరేకంగా ఫైట్ చేసి, తాను బతికే ఉన్నానని నిరూపించుకోవడమే కాదు, అధికారుల ఆగడాలు బయటపెట్టాడు. ఇందులో రైతు పాత్రలో పంకజ్ త్రిపాఠి నటిస్తున్నారు. దర్శకుడు సతీష్ దాదాపు నాలుగేండ్ల తర్వాత దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 2014లో ఆయన 'గ్యాంగ్ ఆఫ్ ఘోస్ట్స్' చిత్రాన్ని రూపొందించారు. సల్మాన్ ఇటీవల 'చిల్లర్ పార్టీ', 'డాక్టర్ క్యాబీ', 'బజరంగీ భాయిజాన్', 'హీరో', 'ట్యూబ్‌లైట్' చిత్రాలను నిర్మించారు. ప్రస్తుతం అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'భారత్' చిత్రాన్ని కూడా నిర్మిస్తున్నారు. ఇందులో కత్రినా కైఫ్, దిశా పటానీ కథానాయకలు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రంలో సల్మాన్ ఐదు విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారు.

రెండు భిన్న గెటప్స్ !

శర్వానంద్ ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఆయన నటించబోతున్న కొత్త చిత్రంలో భిన్న పాత్రల్లో నటించనున్నట్టు తెలుస్తుంది. ఇటీవల 'పడి పడి లేచే మనసు'తో ఆకట్టుకున్న శర్వానంద్ ప్రస్తుతం సుధీర్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇందులో ఆయన రెండు విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారట. ఓ పాత్రలో యువకుడిగా స్టయిలీష్‌గా కనిపిస్తారని, మరో పాత్రలో వయసు మళ్ళిన వ్యక్తిగా కనిపించనున్నారట. వయసైన పాత్ర కోసం ప్రోస్తటిక్ మేకప్‌తో లుక్ టెస్ట్ చేసి త్వరలోనే షూటింగ్‌ని ప్రారంభించేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తుంది. ఇందులో 'హలో' ఫేమ్ కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతుంది. త్వరలోనే చిత్ర ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసి, టైటిల్‌ని ప్రకటించనున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన 'పడి పడి లేచే మనసు' ఇటీవల విడుదలై పరాజయం చెందింది. ఇందులో శర్వానంద్ సరసన సాయిపల్లవి కథానాయికగా నటించిన విషయం విధితమే. ఆ తర్వాత తమిళ విజయవంతమైన సినిమా '96' రీమేక్‌లో శర్వా నటించనున్నట్టు సమాచారం.



శర్వానంద్


ఐదోసారి జోడీగా..!



అలియా భట్

అలియా భట్, వరుణ్‌ధావన్ జోడీకి బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. ఇప్పటికే వీరు 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్', 'బద్రినాథ్ కి దుల్హానియా', 'హంప్టీ శర్మ కి దుల్హానియా' చిత్రాలతో హ్యాట్రిక్ హిట్‌ని అందుకుని హిట్ పెయిర్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'కళంక్'లోనూ కలిసి నటిస్తున్నారు. దీంతోపాటు మరో సినిమాలో ఈ ఇద్దరు తెరపై మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారట. డేవిడ్ ధావన్ రూపొందించే తదుపరి సినిమాలోనూ అలియా, వరుణ్ హీరోహీరోయిన్లుగా ఎంపికైనట్టు తెలుస్తుంది. 1995లో డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వచ్చిన 'కూలీ నెం.1' చిత్రానికి రీమేక్‌గా ఈ సినిమాను రూపొందించబోతున్నట్టు సమాచారం. అయితే ముందుగా ఇందులో కథానాయికగా సారా అలీ ఖాన్ పేరు వినిపించినా, హిట్ పెయిర్ మ్యాజిక్‌ని రిపీట్ చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు అలియాని ఫైనల్ చేశారట. వీరు కలిసి నటించబోతున్న ఐదో చిత్రమిది. త్వరలోనే పట్టాలెక్కనున్నట్టు సమాచారం. ప్రస్తుతం వరుణ్ ధావన్ 'కళంక్'తోపాటు 'ఏబీసీడీ 3'లో నటించబోతున్నారు. అలియా భట్ 'గల్లీబాయ్', 'కళంక్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

నయా చిత్రంలో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్



అక్షయ్ కుమార్

యాక్షన్ కామెడీ చిత్రాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న హీరో అక్షయ్ కుమార్, దర్శకుడు రోహిత్ శెట్టి తొలి సారి కలవబోతున్నారు. త్వరలో వీరి కాంబినేషన్‌లో సినిమా రాబోతుంది. 'సూర్యవంశీ' పేరుతో రూపొందే ఈ చిత్రం ఏప్రిల్‌లో షూటింగ్ ప్రారంభం కానుందట. ఇందులో అక్షయ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌గా శక్తివంతమైన పాత్రలో అక్షయ్ నటించనున్నట్టు తెలుస్తుంది. రోహిత్ శెట్టి రూపొందించిన తాజా సినిమా 'సింబా' ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఇందులో అక్షయ్ కుమార్ గెస్ట్ పాత్రలో పోలీస్‌గా మెరిశారు. సినిమాలో ఆయన 'సూర్యవంశీ' అనే పోలీస్ పాత్రలో కనిపించడం విశేషం. తాజా 'సూర్యవంశీ' చిత్రంలో రణ్‌వీర్ సింగ్, అజయ్ దేవగన్ కూడా అతిథి పాత్రల్లో మెవరనున్నట్టు టాక్. ప్రస్తుతం అక్షయ్ కుమార్ 'కేసరి', 'గుడ్‌న్యూస్', 'మిషన్ మంగళ్', 'హౌస్‌ఫుల్4' చిత్రాల్లో నటిస్తున్నారు. ఇందులో 'కేసరి', 'హౌస్‌ఫుల్ 4' పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నాయి.

మే 3 నుంచి ఎంసెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం (2019-20)లో వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలు (సెట్స్) నిర్వహణ తేదీల షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి శనివారం విడుదల చేశారు. శనివారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రవేశపరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని చెప్పారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) మాత్రమే ఆన్‌లైన్‌లో జరగబోదనీ, శరీర దారుఢ్య పరీక్షలు జరుగుతాయనీ వివరించారు. ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను టీఎస్‌టీఎస్ ద్వారా టీసీఎస్‌కు అప్పగించామని చెప్పారు. ఎంసెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూహెచ్‌కే అప్పగించామని అన్నారు. మే 3 నుంచి 9వ తేదీ వరకు ఎంసెట్ రాతపరీక్షలు జరుగుతాయని చెప్పారు. మే 3,4,6 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం అభ్యర్థులకు, మే 8,9 తేదీల్లో అగ్రికల్చర్ విభాగం అభ్యర్థులకు రాతపరీక్షలుంటాయని అన్నారు. రోజూ రెండు విడతల్లో ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు జరుగుతాయని చెప్పారు. మే 5న నీట్ రాతపరీక్ష ఉన్నందున, అగ్రికల్చర్ విభాగం అభ్యర్థులకు మే 6. 7 తేదీల్లో చదువుకునేందుకు వెసులుబాటు కల్పించామని అన్నారు. ప్రవేశ పరీక్షల రాతపరీక్షలన్నింటినీ మేలోనే పూర్తి చేస్తామన్నారు. మే 23, 24 తేదీల్లో ఐసెట్ రాతపరీక్ష జరుగుతుందన్నారు. మే 11న ఈసెట్, మే 20న పీఈసెట్, మే 26న లాసెట్, పీజీలాసెట్, మే 27 నుంచి 29 వరకు పీజీఈసెట్, మే 30,31 తేదీల్లో ఎడ్‌సెట్ రాతపరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. సోమవారం ప్రవేశ పరీక్షలు నిర్వహించే విశ్వవిద్యాలయాల ఉపకులపతులు (వీసీ)లకు కన్వీనర్ ఎంపిక కోసం ముగ్గురి పేర్లను పంపించాలని కోరతామన్నారు. ఆ పేర్లు వచ్చిన వెంటనే పరిశీలించి త్వరలోనే కన్వీనర్లను ఖరారు చేస్తామని చెప్పారు. ఈ ఏడాది నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లు నియామకమవుతారని అన్నారు. గతేడాది ఎడ్‌సెట్, పీజీఈసెట్ కన్వీనర్లుగా పనిచేసిన వారు ఉద్యోగ విరమణ పొందారని చెప్పారు. ఐసెట్, లాసెట్ కన్వీనర్లుగా పనిచేసిన వారు ఉద్యోగ విరమణ పొందుతారని అన్నారు. అందుకే ఈ నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లను నియమిస్తామని వివరించారు. కన్వీనర్లను నియమించిన వెంటనే ఆయా సెట్‌లకు కమిటీ ఏర్పడుతుందని చెప్పారు. సెట్‌ల కమిటీల సమావేశం నిర్వహించి నోటిఫికేషన్, దరఖాస్తు ఫీజు వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ఎంసెట్ నోటిఫికేషన్ తొలుత విడుదలవుతుందని చెప్పారు. ఏప్రిల్‌లోనే తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ప్రవేశ పరీక్షల తేదీల్లో మార్పులుంటే అవకాశం లేదన్నారు. ఒకవేళ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ తేదీని బట్టి ప్రవేశ పరీక్షల నిర్వహణకు ఇబ్బందిగా ఉంటే మారుస్తామని అన్నారు. జాతీయ ప్రవేశ పరీక్షల నిర్వహణ తేదీలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేశామన్నారు.

ప్రవేశ పరీక్షల వివరాలు..

ప్రవేశ పరీక్ష	విశ్వవిద్యాలయం	పరీక్ష తేదీ
టీఎస్‌ఎంసెట్	జేఎన్టీయూహెచ్	మే 3,4,6
		(ఇంజినీరింగ్)
		మే 8,9 (అగ్రికల్చర్)
టీఎస్‌ఈసెట్	జేఎన్టీయూహెచ్	మే 11
టీఎస్‌పీఈసెట్	ఎంజీయూ	మే 20
టీఎస్‌ఐసెట్	కేయూ	మే 23,24
టీఎస్‌లాసెట్	ఓయూ	మే 26
టీఎస్‌పీజీలాసెట్	ఓయూ	మే 26
టీఎస్‌పీజీఈసెట్	ఓయూ	మే 27,28,29
టీఎస్‌ఎడ్‌సెట్	ఓయూ	మే 30,31

వివాహితపై లైంగిక దాడి

(మొదటిపేజీ తరువాయి)

సదరు మహిళను గమనించిన ఇంట్లో వాళ్లు విషయం ఆరా తీశారు. దాంతో జరిగిన విషయాన్ని ఆమె చెప్పింది. కుటుంబీకులు, గ్రామస్తులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తుమ్మ గోపి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఈసారి నల్లగొండ నుంచి ఎంపీగా..

(మొదటిపేజీ తరువాయి)

విదితమే. అప్పట్లో ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేసి గజ్వేల్ ఎమ్మెల్యేగా సీఎం పదవిని చేపట్టారు. ఇటీవల జరిగిన శాసనసభ ముందస్తు ఎన్నికల్లో ఆయన గజ్వేల్ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆయన నల్లగొండ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈసారి ఎంపీగా గెలిచి.. తాను ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ కేంద్రంలో కీలక పాత్ర పోషించే వాతావరణమే ఉంటే ఆయన ఢిల్లీకి పరిమితం కావాలని భావిస్తున్నారు. అలాంటి అవకాశం లేకపోతే అప్పుడు ఇక్కడ సీఎంగానే కొనసాగుతారని టీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మరోవైపు నల్లగొండ నుంచి కేసీఆర్ పోటీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో.. ప్రస్తుతం అక్కడ ఎంపీగా ఉన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ సారి తన సీటును వదులుకోవాల్సి ఉంటుంది. ఆయనకు ఎమ్మెల్సీ పదవి నిచ్చి.. మంత్రివర్గంలోకి తీసుకోవటం ద్వారా తగు న్యాయం చేయాలని సీఎం భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రస్తుతం రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మెన్‌గా ఉన్న గుత్తా స్థానంలో.. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు చెరుకు ముత్యంరెడ్డికి అవకాశమివ్వనున్నారని తెలిసింది.

బుల్లెట్ ప్రూఫ్ కార్ల చార్జీలు చెల్లించండి

(మొదటిపేజీ తరువాయి)

గురించి టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి కూడా నోటీసులు పంపించింది. గతేడాది సెప్టెంబర్ 6 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్టార్ క్యాంపెయినర్లు అయిన జానారెడ్డి, షబ్బీర్ అలీలు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను సెక్యూరిటీలో భాగంగా వాడారని ఐఎస్‌బ్ల్యూ తెలిపింది. ఈ రెండు బీపీ కార్లను తమ విభాగం సమకూర్చినట్టు తెలిపింది. దాదాపు 90 రోజులపాటు వాడినందుకుగానూ ఈ రెండు కార్లకు కిలోమీటరుకు 37 రూపాయలు, డ్రైవర్ రోజువారీ భత్యం 100 రూపాయలను చెల్లించాలని తెలిపింది. జానారెడ్డికి టీఎస్09 పీఏ1653 నంబరు కారును, షబ్బీర్ అలీకి టీఎస్09 పీఏ1654 నంబరు కారును కేటాయించినట్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో షబ్బీర్ అలీ వినియోగించిన కారుకు రూ.4.79 లక్షలు, జానారెడ్డి కారుకు రూ.4.2 లక్షలను చార్జీలుగా తేల్చింది. ఈ చార్జీలను డ్రైవర్లు ఇచ్చిన డైలీ రిపోర్టు ప్రకారం నిర్ణయించినట్టు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ సెక్యూరిటీ కోసం స్టార్ క్యాంపెయినర్లు వాడిన బీపీ కార్లకు అయిన వ్యయాన్ని వాడిన నాయకుల నుంచి వసూలు చేయాలని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్.. ఎన్నికలు జరిగిన రాష్ట్రాలకు ఆదేశాలు ఇచ్చిందని, ఆ ఉత్తర్వుల మేరకే తాము ఈ చార్జీలను వసూలు చేస్తున్నామని ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు తెలిపారు.

ఐఏఎస్ చంద్రకళ ఇంట్లో సోదాలు

(మొదటిపేజీ తరువాయి)



పనిచేశారు. అవినీతికి పాల్పడిన అధికారులను ఆమె నడిరోడ్డుపై నిలదీస్తున్న ఘటనలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. శాండ్ మాఫియాకు దడపుట్టేలా బాధ్యతలు నిర్వర్తించారని అధికారవర్గాల్లోనూ చంద్రకళకు పేరున్నట్టు యూపీ సెక్రెటేరియట్‌లో చెప్పుకుంటారు. అలాంటి తెలంగాణ మహిళా ఐఏఎస్ అధికారి పై 2012-13 మధ్యలో 60 ఇసుక రీచుల్లో ఈ అక్రమాలు జరిగినట్టు సీబీఐ అంటున్నది. హైకోర్టు ఆదేశాలిచ్చి కూడా సుమారు మూడేండ్లు కావొస్తున్నది. ఇప్పుడే మహిళా ఐఏఎస్ ఇసుక అక్రమాలు సీబీఐకి గుర్తుకొచ్చాయా..అనే అనుమానాలు కలుగుతున్నాయి. వాస్తవానికి ఇసుక రీచ్‌లను ఆయా జిల్లాల పంచాయతీ అధికారు(డీపీఓ)లే పర్యవేక్షిస్తుంటారు.

మాజీ సీఎం తెరపైకి..

ఇసుక అక్రమ తవ్వకాల్లో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ పాత్ర ఉన్నట్టు సీబీఐ వాదన. ఈ అక్రమాలకు తోడ్పడినట్టు.. ఆరోపణలు రావడంతో యూపీలోని ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసంలో సోదాలు చేస్తున్నట్టు అధికారులు అంటున్నారు. మైనింగ్ శాఖ బాధ్యతలను అప్పటి యూపీ సీఎం అఖిలేశ్ యాదవ్ నిర్వర్తించారు. ఆ తర్వాత యూపీలో మైనింగ్ శాఖను గాయత్రి ప్రసాద్ ప్రజాపతికి అప్పగించారు. ఈ కేసులో ఆయనకు కూడా సమన్లు పంపించి విచారణ చేయనున్నట్టు సీబీఐ అధికారులు తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేష్ మిశ్రా, బీఎస్పీ నేత రామ్ అవతార్ రాజ్‌పుత్ ఇండ్లలోను సోదాలతో సీబీఐ దడపుట్టించింది. 2019 లోక్‌సభ ఎన్నికల నిమిత్తం ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీ చేయనున్నాయని, ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైనట్లేనని వార్తలు వచ్చిన వెంటనే దాడులు జరగడం గమనార్హం.

సమ్మెకు టీమాస్ సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించే దేశవాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీమాస్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీమాస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య షఫర్డ్, కన్వీనర్ జాన్‌వెస్లీ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరగనున్న ఈ సమ్మె న్యాయమైందని తెలిపారు.

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, సామాజిక తరగతుల ప్రజల బతుకులను దిగజార్చే చర్యలకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ల సేవలో తరిస్తోందని తెలిపారు. మంచి రోజులు వస్తాయంటూ బీరాలు పలికి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేండ్లలో సంపన్నులకే మంచిరోజులొచ్చాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల్లాగే మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా సరళీకరణ ఆర్థిక విధానాలను మరింత వేగవంతంగా అమలు చేసిందని తెలిపారు. దీని ప్రభావంతో కార్మిక, కర్షకుల జీవితాలు దిగజారాయని పేర్కొన్నారు.

సమ్మెకు టీటీఎఫ్ మద్దతు

ఈనెల 8,9 తేదీల్లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీటీఎఫ్ అధ్యక్షులు ఇ రఘునందన్, ప్రధాన కార్యదర్శి కె రమణ ఓ ప్రకటన విడుదల చేశారు.

ఈనెల 8,9 తేదీల్లో ప్రదర్శనలు, సమావేశాల్లో టీటీఎఫ్ శ్రేణులు పాల్గొనాలని తెలిపారు. పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా కాలరాస్తోందని పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో ప్రదర్శనలు

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొనండి : జేఏసీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో ఆ సంస్థ ఉద్యోగులు శనివారం భోజన విరామ సమయాల్లో గేట్ మీటింగ్‌లు, ప్రదర్శనలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు నిరసనగా, కార్మికుల 12 డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8,9 తేదీల్లో చేపట్టే సమ్మెలో బీఎస్ఎన్ఎల్‌లోని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎఫ్‌టీయూ, బీఎస్ఎన్ఎల్ మజ్దూర్ సంఘ్, టీఈపీయూ సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించాయని నేతలు తెలిపారు.

ఇప్పటికే సమ్మె నోటీసులు అందజేశామని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ నేటికీ మనుగడ సాధించగలుగుతున్నదంటే సార్వత్రిక సమ్మెలు, బీఎస్ఎన్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్స్, ఎగ్జిక్యూటివ్స్ పోరాటాలే కారణమన్నారు. హైదరాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రదర్శనలో బీఎస్ఎన్ఎల్ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.సాంబశివ రావు, యన్ఎఫ్‌టియూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.సత్యనారాయణ, ఈయూ రాష్ట్ర అధ్యక్షులు జీ.మోహన్‌రెడ్డి, ఎన్ఎఫ్‌టిఈ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ముత్తు, ఈయూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఓంప్రకాశ్ జైశ్వాల్, రామచంద్రుడు, లక్ష్మీవైద్యనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెతో సత్తాచాటుదాం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు.

బీఎంఎస్ అసత్య ప్రచారాలను మానుకోవాలి... సమ్మెను జయప్రదం చేయండి

ఎం. సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

12 డిమాండ్ల పరిష్కారం కోసం 8,9 తేదీల్లో జరిగే సమ్మెలో ప్రతి ఒక్క కార్మికుడూ పాల్గొనాలని పిలుపునిస్తున్నాం. ఆర్ఎస్ఎస్ అనుబంధంగా ఉన్న బీఎంఎస్ సమ్మె పట్ల మీడియాలో, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం తగదు. 2013లో 48 గంటల సమ్మెను ఇవే 12 డిమాండ్లతో ముందుకెళ్లినం. అప్పుడు బీఎంఎస్ సమ్మెలో పాల్గొన్నది. ఇప్పుడూ అవే డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నా. ఈ సమ్మె మోడీ సర్కారుపై బురద జల్లేందుకు చేపట్టిన రాజకీయ సమ్మె అని ప్రచారం చేయడం బీఎంఎస్‌కు తగదు. కార్మికుల పట్ల తన వైఖరి ఏంటో ముందు బీఎంఎస్ స్పష్టం చేయాలి. రాజకీయాలు చేస్తున్నది బీఎంఎస్‌నే. రెండు రోజుల సమ్మెను విజయవంతం చేసి తీరుతాం.

చట్టాల నిర్వీర్యానికి వ్యతిరేకంగా... కార్మికుల కనీస వేతనం కోసం సమ్మె : ఉజ్జిని రత్నాకర్‌రావు, ఏఐటీయూసి ప్రధాన కార్యదర్శి

44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లు కుదించే మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపట్టబోతున్నాం. కార్మికులకు కనీసం వేతనంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి అనాలోచిత నిర్ణయాల వల్ల ఆర్థిక వ్యవస్థ గాడితప్పి నిరుద్యోగ సమస్య మరింత పెరిగింది. మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల నిర్ణయాలను తిప్పికొట్టకపోతే కార్మికులు బానిసలుగా మారే ప్రమాదముంది. అందు ప్రతి ఒక్క కార్మికుడూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం.

సమ్మెలో పాల్గొంటాం..పూర్తిగా సహకరిస్తాం : జి.రాంబాబు యాదవ్, టీఆర్ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు

సమ్మెలో టీఆర్ఎస్‌కెవి పాల్గొంటున్నది. సమ్మెకు పూర్తిగా సహకరిస్తాం. సమ్మెపై బీజేపీ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ అసత్య ప్రచారం చేయడం సరిగాదు. సమ్మెపై రాజకీయంగా క్లారిటీ ఉంది. కార్మికుల హక్కులను తిలోదకాలిస్తుంటే చూస్తూ ఊరుకోబోం. సమ్మెను జయప్రదం చేయాలని బహిరంగంగా పిలుపునిస్తున్నాం.

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి : కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచేలా కేంద్ర సర్కారుపై సమ్మెతో ఒత్తిడి పెంచాలి. కోర్టు తీర్పులకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం, కనీసం వేతనం అమలయ్యేలా పోరాడాలి.

అంబానీ, అదానీల కోసమే మోడీ పాలన : డి.నారాయణరావు, ఐఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

అంబానీ, అదానీలకు మోలు చేకూర్చేలా దేశంలో మోడీ పాలన నడుస్తున్నది. ప్రభుత్వ రంగ పరిశ్రమల మూసివేత వేగతరమైంది. పబ్లిక్ సెక్టార్‌ను మోడీ సర్కారు నిర్వీర్యం చేయాలని చూస్తున్నది. దీనిని కార్మికులంతా ఒక్కటై తిప్పికొట్టాలి. సమ్మెకు పూర్తి మద్దతునిచ్చి పాల్గొనబోతున్నాం.

ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాలడుగు భాస్కర్, ఎస్.రమ, సోమయ్య(సీఐటీయూ), పైళ్ల ఆశయ్య (ఎంబీసీ సంఘం), ఎమ్‌డీ అబ్బాస్(ఆవాజ్), ఎంవీ.రమణ(కల్లుగీత కార్మిక సంఘం), జంగారెడ్డి (తెలంగాణ రైతు సంఘం (జవహర్‌నగర్), వెంకట్రాములు(వ్యవసాయ కార్మిక సంఘం) శ్రీరాంనాయక్ (టీమాస్), కె.భాస్కర్(కేవీపీఎస్), శోభన్ నాయక్(తెలంగాణ గిరిజన సంఘం), లెల్లెల బాలకృష్ణ (మత్స్య కార్మిక సంఘం), పశ్యపద్మ(రైతుసంఘం, అమృతా ఎస్టేట్స్), ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్(ఏఐకేఎస్), శ్యామ్ (పీడీఎస్‌యూ), నరేంద్ర(ఐఎఫ్‌టీయూ), అచ్యుత రామారావు(అఖిల భారత రైతు కూలీ సంఘం), రాజేష్(పీడీఎస్‌యూ), కె.హిమబిందు(టీపీఎస్‌కే), అనిల్‌కుమార్ (ఏఐవైఎఫ్), నాగరాజు(అరుణోదయ), తదితరులు మాట్లాడారు. సమ్మెకు మద్దతు తెలిపారు. సమ్మెలో తమ సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొంటాయని ప్రకటించారు.

మోడీ x గడ్కరీ

న్యూఢిల్లీ: ఢిల్లీ పగ్గాలను బీజేపీ దక్కించుకున్నాక.. మోడీ, అమిత్ షాలను గెలుపు గుర్రాలుగా అభివర్ణించారు. ఓటర్లకు గాలం వేయటంలో మోడీ, వ్యూహాలు రచించడంలో అమిత్ షాలపై పార్టీ శ్రేణులు గట్టి నమ్మకం పెట్టుకున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు సెమీఫైనల్‌గా జరిగిన ఎన్నికలకు చేదు అనుభవం మిగిల్చింది. పైగా బీజేపీకి గట్టిపట్టున్న హిందీ రాష్ట్రాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో అధికారాన్ని కోల్పోవడంతో పార్టీ, సంఘ్ కార్యకర్తల్లో తీవ్ర నిరుత్సాహం నెలకొన్నది. ఈ రాష్ట్రాల ఫలితాల అనంతరం ఈ ద్వయంపై అంతర్గతంగా అసమ్మతి రాగాలు ఊపందుకున్నట్టు తెలుస్తున్నది. కొందరు బీజేపీ నేతలైతే బహిరంగంగానే పార్టీ అధినాయకత్వంపై విమర్శలు చేస్తున్నారు. 2014లో మోడీ తీసుకున్న అభివృద్ధి అంశాన్ని విస్మరించి రామమందిరం, విగ్రహాల ప్రతిష్టాపనలపై దృష్టి పెట్టడం వల్లే ఈ మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయామని బీజేపీ ఎంపీ సంజయ్ కాకడే అసెంబ్లీ ఫలితాలు వెలువడిన వెంటనే అభిప్రాయపడ్డారు. తాజాగా మోడీ ఓ ఇంటర్వ్యూలో రామ జన్మభూమి అంశాన్ని తమ ప్రభుత్వం పరిష్కరించలేదన్నట్టుగా వెల్లడించారు. దీంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులూ గుర్రుమంటున్నాయి. పార్లమెంటు చివరి సమావేశాల్లో అయోధ్యపై ఆర్డినెన్స్ వస్తుందన్న ఆశలు కాస్త అడియాసలవుతాయని హిందూత్వశక్తులు భావిస్తున్నాయి. ఈలోపు మరోసారి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని తెరపైకి తెచ్చారు. మొన్న మూడు రాష్ట్రాల్లో ఓటమికి మోడీ, అమిత్‌షాలదే బాధ్యత అన్నారు. తాజాగా దేశం ముందున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగమంటూ బాంబు పేల్చారు గడ్కరీ. తమ ప్రభుత్వం ఇప్పటి వరకూ 27 వేల మందికి ఉపాధి కల్పించిందని, వచ్చే ఏడాది మరో 50 వేలకు చేరుకుంటుందని చెప్పారు. అంతటితో ఆపకుండా దేశంలోని అర్బన్, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు ఏవిధంగా సృష్టించాలన్న దానిపై కేంద్రం దృష్టి పెట్టాలంటూ వ్యాఖ్యానించటం గమనార్హం. దీంతో ఈసారి మోడీకి బదులు గడ్కరీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా బరిలోకి దింపబోతున్నట్టు ఆర్ఎస్ఎస్ సంకేతాలిస్తున్నది. దీనికి మరింత బలం చేకూర్చేలా మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ కూడా మహారాష్ట్రియన్ ప్రధాని అయితే తప్పేంటని అన్నారు. మొత్తం మీద బీజేపీలో ముసలం మొదలైనట్టు ఆ పార్టీవర్గాల్లో చర్చ. మరోవైపు అసెంబ్లీ ఫలితాల అనంతరం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 'మోడీ అబద్ధాల కోరు' అంటూ హిందూత్వ సంస్థ ఒకటి ఓ బ్యానర్‌నే పెట్టింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోడీ నుంచి యోగి ఆదిత్యనాథ్‌కు పార్టీ పగ్గాలివ్వాలని నవనిర్మాణ్ సంస్థ ఆ బ్యానర్‌పై పేర్కొనడం గమనార్హం. కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుంచి గడ్కరీకి పగ్గాలు అప్పగించాలని మహారాష్ట్రకు చెందిన ప్రముఖ సంఘ్‌పరివార్ నేత కిశోర్ తివారీ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు లేఖ రాశారు. పార్టీలో, ప్రభుత్వంలో నియంతృత్వ పోకడలు కలిగిన నాయకులతో సమాజానికి, దేశానికి ప్రమాదకరమని వసంత్‌రావు నాయక్ షేతి స్వావలంబన్ మిషన్ చైర్‌పర్సన్ తివారీ లేఖలో పేర్కొన్నారు. చరిత్ర పునరావృతం కాకూడదనుకుంటే 2019 ఎన్నికల కోసం పార్టీ పగ్గాలు నితిన్ గడ్కరీకి అప్పజెప్పాలని కోరారు. కాగా, సరిగ్గా ప్రధాని మోడీ మహారాష్ట్ర పర్యటనలో ఉన్నప్పుడే ఈ లేఖ రాయడం యాదృచ్ఛికమేమీ కాదనే చర్చ మొదలైంది. ఈ లేఖ వెనుక సంఘ పరివారం ప్రోత్సాహం కూడా ఉందని వాదిస్తున్నారు.

నాయకత్వంపై లుకలుకలు'

బీజేపీలో అంతర్గత ప్రజాస్వామిక వాతావరణం దెబ్బతిన్నదని, ఒకప్పుడు చాలా మంది పార్టీ అగ్రనేతలు కీలక నిర్ణయాలు తీసుకోవడం భాగస్వాములయ్యే వారని, వారసత్వ రాజకీయాల కాంగ్రెస్ నుంచి ఇక్కడ ప్రస్ఫుటంగా బీజేపీ ప్రత్యేకత కనబడేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కీలక నిర్ణయాలన్నీ ఆ 'ఇద్దరు నేతలే' తీసుకుంటున్నారని చెబుతున్నారు. వారి అహంకారపూరిత వైఖరిపట్ల అంతర్గత ధిక్కారస్వరం వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో బీజేపీలో ఆదరణ, సంఘ్ పరివారానికి ప్రీతిపాత్రుడు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు అత్యంత సన్నిహితుడైన నాగ్‌పూర్ నేత నితిన్ గడ్కరీ.. పార్టీ అధినాయకత్వంపై పరోక్షంగా విమర్శలు సంధించడం ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. మూడు హిందీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పార్టీ పరాజయంపై అగ్రనాయకులు స్పందించక పోవడంపట్ల ఆయన విమర్శలు చేశారు. వైఫల్యాలను, పరాజయాలను నాయకత్వం కచ్చితంగా అంగీకరించాల్సిందేనని ఆయన వ్యాఖ్యలు చేసి తర్వాత విపక్షాలు, మీడియా తన మాటలను వక్రీకరించాయని అన్నారు. కాగా, రోజుల వ్యవధిలోనే మరోసారి ఇదే తరహా వ్యాఖ్యలు చేయడంతో తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించినట్టయింది. 'ఒక వేళ నేను పార్టీ అధ్యక్షుడినైతే.. మా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు సరిగా పనిచేయకపోతే అందుకు బాధ్యులెవరు?' అని ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ప్రశ్నించారు.

గడ్కరీ వైపు ఆర్ఎస్ఎస్ మొగ్గు

2019 సార్వత్రిక ఎన్నికల్లో హంగ్ ప్రభుత్వం ఏర్పడుతుందని, పార్టీ 50 నుంచి 100 స్థానాలను కోల్పోవచ్చునని ఆర్ఎస్ఎస్ అనుబంధ పత్రిక 'ఆర్గనైజర్' అంచనా వేసింది. కాగా, ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షాలపై ఎన్డీయే మిత్రపక్షాలకు వ్యతిరేక భావం పెరుగుతున్నందున ఒకవేళ హంగ్ ఏర్పడితే వాటిని ఒక్కతాటి మీదకు తీసుకురావడం ఆ 'ద్వయా'నికి సులువు కాకపోవచ్చు. అయితే శివసేన సహా మిత్రపక్షాలతో, వ్యాపారవేత్తలతో సత్సంబంధాలు కలిగిన గడ్కరీకి మద్దతునిస్తే ప్రాంతీయ పార్టీలన్నీ కూడగట్టవచ్చునని ఆర్ఎస్ఎస్ అంచనా వేస్తున్నది. ఈ అంచనాతోనే మోడీ స్థానంలో గడ్కరీని తెచ్చే 'ప్లాన్ బీ'ని ఆరెస్సెస్ సిద్ధం చేసిందని తెలుస్తున్నది. ఈ విషయంపై బీహార్ విపక్షంలోని ఒక ఎంపీ స్పందిస్తూ.. 'మోడీ కాదనుకుంటే.. గడ్కరీ' అని చెప్పడం గమనార్హం.

మరోవైపు.. మోడీ ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకు గడ్కరీని తెరపైకి తెస్తున్నట్టు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

హింసోన్మాదం

సుప్రీం తీర్పును అమలుచేస్తూ శనిసింగనాపూర్‌లో మహిళా భక్తులను అనుమతిస్తూ.. అయ్యప్ప ఆలయంలో మాత్రం మహిళల ప్రవేశాన్ని హిందూత్వశక్తులు అడ్డుకుంటు న్నారు. అయ్యప్ప ఆలయంలోనికి ప్రవేశించే మహిళ భక్తుల ను బెదిరించటంతో.. వారిని అంతమొందిస్తామంటూ హిం దూత్వశక్తులు హెచ్చరికలతో టెన్షన్ వాతావరణం నెలకొ న్నది. ఇప్పటిదాకా లెఫ్ట్ నాయకులను హతమారుస్తున్న ఆర్ఎస్,ఎస్,బీజేపీ నేతలు ఇపుడు బాంబుదాడులతో హింసోన్మాదాన్ని సృష్టిస్తున్నారు. దీంతో కేరళలో సంఘ్‌శక్తుల అరాచకాలతో కాష్టంలా మండుతున్నది.

తిరువనంతపురం : శబరిమలలోకి మహిళల ఆలయ ప్రవేశాన్ని నిరసిస్తూ హిందూత్వశక్తులు రెచ్చిపోతున్నారు. విధ్వంస చర్యలకు పాల్పడుతున్నారు. లెఫ్ట్ నాయకుల ఇండ్లను లక్ష్యంగా చేసుకొని బాంబులతో దాడులు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులకు తెగబడ్డారు. కన్నూరు జిల్లా తల్లసెర్రి ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) నేత ఎఎన్ శంషీర్ ఇంటిపై, ఇతర ప్రాంతాల్లో బాంబులతో దాడి చేశారు. శుక్రవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు బాంబు విసిరి పరారైనట్టు పోలీసులు తెలిపారు. సీపీఐ(ఎం) కన్నూరు జిల్లా కార్యదర్శి పి శశి నివాసంపై కూడా బాంబులతో దాడికి పాల్పడ్డారు. కోజీకోడ్ జిల్లా పెరంబ్రాలో సీపీఐ(ఎం) కార్యకర్త ఇంటిపై బాంబు వేశారు. రాష్ట్రంలో దాదాపు 20 చోట్ల సీపీఐ(ఎం) కార్యాలయాలపై దాడి జరిగినట్టు తెలుస్తున్నది. ఈ ఘటనల్లో 31 మంది గాయపడ్డారు. 'రాష్ట్రంలో హింసాకాండను ప్రేరేపించడంలో ఆర్ఎస్ఎస్ కుట్ర దాగుంది. శాంతియుత వాతావరణాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు' అని శంషీర్ మీడియాతో చెప్పారు.

మరోవైపు పతనంతిట్టలోని పండలం, అడోర్, కొడుమాన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏడు రోజులపాటు నిషేధాజ్ఞలు విధించారు. అడోర్‌లో సీపీఐ(ఎం) స్థానిక నేత ఇంటిపై, మరో రెండు దుకాణాలపై శుక్రవారం రాత్రి బాంబులతో దాడిచేశారు. ఈ ఘటనల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి అనుమతించాలంటూ గతేడాది సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాటి నుంచి రాష్ట్రాన్ని హిందూత్వ శక్తులు రావణాకాష్టంగా మారుస్తున్న విషయం తెలిసిందే. హింసకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3,178 మందిని అరెస్టుచేసినట్టు పోలీసులు తెలిపారు. అలాగే 37,979 మందిపై 1,286 కేసులు నమోదైనట్టు చెప్పారు.

హింసను ఆపండి : సీపీఐ(ఎం) సర్కార్‌కు బీజేపీ హెచ్చరిక

ఓవైపు సీపీఐ(ఎం) నేతలను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని బాంబులతో దాడులకు పాల్పడూ.. మరోవైపు హింసను ఆపాలంటూ కేరళ సర్కార్‌కు బీజేపీ హెచ్చరిస్తున్నది. 'ఈ హింసను ఆపాల్సిందిగా ముఖ్యమంత్రిని హెచ్చరిస్తున్నాం, సలహా ఇస్తున్నాం.. లేకపోతే సీపీఐ(ఎం) ప్రభుత్వం రాజ్యాంగ పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది' అని బీజేపీ అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావు చెప్పారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ప్రభుత్వం మహిళలను అనుమతిస్తున్నదని ఆరోపించారు. శబరిమల అంశాన్ని పినరయి విజయన్ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రానికి ప్రధాని

ఇప్పటికే శబరిమలలో హిందూత్వం చిచ్చుపెట్టిన బీజేపీ,ఆర్ఎఎస్ఎస్ రాజకీయఎత్తులు వేస్తున్నది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 15, 25 తేదీల్లో కేరళలో పర్యటించనున్నారు. 15న కొల్లాంలో, 24న త్రిసూర్‌లో జరిగే బహిరంగసభల్లో పాల్గొననున్నారు. బీజేపీ 15న ఆందోళనను ఉధృతం చేయనున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర సచివాలయానికి నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు ప్రకటించింది.

నాకు ఎలాంటి భయం లేదు. బిందు

సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సంప్రదాయ నిషేధాన్ని ఛేదించుకొని శబరిమల ఆలయంలోకి అడుగుపెట్టిన తొలి మహిళ, లెక్చరర్ బిందు (42) ఈ నెల 2న చరిత్ర సృష్టించారు. బిందు, 44 ఏండ్ల కనకదుర్గ ఆలయంలో అడుగుపెట్టింది ఆలస్యం.. హిందూత్వశక్తులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆ ఇద్దరు మహిళల ఇండ్లవద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో బిందు శనివారం ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. తాను భయపడటంలేదని అన్నారు. పుణ్యక్షేత్రంలో తన ప్రవేశం లింగ న్యాయం కోసం పోరాడుతున్న మహిళలకు తోడ్పాటని చెప్పారు. 'లింగసమానత్వం కోసం నేను నిలబడ్డాను. అందుకే నేను ఆలయంలోకి ప్రవేశించాను. ఇది లింగ న్యాయం నా సహకారం. డిసెంబర్‌లో మొదటిసారి మేం ఆలయంలోకి వెళ్ళేందుకు ప్రయత్నించినప్పుడు, వెనక్కి వెళ్ళిపోవాలని పోలీసులు మాకు సలహా ఇచ్చారు. కానీ, ఈసారి వారు మాకు పూర్తి మద్దతునిచ్చారు' అని బిందు చెప్పారు. హిందూత్వశక్తుల హింసాత్మక చర్యలను గురించి ప్రశ్నించగా.. 'భవిష్యత్ గురించి బెంగలేదు.. నాకు భయం లేదు..' అన్నారు. కేరళలో 35 లక్షల మంది మహిళలు భుజం.. భుజం కలిసి మహిళా హారం నిర్వహించిన కొద్దిగంటలకే బిందు, కనకదుర్గ ఆలయంలోకి వెళ్ళిన విషయం తెలిసిందే.

చట్టాలను గౌరవించాలి : ఐరాస ప్రధాన కార్యదర్శి

ప్రతీ ఒక్కరూ చట్టాలను గౌరవించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో నెలకొన్న వివాదంపై గుటెరస్ పైవిధంగా స్పందించారు. ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించాలన్నదే ఐరాస ప్రాథమిక ప్రాధాన్యమని అన్నారు. పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులున్నాయని అన్నారు.

శబరిమల వివాదంలో కేరళ రణరంగంగా మారిన నేపథ్యంలో శబరిమల విషయంలో ఐరాస వైఖరి చెప్పాలని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా గుటెరస్ పై విధంగా స్పందించారు.

వాస్తవాలను దాచితే.. పరిస్థితులు మరింత సంక్లిష్టం

న్యూఢిల్లీ: రాఫెల్ ఒప్పందంపై దర్యాప్తునకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయడంపై బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా సుముఖత వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంపై పార్లమెంట్‌లో జరుగుతున్న గందరగోళంపై అసంతృప్తిని వ్యక్తం చేసిన సిన్హా.. 'నేడు పార్లమెంట్‌లోని పరిస్థితులు ప్రజలకు చాలా సంక్లిష్టంగా తయారవుతున్నాయి. ఈ స్థితి దినదినం మరింత దిగజారిపోతున్నది. మనం నేరస్తులం కానప్పుడు, దాచేయడానికి ఏమీ లేనప్పుడు.. ఆ వాస్తవాలను బయటకు చెప్పకపోవడంతో పరిస్థితులు సంక్లిష్టంగా మారుతున్నాయి. దీని పర్యావసనంగా తీవ్ర వాదోపవాదనలు చోటుచేసుకుంటున్నాయ'ని ఆయన ట్వీట్ చేశారు. మోడీని పరోక్షంగా 'సార్' అని సంబోధిస్తూ.. ఆయన వ్యాఖ్యలు చేశారు. 'ఈ అంశాన్ని(రాఫెల్ డీల్‌పై ఆరోపణలను) మొగ్గలోనే తుంచి వివేకవంతుల అభిప్రాయాలమేరకు జేపీసీకి ఎందుకు అప్పగించకూడదు సార్. దీంతో నిజాయితీ, పారదర్శకత వెల్లడవుతుంది కదా. జై హింద్'అని పోస్టు చేశారు.

తప్పులతడక ఓటర్ల జాబితాకు.. రాష్ట్ర ఎన్నికల సంఘానిదే బాధ్యత

హైదరాబాద్ : తప్పుల తడకగా ఓటర్ల జాబితాలకు రాష్ట్ర ఎన్నికల సంఘానిదే బాధ్యత అని హైకోర్టు పేర్కొంది. పంచాయతీ ఎన్నికలను నిర్వహించేస్తే చిత్త శుద్ధి చాటుకున్నట్టు కాదని, ఆ ఎన్నికల్లో అర్హులందరూ ఓటర్ల జాబితాలో ఉన్నప్పుడే ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో సమర్థంగా పనిచేసినట్టు అవుతుందని ప్రకటించింది. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ చెప్పారు. నల్లగొండ జిల్లా గుర్రంపాడు గ్రామంలోని చామలోనిబావికి చెందిన 1319 నెంబరు గల ఇంటిలోని వారిని వేరు వేరు వార్డుల్లో ఓటర్లుగా పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా ఉండటంపై దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారించింది. ఆ ఇంట్లోని మంతిపల్లి దుర్గయ్య, ఆయన భార్యకుమార్తెలు యాదవమ్మ, మమతలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఈ విధంగా ఓటర్ల జాబితా రూపొందిందంటే ఎన్నికల సంఘం వైఫల్యం చెందడమే అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది.

సెన్సెక్స్ ▲ 181 35,695

నిఫ్టీ ▲ 55 10,727

శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి

డాలరుకు రూపాయి విలువ 69.72



బంగారం(10.గ్రా) రూ. 31,548



వెండి (కేజీ) రూ. 40,140



కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	439	విజయవాడ	445
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	453
వరంగల్	441	ముంబయి	494



అప్పుల బాట పట్టిన ప్రభుత్వ సంస్థ హాల్!



న్యూఢిల్లీ: కేంద్రం లోని మోడీ సర్కారు తీసుకుంటున్న అర్థం లేని నిర్ణయాలతో ఒకప్పుడు మేటీ ప్రభుత్వ రంగ సంస్థలుగా వెలిగిన పీఎస్‌యూలు నేడు దివాల స్థితికి చేరుకుంటున్నాయి. తాజాగా ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) గత కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. కనీసం ఉద్యోగులకు జీతాలు ఇచ్చే డబ్బు లేకపోవడంతో రూ.1000కోట్ల అప్పు చేసినట్లు తాజాగా మీడియాలో ఒక కథనం వెలుగులోకి వచ్చింది. హాల్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ప్రస్తుతం ఆ కంపెనీ వద్ద ఉన్న డబ్బుతో తమ 29వేల ఉద్యోగులకు కేవలం మూడు నెలలు మాత్రమే జీతాలు ఇవ్వగలదని గతేడాది అక్టోబరులో ఓ మీడియా కథనం పేర్కొంది. అయితే ఈ కథనంపై తాజాగా హాల్ సీఎండీ ఆర్ మాధవన్ స్పందించారు. హాల్‌పై వస్తున్న వార్తలు నిజమేనని, ఇప్పటికే ఉద్యోగుల జీతాల కోసం రూ.1000కోట్ల అప్పు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి తమ నష్టాలు రూ.6వేల కోట్లకు చేరుకుంటాయని ఆయన వెల్లడించారు. హాల్ ఆర్థిక ఇబ్బందులకు ప్రధాన కారణం భారత వైమానిక దళమేనని తెలుస్తోంది. 2017 సెప్టెంబరు నుంచి గతేడాది డిసెంబరు 31 వరకు హాల్‌కు భారత ఎయిర్‌ఫోర్స్ చెల్లించాల్సిన బకాయిల మొత్తం రూ. 14,700కోట్ల వరకు ఉంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఇది రూ. 20వేల వరకు పెరగనుందని మాధవన్ తెలిపారు. మరో రూ.వెయ్యికోట్లు నేవీ, ఆర్మీ చెల్లించాల్సి ఉంది. 2017 సెప్టెంబరు నుంచి ఎయిర్‌ఫోర్స్ కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే చెల్లించిందని మాధవన్ పేర్కొన్నారు. గత రెండు మూడు దశాబ్దాల్లో హాల్ అప్పు అడగడం ఇదే తొలిసారి అని తెలిపారు.

ఎల్ఐసీ మెరుగ్గా రాణిస్తోంది: ప్రభుత్వం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 26,147.52 కోట్ల మేర నికర లాభాలను ఆర్జించింది. ఇంతక్రితం ఏడాది సంస్థ రూ.20,269.47 కోట్ల లాభాలను నమోదు చేసింది. దీంతో పోలిస్తే క్రితం మార్చితో ముగిసిన ఏడాదిలో సంస్థ లాభంలో 29 శాతం వద్ధి నమోదు అయిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోకసభకు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ దాదాపు రూ.48,444 కోట్ల మిగులు నిధులను కలిగి ఉండటంతో.. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,430 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించిందన్నారు. అదే విధంగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐడీబీఐ బ్యాంకులో దాదాపుగా రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిందన్నారు. తొలత ఐడీబీఐలో కీలక వాటాను ఎల్ఐసీ స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నప్పటికీ రానున్న రోజుల్లో బీమా సంస్థ తన వాటాను క్రమంగా తగ్గించుకుంటూ వస్తుందని ప్రభుత్వం ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే రిస్క్‌లో ఉన్న సంస్థలో ఎల్ఐసీతో బలవంతంగా వాటాలు కొనిపించి బీమా సంస్థ నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు.. సంస్థ మనుగడను ప్రమాదంలో పడేస్తున్నారంటూ వస్తున్న వార్తలను ప్రభుత్వం ఈ సందర్భంగా తోసిపుచ్చింది.

8,9 తేదీల్లో స్తంభించనున్న బ్యాంకింగ్!

ట్రేడ్ యూనియన్ల సమ్మె ప్రభావం



న్యూఢిల్లీ: దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ) ఉద్యోగులు మరోమారు సమ్మె బాట పట్టనున్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలోని పది ప్రధాన ట్రేడ్ యూనియన్లు ఈ నెల 8, 9 తేదీల్లో జాతీయ సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో వివిధ రంగాల ఉద్యోగులతో పాటు బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు కూడా పాలుపంచుకొనేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలకు మరోమారు నిలిచిపోయే అవకాశం కనిపిస్తోంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ, ఏఐసీసీటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, యూటీయూసీ, టీయూసీసీ, ఎల్‌పీఎఫ్, ఎస్ఈడబ్ల్యుఏ సంఘాలు వచ్చే మంగళ, బుధ వారాల్లో జాతీయ సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు సంబంధించి ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలు ఇప్పటికే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు సమాచారమిచ్చాయి. బ్యాంకు సమ్మె నేపథ్యంలో కార్యకలాపాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని ఐడీబీఐ. అలహాబాద్ బ్యాంక్‌లు మార్కెట్ నియంత్రణ సంస్థకు శనివారం వెల్లడించాయి. ఏఐబీఈఏ, బెఫీలు సమ్మెలో పాల్గొనాలని నిర్ణయం తీసుకుంటే మాత్రం బ్యాంకు శాఖల పనితీరుపై దీని ప్రభావం ఉంటుందని.. ఆర్థిక కార్యకలాపాలు ప్రభావితమయ్యే అకవాశం ఉందని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. మరోవైపు ప్రయివేటు రంగ బ్యాంక్ కరూర్ వైశ్యా బ్యాంక్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వెల్లడించింది. తమ బ్యాంక్ ఉద్యోగులు గనుక ఈ సమ్మెలో పాల్గొంటే కార్యకలాపాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని తెలిపింది. బ్యాంక్ ఆఫ్ బరోడాలతో విజయ బ్యాంక్, దేనా బ్యాంకుల విలీనంతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వపు అనాలోచిత నిర్ణయాలను వ్యతిరేకిస్తూ దాదాపు 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు గత డిసెంబరు 26 సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. వరుస బ్యాంకు సమ్మెలతో దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగమనం పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

పీఎన్‌బీ స్కామ్ సాధారణ ద్రవ్య వివాదం: నీరవ్



న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ రంగంలోనే అతిపెద్ద కుంభకోణంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.13వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోదీ తాను ఏ తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. మోడీని ఆర్థిక నేరగాడిగా ప్రకటించాలంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పీఎంఎల్ఏ కోర్టులో వేసిన పిటిషన్‌కు ఆయన సమాధానమిచ్చారు. పీఎన్‌బీలో రుణాల ఎగవేత అనేది ఒక ద్రవ్యపరమైన సాధారణ వివాదాంశమేనని ఆయన తెలిపారు. సదరు లావాదేవీలు అన్నీ తప్పుల తడకలని ఆయన తెలిపారు. గతంలో జరిగిన ఈ లావాదేవీలను ప్రస్తుతం వెలుగులోకి తెచ్చి వాస్తవానికంటె ఎక్కువ చేసి చూపుతున్నారని ఆయన వివరించారు. ఈ విషయంలో తాను ఏ తప్పు చేయలేదని మోడీ వివరించారు. భద్రతా పరమైన కారణాల వల్లే తాను భారత్ తిరిగి రాలేకపోతున్నానని వెల్లడించారు. పీఎన్‌బీ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న నీరవ్‌పై ఇప్పటికే ఇంటర్‌పోల్ అధికారులు రెడ్ కార్నర్ నోటీసులను జారీ చేశారు. అతడిని భారత్ తిరిగి రప్పించేందుకు ఈడీ, సీబీఐ అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. నీరవ్ బ్రిటన్‌లోనే తలదాచుకుంటున్నట్లు ఆ దేశ వర్గాలు ఇటీవల భారత్ ప్రభుత్వ అధికారులకు తెలియజేశారు. ఈ కేసులో ఇప్పటి వరకూ రూ.4,765కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసిన సంగతి తెలిసిందే.

లక్ష్యం చేరని జీఎస్టీ వసూళ్లు

- దాదాపు రూ.లక్ష కోట్లు తగ్గొచ్చు: నిపుణులు
- ద్రవ్యలోటు మరింత పెరిగేందుకు అవకాశం..



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాలపై అమలులోకి తెచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఖజానాకు తగిన ఆదాయాన్ని ఇవ్వడం లేదు. గతేడాది జులై నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి సర్కారుకు ఆశించిన రెవెన్యూ రావడం లేదు. 2018-19 బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రస్తుత ఏడాదికి రూ.13,48,000 కోట్ల పన్ను ఆదాయాన్ని జీఎస్టీ రూపంలో వసూలు చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. అంటే సగటున నెలకు దాదాపు రూ.1,12,000 కోట్ల రూపాయల జీఎస్టీ ఆదాయాన్ని వసూలు చేయాలన్న మాట. అయితే పన్ను వసూళ్ల శాఖ ఏ ఒక్క నెల కూడా ఈ లక్ష్యాన్ని అందుకోలేక పోయింది. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఆశించిన రాబడిలో దాదాపు లక్ష కోట్ల రూపాయలు తగ్గొచ్చని 'కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్' అంచనా వేసింది. పర్యవసానంగా ద్రవ్యలోటు 3.5 శాతం కన్నా పెరిగే ప్రమాదం పొంచి ఉందని తెలిపింది. ద్రవ్యలోటు (రెవెన్యూ, ఖర్చు మధ్యనుండే వ్యత్యాసం)ను తగ్గించేందుకు రిజర్వ్ నిధులను అందజేయాల్సిందిగా భారతీయ రిజర్వ్ బ్యాంక్‌పై మోదీ ప్రభుత్వం ఒత్తిడి తేవడానికి ఇదీ ఒక కారణం కావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

అధికారుల పనితీరే కారణమా..

లక్ష్యంగా పెట్టుకున్న రాబడికి, వసూళ్లకు మధ్య ఎందుకు ఇంత వ్యత్యాసం వచ్చిందో కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికీ అర్థం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వ పన్ను అధికారుల సామర్థ్యాన్ని మరోసారి సమీక్షించాల్సిందిగా కోరుతూ కేంద్ర ఆర్థిక కార్యదర్శి హష్ముక్ అధియా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుకు గత జూన్ నెలలో ఓ లేఖ రాశారు. కొన్ని రాష్ట్రాలు కేంద్రాని కన్నా ఎక్కువ జీఎస్టీ వసూళ్లను రాబట్టాయని, రాష్ట్రాల అధికారుల కన్నా కేంద్రం అధికారుల తీరు అధ్వాన్నంగా ఉందా? అని కూడా ఆ లేఖలో ఆయన ప్రశ్నించారు. టర్నోవర్ ఏడాదికి కోటిన్నర తక్కువుండే వ్యాపార సంస్థలపై విధించే జీఎస్టీ పన్నులో 90 శాతం రాష్ట్రాలకు వెళుతుంది. మిగతా పది శాతం కేంద్రానికి వస్తుంది. ఏడాదికి కోటిన్నర రూపాయలకు పైగా టర్నోవరుండే సంస్థలపై విధించే జీఎస్టీ పన్నులో కేంద్రానికి, రాష్ట్రానికి చెరి యాభై శాతం లభిస్తుంది. 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని ప్రతి రాష్ట్రానికి పన్ను రాబడి ఏటా 14 శాతం పెరగాలి. అలా పెరగక తగ్గినట్లయితే ఆ వ్యత్యాసాన్ని కేంద్రం భరించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రస్తుత ఆర్థిక సంవత్సఆరినికి పలు రాష్ట్రాలకు 3,899 కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉంది. మరో రెండు నెలలు పోతే ఈ మొత్తం మరో నాలుగింతలు పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్రం ప్రతి రెండు నెలలకోసారి రాష్ట్రానికి రాబడి వ్యత్యాసాలను చెల్లించాల్సి ఉంటుంది. గతంతో పోలిస్తే ఈ సారి రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గానే ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల జీఎస్టీ రాబడి 16 శాతం తగ్గగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాబడి 13 శాతం మాత్రమే తగ్గింది.

రిటర్నుల దాఖలు అంతంతే..

వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఎగ్గొడుతూ రిటర్నులను దాఖలు చేయని వారి సంఖ్య దేశంలో క్రమంగా పెరుగుతూ వస్తోంది. జీఎస్టీకి సంబంధించిన రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య రోజురోజుకు ఆందోళనకరంగా కనిపిస్తోంది. గడిచిన ఏడాది కాలంలో జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య దాదాపు మూడు రెట్లు పెరిగింది. 2017 నవంబరులో 10.56 శాతంగా ఉన్న పన్ను రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య .. గడిచిన నవంబరు మాసానికి 28.75 శాతానికి పెరిగింది. ఈ విషయాన్ని స్వయంగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకు తెలిపారు. జులై-సెప్టెంబరు మధ్య కాలంలో పన్ను రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య 25.37 శాతం పెరిగిందని ఆయన వివరించారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఈ సంఖ్య కేవలం 15.03 శాతంగా నమోదు అయినట్టుగా ఆయన వివరించారు. ఇదే సమయంలో దేశంలో నకిలీ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను కోరుతున్న వారి సంఖ్యలో కూడా నాలుగు నుంచి 499కి పెరిగినట్టుగా మంత్రి తెలిపారు.

అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలి

- చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 8,9న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న గీత, నేత, మత్స్య,రజక, క్షౌర, విశ్వకర్మ, వడ్డెర, గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ సమ్మెలో భాగస్వాములు కావాలని కమిటీ కన్వీనర్ యం.వి. రమణ, మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. రమేష్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. నాగరాజు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ తుంగలో తొక్కిందని విమర్శించారు. అచ్చేదిన్, మేడ్ ఇన్ ఇండియా, రైతేరాజు వంటి గొప్పగొప్ప ప్రకటనలు చేసిన మోడీ ఆచరణలో వాటిని అమలు చేయలేదని విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా సరళీకరణ, సంస్కరణలు అమలు చేయడం వల్ల వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. ఫలితంగా వృత్తిదారులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, కనీస వేతనం రూ.18వేలు అమచేయాలంటూ డిమాండ్ చేస్తూ సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ప్రజాసంఘాలనేతలను బేషరతుగా విడుదల చేయాలి

నవతెలంగాణ బ్యూరో : అక్రమంగా అరెస్టు చేసిన ప్రజా సంఘాల నేతలను తక్షణమే విడుదల చేయాలని ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ నెల 2న ఏఐఎఫ్‌టీయు నాయకుడు మండల లక్ష్మణ్‌ను మఫ్టీలో వచ్చిన పోలీసులు దొంగల మాదిరిగా ఎత్తుకెళ్లారని పేర్కొంది. రుద్రారం గ్రామం, మిరుదొడ్డి మండలానికి చెందిన బీడీల రాములను కూడా అదే రోజు తీసుకెళ్లారని తెలిపింది. సూరంపల్లి మహేందర్ అనే వ్యక్తిని ముగ్గురు పోలీసులు వచ్చి ఎత్తుకెళ్లారని, అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్‌చేసింది.

ఒలంపియాడ్‌లో సత్తాచాటిన శ్రీ చైతన్య

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం, హోమి బాబా సెంటర్‌ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, ఇండియన్ అసోసియేషన్ ఫిజి క్స్ టీచర్స్(ఐఏపీటీ)ల ఆధ్వర్యంలో ఐఏపీటీ ఒలంపియాడ్‌ను నిర్వహించారు. ఈ ఒలంపియాడ్‌లో తమ సంస్థ నుంచే 144 మంది విద్యార్థులు ఎంపికయ్యారని శ్రీచైతన్య విద్యాసం స్థల అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ ఒలంపియాడ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి 82మంది విద్యార్థులు, తెలంగాణ నుంచి 59 ఓమంది విద్యార్థులు, బెంగుళూరు నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆమె అన్నారు. ఈ సదర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బీ.యస్.రావు మాట్లాడుతూ...తమ విద్యాసంస్థల ప్రత్యేక అకడమిక్ ప్రోగ్రామ్స్, అంకితభావంతో పనిచేసే అధ్యాపకుల వల్లే తాము ఈ ఘన విజయాన్ని సాధించామని తెలిపారు.

ఆధిపత్యం కోసం కోట్లల్లో కాసులు

- రంగంలోకి టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు
- తమ వారిని గెలిపించుకునేందుకు పావులు

అసెంబ్లీని తలపిస్తున్న పంచాయతీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీల్లో పాగా వేసేందుకు టీఆర్ఎస్, కాంగ్రెస్ పావులు కదుపుతున్నాయి. పల్లెల్లో పట్టు సాధించడానికి కోట్లు ఖర్చు చేయడానికి కూడా వెనకాడం లేదు. సర్పంచ్ అభ్యర్థి గెలుపు కోసం రూ. 2కోట్లు ఖర్చు పెట్టేందుకైనా సిద్ధమవుతున్నారు. పంచాయతీలకు నోటిఫికేషన్ విడుదల తర్వాత రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తిస్థాయి ఆధిపత్యం కనబర్చేందుకు టీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తుండగా, పంచాయితీల్లో గెలిచైనా పరువు నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఈ నేపథ్యంలో తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి బాడా వ్యాపారులను రంగంలోకి దించారు. మొదటి విడత ఎన్నికలు నిర్వహించడానికి మరో రెండు రోజుల్లో నామినేషన్ల పర్వం షురూ కానుంది. తమ వారిని గెలిపించుకోవడానికి రెబెల్స్ నామినేషన్లు వేయకుండా ఇప్పటి నుంచి జాగ్రత్త పడుతున్నారు. తాజా ఎమ్మెల్యేలు సర్పంచ్‌ల గెలుపు బాధ్యతను తమ భుజాలపై వేసుకుని గ్రామ స్థాయిలో మంతనాలు జరుపుతున్నారు.

టీఆర్ఎస్‌వైపు అభ్యర్థుల చూపు

ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ మద్దతు కోసం అభ్యర్థులు ఎమ్మెల్యేలను వెంట పెట్టుకుని "తెలంగాణ భవన్"కు క్యూ కడుతున్నారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ తమను బలపరిస్తే కోటి రూపాయలు విరాళాలు ఇచ్చేందుకు కూడా సిద్ధపడుతున్నట్టు సమాచారం. సర్పంచ్ పదవికి పోటీ పడే అభ్యర్థులను గుర్తించి వారిని బుజ్జగించే పనిలో పడ్డారు.

బరిలో కోటీశ్వరులే

పంచాయతీ బరిలో అన్ని కులాలకు చెందిన కోటీశ్వరులు పోటీ చేయడానికి సిద్ధపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు సైతం పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. అయితే తమకు ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే కోటి రూపాయలు ఎరవేస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న పంచాయతీల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్నది. భూములు కొని ప్లాట్లుగా మార్చాలంటే గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరి. దీనివల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కోట్లాది రూపాయలు వస్తాయన్న ఆలోచనతోనే పలు పార్టీల సీనియర్ నేతలు సైతం సర్పంచ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ధనబలం కలిగిన నేతలంతా టీఆర్ఎస్ మద్దతు కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు.

పరువు కోసం ఆరాటం

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన కాంగ్రెస్ కనీసం పంచాయతీల్లో అయినా గెలిచి పరువు నిలుపుకోవాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటికే గ్రామాల్లో పట్టు కోసం ఆ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గెలిచి తీరాలంటే గ్రామ స్థాయిలో గెలుపు గుర్రాల కోసం వేట మొదలు పెట్టింది. పార్టీ మద్దతు కోసం వచ్చే వారిని ముందుగా వారి ఆర్థిక స్థోమత, గ్రామాల్లో వారికున్న పట్టు గురించి ఆరా తీస్తున్నది. ఇందులో భాగంగా మాజీల పనితీరు గురించి గ్రామ ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. మంచి పేరు, పలుకుబడి ఉంటే ఖర్చుకు వెనకాడ కుండా అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఈ రెండు పార్టీలతో పాటు ఇతర రాజకీయ పార్టీలు కూడా తమ ప్రాభల్యాన్ని చాటుకోవడానికి పావులు కదుపుతున్నాయి. గ్రామ స్థాయిలో గుర్తింపు వస్తే, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుకోవాలన్న ఆలోచనలతో కొత్త పార్టీలు భావిస్తున్నాయి.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఫిబ్రవరి 18న చలో ఢిల్లీ

- బీజేపీ విధానాలతో విద్యాసంక్షోభం: ఏఐఎఫ్‌ఆర్‌టీఈ ఆర్గనైజింగ్ కార్యదర్శి వికాస్‌గుప్త




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆలిండియా ఫోరమ్ ఆఫ్ రైట్ టు ఎడ్యుకేషన్ (ఏఐఎఫ్ఆర్‌టీఈ) ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ వికాస్‌గుప్త అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 18న చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా హుంకార్ ప్రదర్శన నిర్వంచాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వికాస్‌గుప్త మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం రోజురోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణతో విద్యారంగంలో అసమానతలు పెరిగిపోతున్నాయని చెప్పారు. హిందుత్వ ఫాసిస్టు, మతోన్మాద శక్తులు పెచ్చరిల్లుతున్నాయని అన్నారు. రాజ్యాంగ విలువలను పూర్తిగా విస్మరిస్తూ నేరపూరిత రాజకీయాలకు అండగా ఉండే విషపూరితమైన అంశాలను సిలబస్‌లో చేర్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌ను తగ్గించడం వల్ల మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయించాలని డిమాడ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని విస్మరిస్తూ మూసివేతకు దిగజార్చుతున్నారని అన్నారు. తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, పరిస్థితులను తెలుసుకునేందుకు వందరోజులపాటు విద్యాపోరాట యాత్ర చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని చెప్పారు. ప్రయివేటు విశ్వవిద్యాలయాల బిల్లును తీసుకొస్తూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర కొనసాగుతోందని అన్నారు. తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఫిబ్రవరి 18న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చైతన్య కార్యక్రమాలు, సెమినార్లు, నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ చక్రధర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణ, బాబురావు, లాల్‌టు, మైస శ్రీనివాసరావు, రవీందర్ (టీపీటీఎఫ్), రవిశంకర్‌రెడ్డి (డీటీఎఫ్), ఎం పరుశురాం (పీడీఎస్‌యూ), అశోక్ స్టాలిన్, శ్రీమన్ (ఏఐఎస్ఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

జనశక్తి సభ్యుడి అరెస్ట్

- పిస్టోల్, 19 బుల్లెట్లు, 2 సెల్‌ఫోన్‌లు స్వాధీనం : వెల్లడించిన జగిత్యాల ఏఎస్పీ మురళీధర్



నవతెలంగాణ- జగిత్యాల

జనశక్తి దళ సభ్యుడు వావిళాల సాయికిరణ్ అలియాస్ మహేష్ అలియాస్ భరత్‌ను జగిత్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను జగిత్యాల ఏఎస్పీ మురళీధర్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కొడిమ్యాల మండలం పూడురు ఎక్స్‌రోడ్ వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సాయికిరణ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. అతడిని జనశక్తి దళసభ్యుడిగా గుర్తించి అదే రోజు జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. అతని వద్ద నుంచి 32 ఎమ్ఎమ్ పిస్టోల్‌తో పాటు 19 బులెట్లు, 2 మాక్సిన్‌లు, 2 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. సాయికిరణ్ జనశక్తి నాయకుడు మూర్తి శ్రీనివాస్ అలియాస్ యాదన్న ద్వారా దళంలో చేరాడు. సాయికిరణ్ ఇప్పటికే జగిత్యాల, రాజన్న సిరిసిల్లా జిల్లాల్లో బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటరమణ, మల్యాల సీఐ నాగేంద్ర, కొడిమ్యాల ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జోష్
నవతెలంగాణ

బిజీ లైఫ్‌లో అందరితో ఉన్నట్టే ఉంటారు. ఒంటరిగా జీవిస్తుంటారు. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి నిద్రపోయే వరకు యువత సోషల్‌మీడియాలో మునిగిపోతున్నారు. ప్రస్తుతం యువత నుండి ఈ అంటువ్యాధి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ సోకింది. రోజుకు రెండు గంటల కంటే ఎక్కువ సోషల్ మీడియా ఉపయోగిస్తున్నవారు మానవసంబంధాలకు దూరమవుతున్నారనేది అక్షర సత్యం. ఒంటరి జీవితానికి అలవాటు కావడం, కుంగుబాటు, చిన్న చిన్న సమస్యలను పరిష్కరించు కోలేకపోవడం వంటి మానసిక అవలక్షణాలకు చేరువవుతున్నారు.



సోషల్‌మీడియా ఎఫెక్ట్..

ముచ్చట్లు పెట్టుకోవడానికి ముగ్గురు దోస్తులు లేరు. కష్ట సుఖాలు పంచుకోవడానికి తోబుట్టువులు లేరు. ప్రేమానురాగాలు, అప్యాయతలు అగుపించడం లేదు. ప్రస్తుతం నోటి మాటలు, చేతి స్పర్శను మరిచిపోయి ఎన్నాళ్లవుతుందో... కష్టసుఖాలు, నవ్వడం, ఏడవడం, అరవడం, కొరకడం అన్నీ సోషల్ మీడియాలోనే. జీవితంలో ఇంతగా అలుముకుపోయిన సోషల్ మీడియా ఏం చేస్తుందంటే కొడుకు వచ్చి ఓదారుస్తాడు అని కన్నవారు 'కష్టం ఉందిరా' అని ఫోన్ చేస్తే వీడియో కాల్ చేసి 'నాన్నా నాకు సెలవు దొరకడం లేదు' అంటే ఆ తల్లిదండ్రులను ఓదార్చే వారు ఎవరు చెప్పండి.

మానవత్వం ఎక్కడా..?

పని చేసి అలసిపోయాం. శారీరక శ్రమను మరిచిపోవడానికి కాసేపు ఒంటరిగా కూచుంటే ప్రశాంతత దొరుకుతుంది. కానీ ఒంటరితనం మనిషిలోని మనసుకు సంబంధించినది. ఉరుకుల పరుగుల జీవితంలో కాసేపు ఏకాంతం దొరికితే అపురూపంగా ఆస్వాదిస్తాం. కానీ ఎప్పుడూ ఒంటరిగానే ఉండాల్సి వస్తే... మనిషిని అది భయపెడుతుంది. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న కొత్తకొత్త రోగాలకు, ఉద్వేగాలకు, ఉన్మాద చర్యలకు, విద్రోహ చర్యలకు, ఆత్మహత్యలకు పురికొల్పబడటం ఇలాంటివన్నింటికి ప్రధాన కారణం అన్ని ఉండీ కూడా ఒంటరి జీవితం అనుభవించడం. ఆధునిక టెక్నాలజీతో దూసుకుపోతున్న ప్రపంచంలో విహరిస్తూ తనకు తానుగా అన్నింటికీ దూరంగా ఉంటూ అందరికి దూరం అవుతూ మనసుకు సంబంధించిన భావాలను పంచుకోవడానికి ఎవరూ లేకుండా జీవనాన్ని వెల్లదీస్తున్నారు. ఒంటరితనం అనేది ప్రాణాలను తీస్తుంది, ప్రాణాలను తీసుకునేలా చేస్తుంది.

ఒంటరితనం పలు కారణాలు

బాల్యదశలో తల్లిదండ్రులు మరణించడం, పెంచుకున్నవారు సరిగా అప్యాయంగా చూసుకోకపోవడం, తల్లిదండ్రులు పదే పదే ఇతరులతో పోల్చుతూ మాటలనడం, తల్లిదండ్రుల నుండి సరైన ప్రేమ లభించకపోవడం వల్ల చిన్నప్పటి నుండే ఒంటరితనంలోకి వెళ్లే ప్రమాదముంది. పిల్లవాడు హైస్కూల్‌కి వచ్చాడంటే చాలు హాస్టల్‌లో వేయడం. ఇక్కడి నుండి ప్రారంభమవుతుంది తల్లిదండ్రుల, తోబుట్టువుల ప్రేమ అప్యాయతలకు దూరంగా పెరగడం. యుక్త వయసు వచ్చేసరికి ఉద్యోగరీత్యా ఉన్న ఊరినీ, కన్న తల్లిదండ్రులనీ వదిలి పట్నాలకు వలస వెళ్తుంటారు. దానివల్ల మనసుపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. ప్రేమించిన అమ్మాయి దక్కకపోవడం, కుటుంబ సమస్యలు, విడాకులతో విచ్ఛిన్నమైన వివాహబంధం, దగ్గరి వాళ్ల అకాలమరణం లాంటివి ఒంటరి జీవితానికి పురికొలుపుతాయి. ప్రతీ రోజు పనులతో బిజీగా ఉండే మనం హైదరాబాద్‌లో అయితే ట్రాఫిక్ సమస్యతో ఇంటికి చేరేందుకు నానా అవస్థలు పడుతున్నాం. చివరకు ఇంటికి చేరుకొని కొంచెం టీ తాగడం పూర్తయిన తర్వాత ఇంట్లో ఉన్న వాళ్లతో మాట్లాడే నాలుగు మాటల సమయం కూడా సెల్‌ఫోన్లలో,



వాట్సాప్, ఫేస్‌బుక్‌లతోటే సమయాన్ని గడిపేస్తున్నాం. ఇక ఇంటి చుట్టుపక్కల వాళ్లతో మాట్లాడానికి సమయమెక్కడుంది. ప్రస్తుత జీవన విధానం ఇలా తగలడింది. సోషల్ మీడియా పుణ్యమా అని ఎక్కడెక్కడి వారినో కలిపేస్తున్నది. కానీ మనుషుల మనసుల్ని మాత్రం దూరం చేస్తూ వారిని మరింత ఒంటరివాళ్లను చేస్తున్నది ఈ సోషల్ మీడియానే. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ లలో.. ఫ్రెండ్స్, ఫాలోయర్స్ లైక్‌లు, కామెంట్లు పెరుగుతున్న కొద్దీ మనలో ఒంటరితనం మరింత పెరుగుతున్నట్టేనని గమనించండి. మనుషులలో ఉండే ఆత్మీయతకు దూరమై యంత్రాలలో ప్రేమానురాగాల కోసం, అప్యాయతల కోసం ఒంటరితనంతో పరుగులు తీస్తున్నారు ఈ జనం.

స్లో పాయిజన్

జీవితంలో ఒంటరిగా ఉంటే మొత్తం మనమే ఎంజాయ్ చేయవచ్చు అనుకుంటారు. నలుగురితో కలువలేకపోవడమనేది, కలివిడిగా మాట్లాడలేకపోవడం కూడా మానసిక సమస్యే. చిన్న కుటుంబాలతో ఈ ఒంటరితనం మరింత ఎక్కువగా మారింది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. దానివల్ల పిల్లలను తల్లిదండ్రులు కోపంగా ఏమైనా అంటే వెంటనే అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు పిల్లలను దగ్గరకు తీసుకొని ఓదార్చేవారు. పిల్లలు అన్నం తినమని మారాం చేస్తే అమ్మ పెరుగన్నం కలిపి చందమామను చూపిస్తూ, పాట పాడుతూ అన్నం తినిపించేది. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారిపోయింది. అన్నం తినమంటే సెల్‌ఫోన్‌లో గేమ్ పెట్టించి అన్నం తినిపించడం మూలంగా చిన్నప్పటినుండే పిల్లలు ఫోన్‌లకు బానిసలుగా మారుతున్నారు. మన జీవన విధానాలలో మార్పు వల్లనే ఒంటరితనం వస్తుంది. ఈ ఒంటరితనం అనేది మానసికంగానే కాకుండా శారీరకంగా బలహీనపరుస్తుంది. ఒంటరితనం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఒత్తిడి కారణంగా విడుదలయ్యే నెగెటివ్ హార్మోన్స్ మెల్లమెల్లగా అనారోగ్యాలకు దారితీసేలా చేస్తాయి. ఒంటరితనమనేది మెల్ల మెల్లగా మన జీవితాన్నే అంతం చేస్తుంది. ఇది స్లో పాయిజన్‌లా పనిచేస్తుంది.

జయించండిలా...

ఆత్మన్యూనతా భావం జీవితాన్ని అస్థవ్యస్తం చేస్తుంది. మిమ్మల్ని సుఖంగా నిద్ర పోనివ్వదు. శాంతంగా బతకనివ్వదు. కాబట్టి స్వేచ్ఛగా జీవించండి. ఇతరుల కన్నా మీరు ఎందులోనూ తక్కువ కాదన్న భావనలో ఉండండి. నవ్వాలనుకుంటే మనస్ఫూర్తిగా నవ్వండి. దుఃఖం కలిగితే భారం దిగిపోయేంత వరకు ఏడ్చేయండి. దీనివల్ల మనసు తేలికవుతుంది. నలుగురిలో ఉన్నప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలోనన్న ఆలోచన రానివ్వద్దు. ఎదుటి వారి అభిప్రాయాలు, మాటలను గౌరవించడం నేర్చుకోండి. ప్రతి విషయాన్ని భూతద్దంలో కాకుండా పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకోండి. ఒంటరిగా జీవించే ప్రతి ఒక్కరూ అక్కర్లేని, అవసరం లేని ఆలోచనలకు తావియ్యకండి. వృత్తిరీత్యా ఎంతోమందిని కలుస్తాం. ఎన్నో సంఘటనలు ఎదురవుతాయి. వాటన్నింటినీ గుర్తు పెట్టుకోవాల్సిన పనిలేదు. ఎప్పుడూ ఇతరుల కోసం కష్టపడుతున్నామన్న భావనతో ఉండొద్దు. ఈ జీవితం మీది. మీకోసం మీరు జీవించండి. ఈ ఆలోచనే మీకు ఎక్కడ లేని శక్తినిస్తుంది. ఎప్పుడూ తెలిసిన వారినే కలవడం కాకుండా అప్పుడప్పుడూ కొత్తవారినీ కలవండి.



- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి,
9703935321

చెంతకురా


చిలిపి పనుల చేష్టలకు
దరహాసం నువ్వైనపుడల్లా
వసంతపు చిగురునై
పులకిస్తుంటా నేను

చందమామలా నువ్వు
నవ్వినప్పుడల్లా
యవ్వనవన్నెకు
వెన్నలనద్దిన వేకువై
ప్రకాశిస్తాను నేను

నా ఊహల మట్టిపై నువ్వు
అంకురమైనపుడల్లా
నిన్ను కంటికిరెప్పలా చూసుకునే
మమతానురాగలను నిండిన
రైతునవుతాను నేను

నాలో ప్రేమలా
మారిన మౌనం నీవే
నీ మౌనానికి శూన్యమై
ఏదురుచూస్తున్నది నేనే
ఇకనైనా అల్లరికి ఆనందం పరిచయం చేద్దాం
చెంతకురా ప్రియతమా

-అభిరామ్,981463065



కాలం గెలుస్తున్నది

తన గమనంలో
క్షణమైనా ఆగక !
కాలం ఓడిపోతున్నది
అర క్షణమైనా
నిను మరిపించలేక !
నే కాలగర్భంలో కలిశానని
కబురు అందినపుడు
నన్నూ గెలిపించు కన్నీరిడక !

- సురేంద్ర రొద్ద
9491523570



మనసంతా నీవైతే!!



కనుల నిండా నీవుంటే
కునుకెలా సాధ్యం?
మనసంతా నీవైతే
మౌనానికేది స్థానం?
వీనుల విందుగా నీ రాగాలుంటే
వినిపించునా మరో గీతం?
ఎద నిండా నీవే ఉంటే
కనిపించునా మరో రూపం?

-సిరా

చిగురు

ఆమెనలా
చూస్తున్నకొద్దీ
కొత్తదనం
ఉట్టిపడుతూనే వుంది

ఏళ్ళు గడుస్తున్నా
తరగని తన్మయత్వం
మనసులో
భావుకత రెట్టింపు
ఆస్వాదించే మనసులో
పొరపొచ్చాలు లేనేలేవు

చూసే కోణం
గడపాలనుకుని కాదు
జీవించే దృశ్యంలో
శ్రవణం కన్నా
వీక్షణమే
స్పందనల మేలుకొలుపు

మాటల వైరుధ్యాలు
స్పర్శ తో దూరం



దగ్గరయ్యే మనసులు
తుళ్లింతలో మేను
తిండీతిప్పలు
ఆలింగనంలో ఆమడ దూరం

గాఢ పరిష్వంగంతో
మనసునావరించిన
గాఢాంధకారం సైతం తరిమేత

జీవనంలో
ఆమె నా విల్లు
అమ్ములపొదిలో
ఎన్ని బాణాలున్నా
ఆమె లేకపోతే పునాదిలేని
భవనాన్ని నేను

తరగని ఆస్తి ఆమె
భావమామె చుట్టూ
అల్లుకున్న తిప్పతీగ
తెంపలేనిది తెంపినా
చిగురు తొడుగుతునే
ఉంటదంతే

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

ఫన్.కాం

డబ్బులు ఇస్తే.. కొట్టాడు!

ఒకరోజు రాత్రి 20 నుంచి 25 సంవత్సరాల మధ్యనున్న ఒక అబ్బాయి హైదరాబాద్ నగర వీధుల్లో తిరుగుతుంటాడు.

అలా నడుస్తూ వుండగా.. కొంతదూరం వెళ్లిన తరువాత ఫుట్ పాత్ లో ఒంటిమీద బట్టలు లేకుండా కేవలం చడ్డీ మాత్రమే వేసుకుని కూర్చున్న ఒక మనిషిని చూస్తాడు.

అతనిని చూసిన వెంటనే ఆ అబ్బాయికి అతని మీద దయ కలుగుతుంది. దాంతో అతను 50 రూపాయలు ఆ మనిషికి ఇవ్వాలని దగ్గరగా వెళతాడు.

తను డబ్బులు ఇచ్చిన వెంటనే ఆ వ్యక్తి ముందుగా వాటిని చూసి, నిశ్శబ్దంగా నిలబడతాడు.

అనుకోకుండా చాలా గట్టిగా ఆ అబ్బాయి చెవికింద ఒక పెద్ద మోత వాయిస్తాడు (చెంపదెబ్బ కొడతాడు).



కొట్టగానే ఆ అబ్బాయి ఒక్కసారిగా బెంబేలెత్తిపోయి అతనివైపు బిత్తర చూపులు చూస్తాడు.

అప్పుడు ఆ వ్యక్తి అబ్బాయితో ఇలా అంటాడు... "అక్కడ ముందరున్న ఒక ఫ్లాట్ కనిపిస్తోందా..? అది నాదే! ఇంట్లో కరెంట్ లేకపోవడం వల్ల ఇలా బట్టలు లేకుండా బయట కూర్చోవాల్సి వచ్చింది"!

ఈ మాటలు వినగానే అబ్బాయి ఒకేసారి కోమాలోకి వెళ్లిపోతాడు.



ఇలా ప్రిపేర్ అవ్వండి

ఉద్యోగాలను సంపాదించుకోవడం కోసం ప్రస్తుత కాలంలో యువతీయువకులు ఎన్నోరకాల ఇంటర్వ్యూలకు హాజరవుతుం టారు. అందులో కొంతమందికి తొందరగా జాబ్ లభిస్తే.. మరికొంతమందికి అస్సలు దొరకదు. అటువంటి తరుణంలో జాబ్ సంపాదించడానికి ముఖ్యమైన అంశాలగురించి తెలుసుకోవడం ఎంతో ఉత్తమం.

- జాబ్ అనేది కేవలం మన చదువులనుగాని, హుందాతనాన్ని బట్టిగాని వరించదు. జాబ్ పొందడం కోసం ప్రత్యేకంగా డబ్బులను వెచ్చించి క్లాసులకు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. అది మన ప్రగతి, ప్రతిభ, నైపుణ్యం, అందం, కమ్యూనికేషన్ స్కిల్స్ మీద ఆధారపడి వుంటుంది.
- ఇటువంటి స్కిల్స్‌లో చాలామంది పొరపాటు పడుతుంటారు. జాబ్ సంపాదించుకునే ప్రయత్నంలో ప్రతిఒక్కరు తమ నైపుణ్యాన్ని, ప్రతిభను చూపిస్తారు. అయినప్పటికీ వారికి జాబ్ లభించదు. మరికొందరు చూడ్డానికి అందంగా, మంచి నైపుణ్యం, ప్రతిభ వున్నప్పటికీ కూడా జాబ్ లభించదు. ఇటువంటివారిలో చాలావరకు కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా తక్కువగా వుంటాయి.
- జాబ్ సంపాదించుకోవడం అనేది కేవలం ఒక్క అంశం మీదనే కాదు... అన్ని అంశాలలో పాస్ అయినప్పుడే మనం ముందుకు సాగగల్గుతాం. ఒక మంచి ఉద్యోగాన్ని సంపాదించుకుని ప్రోత్సాహాన్ని పొందుతాం.
- మీరు ఏదైనా ఒక ఇంటర్వ్యూకి హాజరువుతున్నారు అంటే ముందు మీ అప్పియరెన్స్ బాగుండాలి. చూడ్డానికి అందంగా కనిపించినప్పుడు మనలో వున్న డిసిప్లైన్ ని వారు గ్రహించగలరు. అందుకే ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్ అంటారు. అయితే కేవలం అందం ఒక్కటే సరిపోదు.. మీరు ఎంచుకున్న ఉద్యోగానికి తగిన నైపుణ్యాలను కలిగి వుండాలి. దానికి సంబంధించి అన్నివిధాల జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే జాబ్ లభించే అవకాశం వుంటుంది.
- కొంతమంది ఇలా మన అప్పియరెన్స్ ఒక మోస్తరు మంచి మార్కులే వేస్తే.. మరికొన్ని ఆఫీసులలో దీనికి భిన్నంగా వుంటుంది. మన అప్పియరెన్స్‌తో పాటు నలుగురిలో కలిసిపోయే స్వభావాన్ని కలిగి వుండాలి. మనం మాట్లాడే విధానం సూటిగా వుంటూ వారిని ఆహ్లాదపరిచేదిగా వుండాలి. దానికితగ్గ నైపుణ్యాన్ని ప్రదర్శించు కోగలిగితే.. సింపుల్‌గా జాబ్ మీ జేబులో వున్నట్టే లెక్క.
- ఏదైనా ఒక రంగంలో ఉద్యోగం సంపాదించాలంటే ముందుగా దానికి కావలసిన అర్హతలన్నీ వివరంగా తెలుసుకోవాలి. అందులో మొత్తం కాకపోయినా.. కాస్త అవగాహన అనేది మనకు చాలా ముఖ్యం. ఏదైనా ఒక ఇంటర్వ్యూకి అటెండ్ అవ్వడానికి ముందు.. మీకు మీరు పరీక్షించుకుని చూడండి. మీలోని స్వభావాలను వ్యక్తపరుచుకోండి. మీలో వున్న వ్యక్తిత్వాన్ని బయటపెట్టుకోండి. మీలో జాబ్ పొందడానికి నిర్ణీత అర్హతలు వున్నాయని భావిస్తే చాలు... సంపూర్ణ విశ్వాసంతో మీరు ముందడుగు వేయొచ్చు.



రాబోయే రోజుల్లో మన సినిమాల పేర్లు

1. " ఇంట్లో బావ, ఆఫీసులో జావా"
2. " 'C' వీరుడు, 'C++' సుందరి "
3. " నీ పాస్ వర్డ్ నాకు తెలుసు"
4. " ప్రోగ్రాం రాద్దాం రా!"
5. " ఇంట్లో వైరస్, వంటింట్లో యాంటీ వైరస్"
6. " 'C' డ్రైవ్ లో ఇల్లాలు, 'పెన్ డ్రైవ్' లో ప్రియురాలు "
7. " మైక్రోసాఫ్ట్ వాకిట్లో విండోస్ చెట్టు"
8. " క్యాంపస్ ప్లేస్ మెంట్స్ కు దారేది"
9. " చిప్పుజారి గల్లంతయ్యిందే!"
10. "100% ఔట్ పుట్!"



మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలను కుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, కవితలు, జోకులు ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి. మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020.

e-mail : navatelangana.josh @gmail.com



కొత్త చాంపియన్ బెంగళూర్ బుల్స్

ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 6

- ఫైనల్లో గుజరాత్‌పై 38-33తో గెలుపు
- పవన్ షెరావత్ సూపర్ ప్రదర్శన

ముంబయి : పవన్ కుమార్ షెరావత్ 22 కూత పాయింట్లు బెంగళూర్ బుల్స్‌ను ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 6 చాంపియన్‌గా నిలిపింది. బలమైన గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్‌పై విరామ సమయానికి ఏడు పాయింట్ల వెనుకంజలో నిలిచినా, ద్వితీయార్థంలో డబుల్ రైడ్ పాయింట్లతో చెలరేగిన పవన్ షెరావత్ బెంగళూర్ బుల్స్‌ను కొత్త చాంపియన్‌గా నిలిపాడు. ఆఖరు మూడు నిమిషాల వరకూ టైటిల్ రేసులో నిలిచిన గుజరాత్, పవన్ షెరావత్ కండ్లుచెదిరే రైడింగ్‌తో టైటిల్‌పై ఆశలు కోల్పోయింది. హోరాహోరీ ఫైనల్లో 38-33తో ఐదు పాయింట్లతో బెంగళూర్ గెలుపొందింది. తొలి పది నిమిషాల్లో 6-6తో సమవుజ్జీలుగా సాగినా, ప్రథమార్థంలో గుజరాత్ ఆధిపత్యం చూపించింది. 16-9తో బెంగళూర్‌పై పైచేయి సాధించింది. ద్వితీయార్థంలోనూ ఆ జట్టు జోరు సాగింది. కానీ వరుసగా కూతకెళ్లిన ప్రతిసారి రెండేసి పాయింట్లు కొల్లగొట్టిన పవన్ కుమార్ బెంగళూర్‌ను ఆధిక్యంలో నిలిపాడు. 27వ నిమిషం వరకూ ఆరు పాయింట్ల ముందంజలో నిలిచిన గుజరాత్ 31వ నిమిషంలో 23-22తో వెనుకంజ వేసింది. 37వ నిమిషంలో 29-29తో స్కోరు సమంగా ఉన్న తరుణంలో రెండు పాయింట్లతో గుజరాత్‌ను ఆలౌట్ చేసిన పవన్ 36-29తో బెంగళూర్ విజయాన్ని ఖాయం చేశాడు. గుజరాత్ తరఫున సచిన్ 10 పాయింట్లు, సునీల్ కుమార్ 4 టాకిల్స్‌తో మెరిసినా ఫలితం దక్కలేదు. రైడింగ్‌లో బెంగళూర్ 26 పాయింట్లు సాధించగా, గుజరాత్ 20 పాయింట్లే పొందింది. డిఫెన్స్‌లో బుల్స్ 7, గుజరాత్ 8.. ఆలౌట్స్‌లో బుల్స్ 4, గుజరాత్ 2 పాయింట్లు సాధించాయి. గుజరాత్‌కు మూడు అదనపు పాయింట్లు లభించగా, బుల్స్ ఒక్క పాయింట్ లభించింది. కూతలో దుమ్మురేపిన బుల్స్ కబడ్డీ టైటిల్ ఎగరేసుకుపోయింది.

మహిళల జట్టు కోచ్ గొడవ మళ్లీ మొదటికి!



ముంబయి : పాలకుల కమిటీ (సీఓఏ) సభ్యుల భిన్న అభిప్రాయాల ప్రభావం మహిళల క్రికెట్ జట్టు కోచ్ ఎంపికపై కొనసాగుతూనే ఉన్నది. కపిల్‌దేవ్ కమిటీ ఆధ్వర్యంలోని కమిటీ డబ్ల్యూ.వీ రామన్‌ను చీఫ్ కోచ్‌గా ఎంపిక చేయడాన్ని పాలకుల కమిటీ సభ్యురాలు డయనా ఎదుల్జీ తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో రామన్ అధికారికంగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాజాగా రామన్ వేతన ఫైల్‌పై అనుమతి కోరుతూ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి సీవోఏకు లేఖ రాశారు. అంగీకారం తెలపాలని కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ లేఖను ఎదుల్జీకి పంపించారు. దీనిపై మరోసారి అభ్యంతరం వ్యక్తం చేసిన ఎదుల్జీ.. రామన్‌ను న్యూజిలాండ్ పర్యటన కోసం తాత్కాలిక కోచ్‌గానే ఎంచుకోవాలని, క్రికెట్ సలహా సంఘంతో కొత్త కోచ్‌ను ఎంపిక చేయాలని వాదించింది. నిబంధనలు పాటించకుండా సీఈవో, సీఎఫ్ఓ, జీఎంలు రామన్ ఎంపికను సమర్థిస్తే బీసీసీఐ డబ్బులు వృథా చేసిన వ్యవహారంలో భాగమవుతారని హెచ్చరించింది. తన అభిప్రాయ లేఖను రాయ్‌తో పాటు బీసీసీఐ ఆఫీస్ బేరర్లకు పంపించింది. ఎదుల్జీ వ్యతిరేకించినా, కమిటీ చైర్మన్ సూచనతో రామన్‌ను పూర్తి స్థాయి కోచ్‌గా తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కానీ ఎదుల్జీ మళ్లీ అభ్యంతరం వ్యక్తం చేయటం గందరగోళ పరిస్థితికి దారితీస్తోంది.



ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ నెగ్గాలంటే భారీ స్కోర్లు బాదాలి. బౌలర్లు బ్యాట్స్‌మెన్ ఊపిరి సలపనీయకుండా వికెట్లు పడగొట్టాలి. మొదటి పని పుజారా, పంత్ అద్భుతం చేశారు. రెండో పని స్పిన్నర్లు అమోఘంగా అమలు చేస్తున్నారు. సహకారం లేని పిచ్‌పై ఆతిథ్య ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌కు ముకుతాడు వేసిన స్పిన్నర్లు ఆరు వికెట్లు కూలదోశారు. వెలుతురు లేమి, వర్షం రాకతో మూడో రోజు 16.3 ఓవర్ల ఆట సాగలేదు. లేదంటే, మూడో రోజే కంగారూ కథ ముగిసేది!. ఆసీస్ తోకను తొలి సెషన్లో కత్తిరించి, ఫాలోఆన్ ఆడిస్తారా? లేదా మళ్లీ బ్యాటింగ్ చేసి పైన్ సేనకు లక్ష్యాన్ని నిర్దేశిస్తారా? అనే ఆసక్తి నెలకొన్నది. ఆసీస్ ఆట కట్టించి, సిడ్నీపై తిరుగులేని పట్టు సాధించిన కోహ్లిసేన.. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విజయాన్ని ఖాయం చేసుకున్నది. సిరీస్ విజయం 2-1, లేదా 3-1 తేడాతో అనేది తేలేందుకు సిడ్నీలో చివరి రెండు రోజుల ఆట!.

కంగారూ ఆట కట్టు!

- కుల్దీప్, జడేజా మాయజాలం
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 236/6
- ఆసీస్‌కు కలిసొచ్చిన వెలుతురు లేమి, వర్షం

సిడ్నీ (ఆస్ట్రేలియా)



స్పిన్నర్లు రాణించటంతో సిడ్నీ టెస్టులో కంగారూ ఆట కట్టు. చైనామన్ కుల్దీప్ యాదవ్ (3/71), రవీంద్ర జడేజా (2/62) మాయతో తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 236/6తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. స్పిన్ మాయలో బ్యాటింగ్ లైనప్‌ను కోల్పోయిన కంగారూ శిబిరం మరో 187 పరుగులు చేయకుంటే ఫాలోఆన్ ప్రమాదంలో పడనున్నది. ఇప్పటికే టెస్టుపై ఆశలు కోల్పోయిన ఆతిథ్య జట్టు.. టెయిలెండర్ల అద్భుతంతో డ్రా పై ఆశలు పెట్టుకున్నది. ఓపెనర్ మార్కస్ హారీస్ (79, 120 బంతుల్లో 8 ఫోర్లు) తొలి సెషన్లో మెరిసినా, ఆసీస్ పతనం ఆగలేదు. చివరి సెషన్లో తొలుత వెలుతురు లేమి, తర్వాత వర్షం రాకతో మూడో రోజు 16.3 ఓవర్ల ఆట సాగలేదు. నేడు ఓ అర గంట ముందుగానే ఆట ఆరంభం కానున్నది. కానీ వాతావరణం నేడు సైతం మేఘావృతమై ఉండటంతో ఆసీస్ శిబిరంలో డ్రా ఆశలు చిగురిస్తున్నాయి. మూడో రోజు ఆట ముగిసే సమయానికి పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (28), పాట్ కమిన్స్ (25)లు క్రీజులో కొనసాగుతున్నారు.

మార్కస్ ప్రతిఘటన : ఓవర్‌నైట్ స్కోరు 24/0తో మూడో రోజు ఆట మొదలెట్టిన ఆస్ట్రేలియాకు తొలి సెషన్లో ఆశించిన ఆరంభమే లభించింది. ఓపెనర్లు మరో పది ఓవర్ల పాటు వికెట్ కాపాడుకున్నారు. పంత్ జీవనదానంతో బతికిపోయిన ఖవాజ (27) తొలి వికెట్ రూపంలో నిష్క్రమించాడు. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా బంతిని విసిరిన కుల్దీప్.. ఖవాజను ఊరించాడు. లెగ్ సైడ్ షాట్ ఆడిన ఖవాజ టైమింగ్ తప్పాడు. దీంతో క్యాచ్ నేరుగా ఫీల్డర్ చేతుల్లోకి వెళ్లింది. కానీ మరో ఎండ్‌లో మార్కస్ హారీస్ (79, 120 బంతుల్లో 8 ఫోర్లు) ప్రతిఘటించాడు. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై అర్ధ సెంచరీ సాధించిన మార్కస్ ఆసీస్ ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. కానీ జడేజా మాయతో అతడూ పెవిలియన్ చేరాడు. జడేజా లెంగ్త్ బంతిని స్క్వేర్ కట్ చేయబోయిన మార్కస్ లెగ్ వికెట్‌ను కోల్పోయాడు. దీంతో 128 పరుగుల వద్ద ఆసీస్ రెండో వికెట్ కోల్పోయింది.

మాయ చేశారు : ఓపెనర్ల నిష్క్రమణ తర్వాత ఆసీస్ వికెట్ల పతనం వేగవంతమైంది. సీనియర్ బ్యాట్స్‌మన్ షాన్ మార్ష్ (8)ను వచ్చీ రాగానే జడేజా సాగనంపాడు. క్రీజులో ప్రమాదకరంగా పరిణమించిన మార్నస్ (38, 95 బంతుల్లో 7 ఫోర్లు)ను షమి అవుట్ చేశాడు. సిరీస్‌లో ఆసీస్‌కు నిలకడగా రాణించిన ట్రావిశ్ హెడ్ (20) పని కుల్దీప్ పట్టాడు. చాకచక్యమైన రిటర్న్ క్యాచ్‌తో హెడ్‌ను వెనక్కి పంపించాడు. కెప్టెన్ టిమ్ పైన్‌ను అదనపు బౌన్స్‌తో బోల్తాకొట్టించాడు కుల్దీప్. డ్రైవ్ చేయడానికి ప్రయత్నించినా, అదనపు టర్న్‌తో బంతి వికెట్లను గిరాటేసింది. దీంతో ఆసీస్ ఆరో వికెట్ కోల్పోయింది. ఏడో వికెట్‌కు పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (28, 91 బంతుల్లో 3 ఫోర్లు), పాట్ కమిన్స్ (25, 41 బంతుల్లో 6 ఫోర్లు) ధాటిగా ఆడారు. అజేయంగా 38 పరుగులు జోడించి, ఆసీస్ పతనాన్ని అడ్డుకున్నారు.

భారత్ తొలి ఇన్నింగ్స్ : 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : మార్కస్ హారీస్ (బి) జడేజా 79, ఉస్మాన్ ఖవాజ (సి) పుజార (బి) కుల్దీప్ 27, మార్నస్ (సి) రహానె (బి) షమి 38, షాన్ మార్ష్ (సి) రహానె (బి) జడేజా 8, ట్రావిశ్ హెడ్ (సి,బి) కుల్దీప్ 20, పీటర్ హ్యాండ్స్‌కాంబ్ బ్యాటింగ్ 28, టిమ్ పైన్ (బి) కుల్దీప్ 5, పాట్ కమిన్స్ బ్యాటింగ్ 25, ఎక్స్‌ట్రాలు : 06, **మొత్తం : (83.3 ఓవర్లలో 6 వికెట్లకు) 236.**

వికెట్ల పతనం : 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198.

బౌలింగ్ : మహ్మద్ షమి 16-1-54-1, జస్‌ప్రీత్ బుమ్రా 16-4-43-0, రవీంద్ర జడేజా 27.3-9-62-2, కుల్దీప్ యాదవ్ 24-6-71-3.

రాహుల్ క్రీడాస్ఫూర్తి


ఆసీస్‌తో సిరీస్‌లో రాహుల్ బ్యాట్‌తో ఘోరంగా విఫలమయ్యాడు. కేవలం 57 పరుగులతో జట్టులో స్థానాన్ని సైతం ప్రశ్నార్థకం చేసుకున్నాడు. కానీ మూడో రోజు ఆటలో క్రీడాస్ఫూర్తి చాటిన రాహుల్ అంపైర్‌తో పాటు ఆసీస్ అభిమానుల మనసూ దోచుకున్నాడు!. మూడో రోజు ఐదో ఓవర్లో జడేజా ఓవర్లో మార్కస్ ముందుకొచ్చి షాట్ ఆడాడు. మిడ్ ఆన్‌లో డైవ్ చేస్తూ క్యాచ్ పట్టిన రాహుల్.. వెంటనే బంతి ముందుగా నేలకు తాకిందని, అవుట్ కాదని సిగ్నల్ ఇచ్చాడు. రాహుల్ క్రీడాస్ఫూర్తిని ఫీల్డ్ అంపైర్ ఇయాన్ మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. చప్పట్లతో రాహుల్‌ను అభినందించాడు. క్రికెట్ ఆస్ట్రేలియా ఈ వీడియోను అధికారిక ట్విట్టర్‌లో ఖాతాలో పోస్ట్ చేసింది.



పంత్ మరో గిల్‌క్రిస్ట్

ఆసీస్ లెజెండ్ పాంటింగ్ ప్రశంస

సిడ్నీ : భారత యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ గొప్ప కితాబిచ్చాడు. రిషబ్ పంత్ మరో గిల్‌క్రిస్ట్ కాగలడని ప్రశంసించాడు. ' రిషబ్ పంత్‌లో నిజమైన ప్రతిభ ఉంది. బంతిని బాగా బాదగలడు. మెరుగైన గేమ్స్ సెన్స్ ఉంది. ఐపీఎల్‌లో అతడికి కోచ్‌గా పని చేయటం అదృష్టం. వికెట్ కీపింగ్‌లో మరికొంత మెరుగవ్వాలి, అప్పుడు బ్యాట్స్‌మన్‌గా పరిణతి సాధించగలడు. అతడి గురించి కామెంటరీ బాక్స్‌లో మాట్లాడుకున్నాం. పంత్ మరో గిల్‌క్రిస్ట్ వంటి వాడు' అని పాంటింగ్ అన్నాడు. ఎప్పుడూ ఎం.ఎస్ ధోని గురించి, భారత క్రికెట్‌పై అతడి ప్రభావం గురించి మాట్లాడతాం. ధోని 99 టెస్టుల్లో ఆరు సెంచరీలే చేశాడు. కానీ 21 ఏండ్ల పంత్ తొమ్మిది టెస్టుల్లోనే రెండు శతకాలు బాదాడు. మరికొన్ని 90 ప్లస్ ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఆసీస్‌పై పంత్ చూడచక్కని ఇన్నింగ్స్ ఆడాడు. నిజానికి ఈ కుర్రాడు గొప్ప ఎంటర్‌టైనర్. అతడి ఆట చూసేందుకు డబ్బు పెట్టేందుకు వెనుకాడను. నిజానికి సిడ్నీలో వచ్చీ రాగానే బంతిని బాదేస్తాడని అనుకున్నాం. కానీ ఇన్నింగ్స్‌ను నిర్మించే ఓపిక ఉందని నిరూపించుకున్నాడు. చివర్లో సహజశైలిలో రెచ్చిపోయాడు. భవిష్యత్‌లో భారత్‌కు మూడు ఫార్మాట్లలో స్టార్ క్రికెటర్ కాగల సత్తా పంత్ సొంతం. యువకుడిగా అతడు పొరపాట్లు దిద్దుకుంటే, సక్సెస్‌ఫుల్ టెస్టు క్రికెటర్ అవగలడని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు.



కుట్ర జరిగిందని..

సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ బూటకమని అన్నది గుజరాత్ పోలీసులే .. సీబీఐ కాదు కదా..

- ఇందులో రాజకీయ దురుద్దేశాలేమున్నాయి : న్యాయ నిపుణులు



న్యూఢిల్లీ : సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును న్యాయ నిపుణులు తప్పుబడుతున్నారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్, సోహ్రాబుద్దీన్, అతని భార్య కౌసర్ బీ, ప్రజాపతి హత్యల వెనుక కుట్ర దాగి వుందనడానికి అనేక ఆధారాలున్నాయని వారంతా చెబుతున్నారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్రమోడీ, గుజరాత్ పోలీస్ ఉన్నతాధికారుల పేర్లు ఈకేసుతో ముడిపడి ఉండటం వల్ల కేవలం రాజకీయ ప్రేరేపితమని కోర్టు నిర్ధారణకు రావటమేందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు తీర్పుపై రాజకీయ, న్యాయ విశ్లేషకులు ఏమంటున్నారంటే...

ఎన్‌కౌంటర్ బూటకమనీ, సోహ్రాబుద్దీన్, ఇతరుల హత్యల వెనుక పెద్ద కుట్ర దాగివుందనీ కేసు దాఖలుచేసిందే గుజరాత్ పోలీసులు. గుజరాత్ సీఎంగా నరేంద్రమోడీ ఉన్నప్పుడు...వారి పోలీసులే ఈ కేసు పెట్టారు. ఉన్నపళంగా సీబీఐ ప్రత్యక్షమై అమిత్ షా, మరికొంతమందిపై కేసులు పెట్టలేదు. వారిని నిందితులుగా చేర్చలేదు. తొలుత కేసు విచారణ జరిపింది గుజరాత్ పోలీసులు. అయితే అక్కడ సీఎంగా నరేంద్రమోడీ ఉన్నారు కాబట్టి, పోలీసులపై ఒత్తిడి ఉంటుందని, పక్షపాతరహితంగా విచారణ జరిగే అవకాశం ఉండదని సుప్రీంకోర్టు భావించింది. కాబట్టే తన పర్యవేక్షణలో ప్రత్యేక సీబీఐ కోర్టు విచారణకు ఆదేశించింది.

అది కూడా గుజరాత్ బయట ముంబయి కేంద్రంగా సీబీఐ పనిచేయాలని దిశానిర్దేశం చేసింది. అప్పట్నుంచీ ఇప్పటివరకూ ప్రత్యేక సీబీఐ కోర్టు విచారణ అంతా కూడా సుప్రీంకోర్టు మార్గనిర్దేశకాల ప్రకారం జరిగింది. అలాంటప్పుడు కేసులో రాజకీయ ప్రేరేపితం, దురుద్దేశాలు, కావాలని రాజకీయ నాయకుల్ని ఇరికించడాలు ఎలా సాధ్యపడుతుంది? అన్నది న్యాయ విశ్లేషకుల సందేహం. ప్రత్యేక సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల వీరంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. కేసును కావాలని బలహీనపర్చారన్న సందేహం వారు వ్యక్తం చేశారు.

అనేకమంది సాక్ష్యుల్ని భయభ్రాంతులకు గురిచేశారన్న వాదన తెరమీదకొచ్చింది. మొదట గుజరాత్ పోలీసు విచారణలో సాక్ష్యం చెప్పడానికి ఎవరూ ముందుకురాలేదు. సీబీఐ విచారణకు ఆదేశించాక వందల మంది రావటాన్ని సుప్రీంకోర్టు గ్రహించింది. అందుకే రాష్ట్రం బయట ఈ కేసు విచారణ జరపాలని ఆదేశించిందని న్యాయ నిపుణులు గుర్తుచేశారు. చార్జ్‌షీట్‌లో సాక్ష్యులుగా 500మందిపైగా పేర్లు పొందుపర్చారు. ఇందులో 210మందిని ప్రాసిక్యూషన్ ప్రశ్నించింది. కేవలం సాంకేతిక అంశాల్ని చూపి చాలామంది నిందితుల్ని విడుదలచేశారు. దీంతో విచారణ గతి తప్పింది. విచారణ సరిగ్గా సాగివుంటే ఈ కేసులో కుట్రకోణం బయటపడేదని న్యాయ నిపుణులు అన్నారు.

'పంచాయతీ'పై సమన్వయంతో వ్యవహరించండి..

జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి సూచించారు. శనివారం సచివాలయం నుండి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డిలతో కలసి పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎవరైనా పోలింగ్ సిబ్బందికి అనుకోని సంఘటన ఎదురైనప్పుడు తక్షణమే స్పందించేలా ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. సదరు అధికారి వివరాలను పోలింగ్ సిబ్బందికి తెలపాలని ఆదేశించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్, సెక్యూరిటి ప్లాన్, వాహనాలు, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్, స్టోరేజ్ సెంటర్ల గుర్తింపు, బడ్జెట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. జిల్లాలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అందుకనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. మొదటి, రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలకు రిటర్నింగ్ అధికారుల నియామకం, గుర్తించిన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, మైక్రో అబ్జర్వర్ల నియామకం, మండలాలకు వ్యయ పరిశీలకుల నియామకం తదితర అంశాలపై సమీక్షించారు. పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రింటింగ్, ఓటరు స్లిప్పుల ప్రింటింగ్, డిస్ట్రిబ్యూషన్, బ్యాలట్ పేపర్ల ప్రింటింగ్, పేపర్ సీల్స్, ఇంకుతోపాటు ఇతర అవసరమైన వాటన్నింటినీ సిద్ధంగా ఉంచుకుని పంపిణీ చేయాలని కోరారు.

సీఐసీలోని 4 ఖాళీల భర్తీకి కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ)లో నాలుగు పోస్టుల భర్తీకి కేంద్రం ప్రకటన జారీ చేసింది. దీంతో, సీఐసీలోని ఖాళీలన్నిటికీ ప్రకటన ఇచ్చినట్టయింది. సీఐసీలో మొత్తం 11మంది సభ్యులుండాలి. ఉద్యోగుల శిక్షణ విభాగం(డీవోపీటీ) తాజాగా జారీ చేసిన ప్రకటనతో మొత్తం ఖాళీలు భర్తీ కానున్నాయి. తాజా ప్రకటనలో సమాచార కమిషనర్ల విధులు, అధికారాలు 2005-ఆర్‌టీఐ చట్టానికి అనుగుణంగా ఉంటాయని తెలిపారు. అయితే, కమిషనర్ల జీతభత్యాలు, పదవీకాలంపై ప్రకటనలో పేర్కొనకపోవడంపై ఆర్‌టీఐ కార్యకర్తలు విమర్శిస్తున్నారు. గతేడాది జులైలో సీఐసీలోని మూడు ఖాళీల భర్తీకి జారీ చేసిన ప్రకటనలోనూ వేతనం, పదవీకాలంపై స్పష్టతనీయలేదు. సీఐసీలోని ఖాళీల భర్తీ కోసం ఆర్‌టీఐ కార్యకర్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన తర్వాతే కేంద్రం అందుకు సిద్ధపడటం గమనార్హం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.